# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 2, ఫిబ్రవరి 2026

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 2

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| ముక్తిప్రదాయిని మహాశివరాత్రి | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 8 |
| శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవం | 22 |
| మార్గదర్శకులు – మహర్షు లు (సీరియల్) | 25 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 29 |
| ముకుందమాల (సీరియల్) | 36 |
| శివ విజయం | 38 |
| మీ ప్రశ్న మా సమాధానం | 41 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 42 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 48 |
| మహిమాన్వితం – మాఘస్నాన మహిమ | 56 |
| నవవిధ భక్తిమార్గాలు– పాదసేవనం | 58 |
| ఆమలక ఏకాదశీ వ్రత వైశిష్ట్యమ్ | 61 |
| తీర్మానపు హారతి | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# జీవితము – సమస్యలు

మానవ జీవితం సమస్యల వలయంతో కూడుకున్నది. సమస్యలు ఎంతటి వ్యక్తినైనా అథః పాతాళానికి తీసుకువెళతాయి. మనస్సును అస్థిరపరచుతాయి. ఫలితంగా అసహనము, కోపము కలిగి వివేకం కోల్పోతాము. శారీరకంగా, మానసికంగా కృంగిపోతాము. ఎంతో బాధను అనుభవిస్తాము. కాని ఇదే సమయంలో జీవితం, జీవితపు విలువలు అవగతమవుతాయి. సంఘంలో మన స్థాయిని గుర్తించగలము. ఈ సందర్భంలోనే భగవంతుని ఉనికి, ఆయన విషయాలు చక్కగా మనస్సుకెక్కగలవు. మన మనస్సు కూడా స్థిర చిత్తంతో ఆయనపై లగ్నమవగలదు. కాబట్టి మానవ జీవితాన్ని అర్థం చేసుకొనుటకు, పరివర్తన చెందుటకు సమస్యలు తప్పనిసరి. సమస్యలు మానవునికి వారి వారి కర్మానుసారమే ప్రాప్తిస్తాయని పెద్దలంటారు. జ్ఞానవృద్ధికి సమస్యలు ఎంతో ఉపకరిస్తాయి. అర్జునునికి సమస్యల మధ్యనే భగవద్గీతను ఉపదేశించుట జరిగింది. ఇలా జ్ఞానప్రాప్తికి సమస్యలు ఉపకరించినప్పటికీ, వీటి ద్వారా మనిషి కష్టాలను అనుభవించుట అన్నది సత్యం! మరి ఈ సమస్యల నుండి తప్పించుకొనుట మానవునికి సాధ్యమవుతుందా? అంటే... సాధ్యం కాదనే చెప్పాలి. ప్రతి వ్యక్తి తన కర్మను అనుభవించి తీరాల్సిందే తప్ప తప్పించుకోలేము. కాని భగవంతుని నామస్మరణ ద్వారా వీటి ప్రభావాన్ని కొంతవరకు తగ్గించుకోగలము. సమస్యలు రాకుండా జీవించలేము కాని వచ్చిన సమస్యలను త్వరగా తగ్గించుకొనుటకు, వాటి ప్రభావం మనపై లేశ మాత్రంగా ఉండుటకు భగవంతుడు ఒక చక్కని ఉపాయాన్ని చెప్పాడు. దాన్ని అనుసరిస్తే మన జీవితం చక్కగా జరుగుతుంది. బాధ అనుభవించవలసిన పని ఉండదు. అదే... ''భగవంతునికి సమర్పణ''. మన ప్రతి సమస్యను భగవంతుని పాదాలకు సమర్పించి, రక్షించమని ఆయనను ప్రార్థించినట్లైతే సమస్యల భారము చాలావరకు తీరుతుంది. కాని ఈ వ్యక్తి భగవంతునికి శరణాగతుడై, ఆయన భక్తుడై ఉండాలి. ఈ విధంగా వచ్చిన సమస్యలను చాలావరకు తగ్గించుకోగలము. కాని క్రొత్త క్రొత్త సమస్యలు పుట్టుకొస్తూ ఉండుట సహజం. మరి ఈ సమస్యలు పుట్టుటను నివారించలేమా? దీనికి కూడా స్వామివారు చక్కని ఉపాయము తెలిపారు. దీన్ని పాటించినట్లైతే కొత్త సమస్యలు అంతగా రావు, వచ్చినా అవి మనలను ఏమీ చేయవు. అదే... శరణాగతి. మనం మనకోసం జీవించకూడదు. భగవంతుని కోసం జీవించాలి. మనం చేసే ప్రతి పని లేక కర్మ మన కోసమని చేయకూడదు. ఆ కర్మ ఫలముపై ఆసక్తిని కూడా కలిగి ఉండకూడదు. భగవంతుని కోసమని చేయాలి. ఫలితం కూడా భగవంతునికే అర్పణ చేయాలి. ఇలా ఆసక్తి లేకుండా దాస్యభావంతో జీవించువారికి ఏ సమస్యలూ దరి చేరవు. చేరినా అవి మనలను ఏమీ చేయలేవు. జీవుడు నిశ్చింతగా జీవించవచ్చును. కాని ఈ రకమైన స్థితిని సాధించుటకు జీవుడు సాధన చేయవలసి ఉంటుంది. అనుక్షణం శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తూ గడపవలసి ఉంటుంది. ఈ జీవితము, మన సమస్త ఆస్తిపాస్తులు స్వామివారివని, మనం అశాశ్వతులమని, ఆయన కృప చేతనే మన జీవితం నడుస్తున్నదన్న ఎరుక కలిగి జీవించాలి. భగవంతునిపై తప్ప అన్నింటిపైన వ్యామోహము వదిలివేసి జీవించాలి. ఇదే జీవితపు పరమార్థము. సమస్యలను తప్పించుకొను విధానము. భగవంతునికి ఇష్టమైన జీవన విధానము. మన ఈ జీవితము సార్థకము చెందే విధానము.

నమో వేంకటేశాయ

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన
ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**– డా|| కె.వి. రాఘవాచార్యులు**

**శ్లో ॥శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేఽర్థినామ్ ।**
**శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

తాత్పర్యం – లక్ష్మీదేవికి భర్త, మంగళములకు నిధి, యాచకులకు నిధి, వేంకటాద్రిపై నివసించువాడగు శ్రీనివాసునకు మంగళమగు గాక!

**శ్లో ॥లక్ష్మీ సవిభ్రమాలోక సుభ్రూ విభ్రమ చక్షుషే ।**
**చక్షుషే సర్వలోకానాం వేంకటేశాయ మంగళమ్ ॥**

తాత్పర్యం – లక్ష్మీదేవి యొక్క విలాసవంతమైన కడగంటి చూపులకు లక్ష్యములైన కనుబొమల విలాసమును, కన్నులను కలవాడు, అన్ని లోకములకు కన్నుల వంటివాడు అగు వేంకటేశునకు మంగళము కలుగు గాక!

**శ్లో ॥శ్రీవేంకటాద్రి శృంగాగ్ర మంగళాభరణాంఘ్రయే ।**
**మంగళానాం నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

తాత్పర్యం – వేంకటాద్రి తన శిఖరాగ్రమున ఆభరణము ధరించినట్లున్న పాదపద్మములు గలవాడు, సమస్త శుభములకు నిలయుడు అగు శ్రీనివాసునకు (లక్ష్మీదేవికి నివాసమైనవాడు) మంగళము కలుగు గాక అని ఆశంసనము.



# ముక్తిమార్గము

భావానువాదం:
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



## శ్రీరాగం

**ఇదివో సంసార – మెంత సుఖమో కాని**
**తుదలేని దుఃఖమను – తొడవు గడియించె || పల్లవి ||**

1. **పంచేంద్రియంబులను – పాతకులు దనుఁదెచ్చి**
   **కొంచెపు సుఖంబునకుఁ – గూర్పఁగాను,**
   **మించి కామంబనెడి – మేటి తనయుండు జని**
   **యించి దురిత ధన – మెల్ల గడియించె || ఇది ||**
2. **పాయ మనియెడి మహా – పాతకుఁడు తనుఁదెచ్చి**
   **మాయంపు సుఖమునకు – మరుపఁగాను,**
   **సోయగపు మోహమను – సుతుఁడేచి గుణమెల్లఁ**
   **బోయి యీ నరకమను – పురము గడియించె**
   **||ఇది||**
3. **అతిశయుండగు వేంక – టాద్రీశుఁడను మహా**
   **హితుఁడు చిత్తములోన – నెనయఁగాను,**
   **మతిలోపల విరక్తి – మగువ జనియించి య**
   **ప్రతి య[illegible] మోక్షసం – పదలు గడియించె || ఇది ||**



భావము – ఇదిగో సంసారమును మేము సుఖమని చేపట్టితిమి. దీనిచే గలుగు సుఖమెంతదో కాని చివరికిది అంతులేని దుఃఖమను భూషణమునే సంపాదించినది.

శ్రోత్రము, త్వక్కు, చక్షువు, జిహ్వా, ఘ్రాణము అను ఐదింద్రియములనెడు పాపాత్ములు తన్ను పట్టుకొని వచ్చి స్వల్పాతి స్వల్పమైన సంసార సుఖమున కంటగట్టిరి. అంతట 'కామము' అను గడుసరి కొడుకు తనలో పుట్టి పెరిగి పాపమనెడు ధనమును కొల్లలుగా ఆర్జించినాడు.

ఎల జవ్వనమనెడు మహాపాపాత్ముడు తన్ను గొనితెచ్చి మాయలమారి సంసార సుఖమునకు మరపినాడు. వెంటనే ముచ్చటైన 'మోహము' అనెడి కొడుకు పుట్టి పెద్దవాడై విజృంభించి తనలోనున్న గుణములనెల్ల హరించి తుదకు నరకమను పట్టణమును గడించినాడు.

మహా మహిమోపేతుడగు శ్రీవేంకటేశ్వరుడను గొప్ప హితము గూర్చువాడు హృదయములో పొదలినాడు. అంతట మదిలో 'విరక్తి' అను కూతురు జనించినది. ఆమె సాటిలేనిదై అతిశయించి మోక్షసంపద లార్జించి పెట్టినది.

# ముక్తిప్రదాయిని మహాశివరాత్రి

– చిల్లర సీతారామారావు

శ్లో ॥ "గంగా తరంగ రమణీయ జటాకలాపం
గౌరీ నిరంతర విభూషిత వామభాగం
నారాయణ ప్రియ మనంగ మదాపహారం
వారాణసీ పురపతిం భజ విశ్వనాథమ్"

గంగానదీ తరంగాలతో రమణీయంగా ప్రకాశించే జటాకలాపం వానిని, నిరంతరం వామభాగములో గౌరీదేవిని అలంకరించుకున్నవానిని, నారాయణునకు ప్రియమైనవానిని, మన్మథుని నశింపచేసిన వానిని, వారణాసి (కాశీ) పురాధీశ్వరుడైన విశ్వనాథుని భజిస్తున్నాను.

శివ శివ శంకరా... శంభో మహాదేవా అంటూ భక్తులు భక్తిభావనతో, తన్మయత్వంతో శివుడిని స్మరించుకొనే పావన పర్వదినము మహాశివరాత్రి పర్వము. 'శివ' యని స్మరించినంత మాత్రముననే సకల కష్టములు దూది పింజల్లాగా తేలిపోతాయి. 'శివప్రదత్వాత్ శివ' శివుడు సమస్తములైన మంగళములను గ్రహించేవాడు. అందరి క్షేమమే శివ తత్త్వం. సకల విధములైన కర్మలను తన వశమునందు ఉంచుకొనువాడు 'వశి' అగుచున్నాడు. 'వశి'యే శివ అయింది.

శ్లో ॥ "శివకళ్యాణ వచనం కళ్యాణం ముక్తి వాచకమ్
యతస్తత్ప్రభవేత్తేన సశివః పరికీర్తితః"

శివ యనునది కళ్యాణ పదము. కళ్యాణ శబ్దము ముక్తి వాచకము. ఆ ముక్తి ఈ దేవుని వలన ప్రాప్తిస్తుంది గనుక ఈ దేవుడు శివుడు అని పిలువబడుచున్నాడు. శివశబ్దము శుభకరము. మంగళకరము. శివ యను రెండక్షరములను ఉచ్చరిస్తూ శివుడిని తలచుకొనినవారికి స్వర్గము, మోక్షము తప్పక లభిస్తాయని, ఇందులో సంశయమునకు తావు లేదని స్కాంద పురాణము తెలియచేయుచున్నది. శివుడు సులభ ప్రసన్నుడు. తనను భక్తులు ఎలా పూజించినా సరే, వారి భక్తికి అధిక ప్రాధాన్యమునిచ్చే అభయంకరుడు. శివుని విభూది ధరించని నుదురు, శివార్చన చేయని జన్మ, శివాలయము లేని గ్రామము, శివసంబంధము లేని విద్య అత్యంత నీచములు, నింద్యములు అని జాబాలోపనిషత్తు చెబుతున్నది.

శ్లో ॥ "మాఘ కృష్ణ చతుర్దశ్యామాది దేవో మహానిశి
శివలింగ తమోద్భూతః కోటిసూర్య సమప్రభః"

మాఘమాసమున శుక్లపక్ష చతుర్దశి నాడు ఆదిదేవుడైన మహాదేవుడు కోటిసూర్య సమప్రభతో సమానమైన, దీప్తి సంపన్నమైన శివలింగ రూపమున ఆవిర్భవించాడు. శివుడు లింగరూపధారిగా అవతరించిన నిశిరాత్రిని మహాశివరాత్రి



యని పిలుస్తారు. శివరాత్రి శివునకు అత్యంత ప్రీతికరం. ఈ రోజున ఉపవాస జాగరణలు ఉన్నవారికి మరల జన్మ అనునది కలుగదు. శివరాత్రి నాడు శివుడిని లింగరూపములో గాని, మూర్తిమంతముగా గాని ఆరాధించినవాడు పురుషోత్తముడవుతాడు. శివరాత్రినాడు ఉపవాసము ఉండి, జాగరణ చేస్తూ రాత్రి నాలుగు జాములు శివలింగమును అభిషేకించిన వారికి అనంత పుణ్యకోటి ప్రాప్తిస్తుందని పురాణోక్తి.

శ్లో ॥ "దుగ్ధేన ప్రథమే స్నానం దధ్నా చైవ ద్వితీయకే
తృతీయేతు తథాఽఽజ్యేన చతుర్థే మధునా తథా"

ప్రథమ జామున దుగ్ధము ద్వారా శివుని ఈశానమూర్తికి, ద్వితీయ జామున దధి ద్వారా అఘోర మూర్తికి, తృతీయ జామున ఘృతము ద్వారా వామదేవ మూర్తికి, చతుర్థ జామున మధు ద్వారా సద్యోజాత మూర్తికి అభిషేకము గావించి పూజలు చేయాలి. ప్రభాత సమయమున విసర్జనము తరువాత వ్రతకథను విని అమావాస్య నాడు ఈ క్రింది శ్లోకమును చదువుతూ పారణ చేయాలి.

శ్లో ॥ "సంసార క్లేశ దగ్ధస్య వ్రతే నానేన శంకర
ప్రసీద సుముఖో నాథ జ్ఞాన దృష్టి ప్రదో భవ"

హే శంకరా! నేను నిత్యము సంసార యాతనలతో దగ్ధమవుతున్నాను. ఈ వ్రతము ద్వారా నా మీద ప్రసన్నుడవు కమ్ము. హే ప్రభూ! నా అభిషేకాదుల వలన సంతుష్టుడవై జ్ఞానదృష్టిని ప్రసాదించుము.

మహాశివరాత్రి నాడు వేకువ జాముననే లేచి స్నానాదికములు పూర్తి చేసుకొని శివాలయమునకు వెళ్ళి శివుడిని దర్శించుకోవాలి. షోడశోపచారములతోను, మహన్యాస పూర్వకముగా, ఏకాదశ రుద్రాభిషేకములు మున్నగునవి ఆచరించాలి. ఉదయమున

శివదర్శనము చేసుకుంటే సర్వ పాపముల నుండి విముక్తి లభిస్తుంది. మధ్యాహ్నము దర్శనము చేసుకుంటే సమస్త పాపములు నశించిపోతాయి. రాత్రి దర్శనము వలన అమితమైన పుణ్యసంపద ప్రాప్తిస్తుంది. మహాశివరాత్రి నాడు ఉపవాసము ఉండాలి. ఉప యను పదమునకు భగవంతుని సమీపము నందు అని అర్థము. వాసము అను పదమునకు నివసించుట అని అర్థము. భగవంతునికి అతి సమీపమున భజనలతో, సత్సంగములతో కాలము గడుపుతూ దైవస్మరణము చేస్తూ ఉండటమే ఉపవాసము అను పదమునకు అర్థము. శివరాత్రి నాడు రాత్రంతా మేల్కొని శివుడికి పూజలు, అభిషేకములు చేయడం, జాగరణ యొక్క ముఖ్య ఉద్దేశ్యము. అర్చన అంటే పూజలు చేయడం. భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో శివుడిని ఆరాధించడమే పూజ. ఆనాడు అహోరాత్రములు ఇంద్రియములను అదుపులో ఉంచుకొని త్రికరణశుద్ధిగా శివుడిని ఆరాధించితే ఒక సంవత్సరమంతా శివుడిని ఆరాధిస్తే వచ్చే ఫలం ప్రాప్తిస్తుంది.

**"అలంకార ప్రియో విష్ణుః అభిషేక ప్రియ శ్శివః"**

శ్రీమన్నారాయణునకు ఎంత సుందరముగా అలంకరిస్తే అంత ఇష్టమని, శివునికి ఎంత అభిషేకములను చేస్తే అంత సంతోషము అని అర్థం. అభిషేక ప్రియుడైన శివునికి ఒక్కో పదార్థముతో అభిషేకం చేస్తే ఒక్కో ఫలితము కలుగుతుందని శివపురాణము చెబుతున్నది. ఆవుపాలతో అభిషేకిస్తే సర్వసౌఖ్యాలు, ఆవు పెరుగుతో అభిషేకిస్తే ఆరోగ్యము, ఆవు నేయితో అభిషేకిస్తే ఐశ్వర్యము, తేనెతో అభిషేకిస్తే తేజోవృద్ధిని ప్రసాదిస్తాడు శివుడు. అభిషేకములను చేస్తున్నప్పుడు రుద్రాధ్యాయమును చదవాలి. చమక, నమక మంత్రములను చదివితే శివుడు ఆనందిస్తాడు. ముక్తిని ప్రసాదిస్తాడు.

శివునకు రెండు రూపాలున్నాయి. ఒకటి సకలం, రెండవది అకలం. సకలం అంటే సగుణం, భక్తానుగ్రహ విగ్రహము. చంద్రశేఖర, చర్మాంబరాదులు మున్నగునవి సకలము. అకలం అంటే నిరాకారం, నిర్గుణం, నిరంజనం, బ్రహ్మజ్యోతి స్వరూపము. లింగరూపము అవయవరహితమై జ్యోతి స్వరూపంగా, ఆద్యంతములు తెలియనిదై గోచరిస్తుంటుంది. ఈ రెండు తత్త్వాలు పూజనీయాలే. సర్వం దేనిలో లీనమై ఉంటుందో ఆ పరమాత్మే లింగరూపుడు. అందుకే శివుడిని లింగరూపంలో పూజిస్తారు. శివుడు మాత్రమే సకలత్వము చేత మూర్తిమంతముగాను, నిష్కలత్వము చేత లింగరూపమున పూజలందుకుంటున్నాడు. బ్రహ్మ విష్ణువుల మధ్య చెలరేగిన కలహమును నివారించుటకు పరమేశ్వరుడు జ్యోతిర్లింగంగా ఆవిర్భవించాడు. లింగము పరమేశ్వరుడి అవ్యక్త రూపము. శివశక్తుల ఏకీకృత రూప చిహ్నమే లింగము. శివలింగమునకు మూలమున బ్రహ్మ, మధ్యభాగమున విష్ణువు, అగ్రభాగమున శివుడు ఉంటాడు. కనుక శివుడిని పూజించితే సర్వదేవతలను పూజించినట్లే అవుతుంది.

మహాశివరాత్రి నాడు ఉపవాసము ఉండి జాగరణ చేస్తున్న సమయములో శివపురాణమును వినినా, చదివినా మహోత్కృష్టమైన పుణ్యం ప్రాప్తిస్తుంది అని తెలియచేసే కథ ఒకటి శివపురాణము నందు వర్ణితమై ఉంది.

పూర్వం దేవలుడు అను బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు జాతిపరముగా బ్రాహ్మణుడు. కాని బ్రాహ్మణాచారములను పాటించెడివాడు కాదు. నమ్మిన వారిని నట్టేట ముంచి ధనమును ఆర్జించెడివాడు. మోసపూరితమైన సంపాదన మంచిది కాదని భార్యాపుత్రులు చెప్పిననూ వినిపించుకొనెడివాడు కాదు. ఒకసారి ఒక వేశ్యతో పరిచయమేర్పడింది. ఆమె మీది వ్యామోహముతో తను సంపాదించినదంతా ఆమెకు ఇచ్చేశాడు. అంతేకాకుండా తన భార్యను, తల్లితండ్రులను వధించి, స్థిర చరాస్తులను కానుకగా ఆమెకు సమర్పించాడు. దేవలుడు నిర్ధనుడు అని తెలిశాక ఆ వేశ్య అతనిని వెళ్ళగొట్టింది. ఒకనాడు అతడికి జ్వరము వచ్చింది. ఉండటానికి ఎక్కడా స్థానము లభించలేదు. దానితో అతడు శివాలయమునకు చేరుకున్నాడు. ఆ సమయములో ఒక ప్రవచనకర్త శివపురాణమును ప్రవచనము గావిస్తున్నాడు. శివాలయమున ఒక మూల కూర్చొని దేవలుడు శివపురాణ ప్రవచనమును వినసాగాడు. ప్రవచనము ముగిసిన తర్వాత అక్కడనే నివసించసాగాడు. ఇలా కొంతకాలము గడిచిపోయింది. ఒకనాడు పురాణ ప్రవచనము పూర్తయింది. అదేరోజు దేవలుడు కూడా మరణించాడు. దేవలుడి సూక్ష్మశరీరమును తీసుకొని పోవడానికి యమదూతలు వచ్చారు. అదే సమయములో శివదూతలు కూడా వచ్చారు. శివదూతలను చూచి ఆశ్చర్యపడిన యమదూతలు ఇలా అన్నారు. ఈ జీవి పరమ పాపి అని అతని పాపములను సమస్తము వివరించి, ఇతనికోసము మీరు ఎందుకు వచ్చారు? ఇతడు నరకలోకమునకు మాత్రమే అర్హుడు. యమదూతలకు సమాధానమిస్తూ శివదూతలు ఇలా అన్నారు. మీరు చెప్పినది సరియైనదే కాని చివరి రోజులలో కర్మరహితుడై శివపురాణమును శ్రద్ధగా విన్నాడు కనుక అతని పాపములు నశించిపోయాయి. శివపురాణ శ్రవణ ఫలితముగా అతడు ఆర్జించిన పుణ్యమునకు గాను అతడిని శివలోకమునకు తీసుకొనిపోవడానికి మేము వచ్చాము అని పలికి దేవలుడి సూక్ష్మశరీరమును శివదూతలు శివలోకమునకు తీసుకొని పోయారు.

శివారాధనము, శివనామోచ్చారణము, శివపురాణ పఠనము, శ్రవణము చేసిన వారు ఎంతటి పాపాత్ములు అయినప్పటికీ అవి వారి పాపములను సమూలంగా నాశనం చేస్తాయి. శివలోకమునకు పంపిస్తాయి.



35వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు


**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— గోవింద దాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**


దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 35 వ భాగపు లీలల ప్రచురణ. (మార్చి 2021 నుండి మే 2021 వరకు).



స్వామివారి సంకల్పములో ఓడిపోయిన తరువాత నేను చాలా పశ్చాత్తాపము చెందుచూ దుఃఖించాను. స్వామి అనుగ్రహము లభించిన 2000 సంవత్సరం నుండి 2021 సంవత్సరం వరకు మొత్తం 21 సంవత్సరాల నా సాధన విఫలమైందని బాధపడ్డాను. ఒక రకంగా 21 సంవత్సరాల నిడివి గల పంట చేతికి రాకపోతే రైతు చెందే బాధ కంటే ఎన్నోరెట్లు ఎక్కువ అనుభవించాను. ఇంతకంటే ఎక్కువ నేనొక అసమర్థ సేవకుడనని, స్వామి కీర్తికి కళంకం తెచ్చానని కుమిలిపోయాను.

### సేవల ఆంతర్యమును విశ్లేషించుట

నాకు ప్రసాదించిన సేవలు నాకు తపస్సు లాగా ఏ విధంగా ఉపయోగపడ్డాయో ఒకసారి నన్ను నేను విశ్లేషించుకున్నాను.

శ్రీవేంకటేశ్వరుడు ఈ లోకములో తర తరాల భక్తులను అనుగ్రహించుటకు హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయ తలచాడు. అందుకు నా భాగ్యవశాత్తు నన్ను తన పనిముట్టులాగా ఎన్నుకున్నాడు. ఆ తరువాత నాకు స్వామివారిపై అత్యంత ఆకర్షణను కలుగచేసి అంతర్ దృష్టి, బాహ్య దృష్టి అనే రెండు దృష్టి కోణాలను ఏర్పాటు చేయించాడు. బాహ్యదృష్టితో లౌకిక పనులను చేస్తున్నప్పటికీ అంతర్ దృష్టితో సదా స్వామివారిని ధ్యానించేవాడిని. మరియు పూర్వము బాణాసురుని యుద్ధ కాంక్ష లాగా నాలో స్వామి సేవా కాంక్షను నర నరాలలో ఏర్పరచి, స్వామి సేవలో తృప్తి చెందని విధంగా చేశాడు. నా కారణంగా నా స్వామివారు తరతరాలుగా స్మరింపబడాలనే దృఢమైన కోరికను కలుగజేశారు. ఒకరకంగా ఒక చిన్నపిల్లవాడిని చాక్ లెట్ ఆశతో రప్పించుకుని, సాన్నిహిత్యం ఏర్పరచుకుని, మెల్ల మెల్లగా అన్ని పనులు

చేయించుకున్నట్లు అనిపించింది.

పూర్వం స్వామివారిని పొందిన భక్తులు, ఏకాంతంగా తపస్సు చేసి యోగ్యత సాధించి స్వామివారిని పొందారు. నేను మాత్రం జనావాసాల మధ్యలో నివసిస్తూ యోగ్యత సాధించవలసి ఉంటుందని దిశానిర్దేశం చేశారు. ఈ యోగ్యత సాధించుటకే నాకు ఇప్పటివరకు 6 సేవలను ప్రసాదించారు. అవి 1. తిరుపతిలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్రస్థూప నిర్మాణం 2. ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ 3. నమోవేంకటేశాయ రథయాత్ర 4. శ్రీవేంకటేశం మాసపత్రిక 5. భజగోవిందం 6. ఇప్పుడిప్పుడే ప్రారంభించు శ్రీనివాస కళ్యాణాలు. వీటిని ఉపయోగించి యోగ్యతను సాధించి స్వామివారిని పొందడమే నేను చేయవలసిన ఏకైక లక్ష్యం. ఒక్క తప్పు లేకుండా సేవ చేయుట ప్రధాన విషయము కాదు, యోగ్యత సాధించుటే ప్రధాన విషయం అని గుర్తించాను. మరియు స్వామి ప్రసాదించిన సేవలు ఏవిధంగా ఉపయోగపడ్డాయో విశ్లేషించుకున్నాను.

**శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం:** తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపా విశేషం చేత తిరుపతిలో 2002 లో ఈ స్థూపం నాచే నిర్మింపబడింది. దీనిద్వారా స్వామివారు నన్ను ప్రత్యేకంగా అనుగ్రహించిన భావమేర్పడ్డది. సేవ చేసి స్వామివారిని తృప్తి పరచాలనే దృఢసంకల్పమేర్పడ్డది. ఇది స్వామివారు ప్రసాదించిన సేవా వృక్షానికి కాండం లాగా నిలిచింది.

**జపసమర్పణ :** భక్తులు మా ఆఫీసుకు వచ్చి జపపుస్తకములను పొంది వ్రాయుటలో ఎంతో సంతోషించేవాడిని. స్వామివారు ఆ భక్తులను అనుగ్రహించుటను చూచి పరవశించిపోయేవాడిని. ప్రతి సంవత్సరం 70 వేల మందితో వ్రాయించేది కాబట్టి ఎంతోమంది భక్తులు జపము వ్రాయుటలో వారి అనుమానాల నివృత్తి కోసం అప్పుడప్పుడు మాట్లాడేవారు. ఈ విధంగా నేను భక్తుల సాంగత్యములో జీవించాను. మరియు సేవక వృత్తి అబ్బింది. ఈ సేవ 2002 లో ప్రారంభమై నేటికీ కొనసాగుచున్నది.

**నమో వేంకటేశాయ రథయాత్ర :** రథమును భక్తుల వీధికి, ఇంటికి తీసుకువెళ్ళినప్పుడు ఆ భక్తులు పొందే ఆనందమును చూచి నేను ఎంతో ఆనందించేవాడిని. 2004 సంవత్సరం నుండి 2019 సంవత్సరం వరకు 16 సంవత్సరాలు హైదరాబాద్ నుండి తిరుపతి వరకు రథయాత్ర చేశాను. తిరుపతి చేరేవరకు నాలో ఎంతో పరివర్తన కలిగేది, సంపూర్ణ శరణాగత స్థితికి చేరేది. ఆ సమయాన నా యావదాస్తిని దొంగలు లాక్కొని పోవుచున్నారనే విషయము తెలిసినా చలించని స్థిర చిత్తము కలిగేది. నా జీవితంలో ఈ స్థితి మొత్తం 16 సార్లు కలిగింది. బహుశా భగవంతుడు ఈ స్థితిని జీవితాంతం అలవరచుకొనుటకు ఈ రథయాత్రను ప్రసాదించారని భావించాను. కాని అయోగ్యుణ్ణైన నేను ఈ స్థితిని కాపాడుకోలేదని చింతించాను.

ప్రతి రథయాత్రలో నేను స్వామివారి సేవకుడననే భావం బలంగా ఉండేది. చిన్నపాటి తప్పును సహితము సహించేవాణ్ణి కాదు. స్వామి కృప వీలైనంత ఎక్కువ మందికి లభించాలనే బలమైన కోరిక ఆ సమయాన ఉంటుండేది. (కాని ఈ యాత్ర తరువాత క్రమంగా ఈ స్థితి చెదిరిపోయేది) 25 రోజుల రథయాత్రలో కలిగే ప్రత్యేక భావాల కనుగుణంగా చివర స్వామివారు నాకు తన విరాట్ రూపమును ప్రసాదించి వారి దివ్య పాదపద్మములను ప్రత్యేకంగా చూపేవారు. ఒకవేళ ఈ స్థితి నేను సంవత్సరం మొత్తం కాపాడుకుంటే స్వామివారు ఎప్పటికీ నా ముందే ఉండిపోతారనే భావం ఏర్పడింది. ఈ స్థితిని చేతులారా జారవిడిచానని బాధ పడ్డాను.

**మాసపత్రిక:** ఇక శ్రీవేంకటేశం మాసపత్రిక ద్వారా స్వామివారి గత చరిత్ర, వైభవము మరింత తెలిసింది. రకరకాల భక్తుల మనోభావాలు తెలిసినవి. ఒకరకంగా నేను ఉన్నచోటికే స్వామి గురించిన అన్ని విషయాలు ఈ పత్రిక ద్వారా నా వద్దకు వచ్చే ఏర్పాటు చేశారు.

**భజగోవిందం:** భజగోవిందం జరుగునప్పుడు నేను పరవశిస్తూ భక్తులు కూడా నాలాగే పరవశించాలని ఆరాటపడేవాణ్ణి. దీని నిర్వహణకై 20 రోజులు తపించేవాణ్ణి.

ఈ విధంగా నా జీవితంలో నేను జనాల మధ్య నివసిస్తున్నప్పటికీ, అడవిలో ముక్కు మూసుకుని తపస్సు చేసేవారి స్థితిని ఈ సేవల ద్వారా సంవత్సరం మొత్తం కల్పించారని భావించాను. ఇప్పటినుండి వీటిని సరైన విధంగా వాడుకోవాలని నిర్ణయించుకున్నాను.

## సాధనను విశ్లేషించుట

నేను శాస్త్ర పురాణాలను చదువనప్పటికీ, భగవత్ విషయాలను నా అనుభవ పూర్వకముగా నేర్చుకొనేటట్లు కరుణించారు. స్వామివారి ప్రతి శిక్షణ అత్యంత గంభీరంగా మానసికంగా, జీవితంలో శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఉంటుంది. కాని అది నాకు మాత్రమే తెలుస్తుంది తప్ప ఇతరులకు తెలియదు. ప్రతిరోజు ప్రతిక్షణం వారిని తపించే నిమిత్తమై గత 21 సంవత్సరాల నుండి ఎప్పటికీ ఏదో ఒక సమస్య సృష్టించబడ్డది. సమ్మెటపోట్లు పడితే తప్ప ఇనుము అనుకున్న ఆకారానికి మారనట్లు, నాకు ఎన్నో సమస్యలను సృష్టించి దాని ద్వారా తగిన శిక్షణ ఇచ్చారు. ఏ మార్పు ఆశించి ఈ సమస్యను సృష్టించారో ఆ మార్పు వీటి ద్వారా కొంత సాధ్యపడ్డది. స్వామి శిక్షణ నా మూలంలో మార్పు జరిగే విధంగా ఉండేది. ముఖ్యంగా ఇందులో 'నా' అన్నది నశింపచేసుకొనుట, స్థితప్రజ్ఞత

సాధించుట అంతా భగవంతునిదే, మనము అశాశ్వతము, సదా ఆయనకు శరణాగతులమై త్రికరణశుద్ధిగా స్వామివారిని నమ్మి జీవించాలనే విషయాలు అయినప్పటికీ, వీటిని సాధించే మార్గాలు బహు కఠినంగా ఉన్నాయి.

మరో ప్రత్యేక భావం ఈ క్రింది విధంగా ఏర్పడింది.

ఒక మనిషి భగవంతుణ్ణి పొందుటకు బహుశా ఇన్నిసార్లు స్మరించాలి, ఇన్ని పాయింట్లు రావాలనే ఒక నియమం ఉండవచ్చు. మామూలుగా స్మరిస్తే ఒక పాయింటు, ఆపదలో ఉండి ఆర్తితో స్మరిస్తే... ఆర్తిని బట్టి ఒకటి... రెండు... ఇలా పాయింట్లు ఇస్తుండవచ్చును. కావలసిన సంఖ్య నిండుటకు నాచే ప్రతిరోజు, ప్రతిక్షణం ఆర్తితో మననం చేయించారు. మనస్సు మరోవైపు మళ్ళకుండా వ్యాపారాన్ని, లౌకిక విషయ వాసనలను త్యజించమన్నారు. మరియు ఏకాంత జీవితం గడపమన్నారు. ఇవన్నీ కూడా స్మరణను అధికం చేసే సంకేతాలని భావించాను. ఈ విధమైన చక్కని సూచనలు స్వామివారు ఇచ్చినప్పటికీ నేను గమనించక పొరపాటు చేశానని బాధపడ్డాను. ఇప్పటినుండి అలా జరగకుండా ఉండాలని దృఢంగా నిశ్చయించుకున్నాను. నేను ఈ జీవితంలో తృప్తి చెందేవరకు స్వామివారి సేవాభాగ్యము ప్రసాదిస్తానని ఇచ్చిన మాట కూడా నేను హరినామ క్షేత్రము ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతోనే ప్రసాదించారని భావించాను.

మరి స్వామివారు ఇన్ని లీలలు, ఇన్ని సేవలను ప్రసాదించినప్పుడు హరినామ క్షేత్రాన్ని కూడా మరో సేవగా నేరుగా ఎందుకు ప్రసాదించలేదని ఆలోచించాను. బహుశా సృష్టి ధర్మాలు అడ్డువచ్చి ఉంటాయనుకున్నాను. ఒక భక్తుడు తపస్సు లాంటి సాధనం ద్వారా యోగ్యత సాధించినప్పుడే వారి సాక్షాత్కార భాగ్యానికి యోగ్యుడు కాగలడు తప్ప ఈ విషయంలో స్వామివారు ఇతర విషయాల లాగా సహకరించరనుకున్నాను. మనకు డైరెక్టుగా ఉడికిన అన్నాన్ని ప్రసాదించలేదు. పైరు వేసి, పండించి, కోసి, వడ్లను తొలిచినప్పుడు బియ్యము, దానిని వండితే అన్నం ఏర్పడుతుంది. అలాగే భగవంతుణ్ణి పొందాలంటే మనిషి సాధన చేయవలసి ఉంటుందని గ్రహించాను. హరినామ క్షేత్రం సాధించాలంటే స్వామివారిని పొందగలిగే స్థితి సాధించుట ముఖ్యమని గ్రహించాను. ఐ.ఎ.ఎస్ పాస్ కావాలనే పట్టుదలతో ఉన్నవాడు కొన్ని రోజులు సంఘం నుండి, ఎలక్ట్రానిక్ మీడియా నుండి దూరంగా ఉండి సాధన చేయునట్లు నేను చేయ నిర్ణయించాను.


స్వామివారు నాకు గతంలో చెప్పిన ఒక మాట మాటి మాటికీ గుర్తుకు వచ్చింది. "అవసరముంటే తప్ప ఇతరులతో మాట్లాడకూడదు. అనవసర విషయాలను పట్టించుకోకూడదు" అని చెప్పారు. ఈ మాట ప్రకారం నడుచుకోవాలనుకున్నాను. మరియు మా రథయాత్ర ప్రారంభ వేడుకలో త్రిదండి శ్రీశ్రీశ్రీ శ్రీనివాస వ్రతధర్ నారాయణ రామానుజ జీయర్ స్వామివారు ఎప్పటికీ ఒక మాట చెప్పేవారు. "కౌన్ కెహతాహై భగవాన్ ఆతేనహీ! ద్రౌపదీకీ తరహ్ బులాతే నహీ! కౌన్ కెహతాహై భగవాన్ ఖాతే నహీ! శబరీకి తరహ్ ఖిలాతే నహీ!" అంటూ చెప్పేవారు. ఈ మాట నా మనస్సులో ప్రత్యేకంగా నిలిచింది. దీని ప్రకారం సాధన చేయాలనుకున్నాను. తప్పక సాధించి తీరుతాననే విశ్వాసం ఏర్పడింది. నేను సదా శ్రీవేంకటేశ్వరుణ్ణి మాత్రమే స్మరించాలి తప్ప ఇతర రూపాలను కాదు. భక్తుడు ఏ రూపంగా భగవంతుణ్ణి అర్చిస్తే ఆ రూపాన్నే స్వామి ప్రసాదిస్తారు. హరినామ క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరుడే మూలదైవం కాబట్టి ఇలా చేశారని భావించాను.

ఆ తరువాత స్వామివారు చెప్పినట్లు వింటానని, ఇప్పటినుండి తప్పు చేయనని మీ సంకల్పమే లక్ష్యంగా జీవిస్తానని మాట ఇచ్చాను. సాధన చేస్తూ స్వామివారిని గట్టిగా పట్టుకున్నాను. నా ఈ పశ్చాత్తాప క్రమములో మరికొన్ని స్వామి లీలలు తోడై నాలో గణనీయమైన మార్పు కలిగింది. భగవంతుణ్ణి పొందుటకు అవసరమైన యోగ్యత సాధించుటకు ఎన్నో వికారాలను వదిలించుకోవలసి ఉంటుంది. ఇంతవరకు నాలో కొంత మార్పు జరిగిందని, ముఖ్యంగా నిష్కళంకమైన భక్తి, విశ్వాసం, నియమబద్ధమైన జీవనం, సదా స్వామి స్మరణ, శుచిత్వం, ఆహార విహారాలు ఇలా ఎన్నో లౌకిక విషయాల పట్ల మరియు కుటుంబ, పుత్ర వాత్సల్యము కూడా నశించినట్లు స్వామివారు చెప్పారు. ఇప్పుడు నాలో విలాసవంతమైన జీవితం పట్ల వ్యామోహమనే మరో వికారము నశించిందని మరియు హరినామ క్షేత్ర సాధన దిశగా వెళ్ళుచున్నట్లు ఈ క్రింది లీలల ద్వారా సూచించారు.

## విలాస జీవిత వ్యామోహం నశించి సాధన దిశగా పయనిస్తున్నట్లు చూపుట

నేను ఇంజనీరింగ్ చదివే రోజుల్లో శ్రీమాన్ సాంబశివరావు అని ఒక మిత్రుడు ఉండేవాడు. ఇప్పుడు అతడు ఉద్యోగరీత్యా టీవీ-5 లో ప్రతిరోజూ పొలిటికల్ డిస్కషన్ నడుపుచున్నాడు. ఇతనికి ఎంతోమంది రాజకీయవేత్తలు, ధనవంతులు పరిచయం ఉన్నారు.

**తేది 24-03-2021 కల :** నేను అనుకోకుండా నా మిత్రుడైన శ్రీమాన్ సాంబశివరావుతో కలిసి హైదరాబాద్ లోని జూబిలీహిల్స్ లో ఉన్న ఒక అతి సంపన్నుని ఇంటికి వెళ్ళాను. ఏ పని మీద వెళ్ళామనే సంగతి తెలియదు. ఆ అతి సంపన్నుడు నాకంటే నా మిత్రునికే ఎక్కువ తెలిసినవాడట. ఆయన యొక్క అతి విలాసవంతమైన ఇంటిలో అతి విలాసవంతమైన సోఫాలో కూర్చుండి ఆ ఇంటి అందాలను చూస్తున్నాను. నా మిత్రుడు చక్కగా కూర్చున్నాడు కాని నేను మాత్రం ఎందుకో ఆ




విలాసవంతమైన వస్తువులను చూచి అసహనానికి లోనైనాను. ఇంతలో ఆ ఇంటి పెద్దమనిషి వచ్చి మా ప్రక్కన మరో సోఫాలో కూర్చున్నాడు. నా మిత్రుడు నన్ను ఆయనకు పరిచయము చేసి వారు ఏదో విషయముపై మాట్లాడుచున్నారు. నేను మాత్రం ఆ ఇంటిని, వారి అతి విలాసవంతమైన పరిస్థితులను చూచి నొచ్చుకున్నాను. ఒక రకంగా నేను అక్కడ ఇమడ లేకపోయాను. సుఖభోగాల కాంక్ష నాలో నశించిందని అర్థం. ఇది ఈ కలలోని మొదటి భాగం.

**రెండవ భాగము :** నేను మా ఊరులోని మా ఇంటినుండి తోటబావి వద్దకు వెళ్ళాను. ఇంతకుముందు వ్యవసాయము చేయుటకు ఎలాంటి నీటి వసతి లేని ఆ ప్రాంతము ప్రస్తుతము రెండు నీటి కాలువలు ఒకదాని ప్రక్కన మరోటి, వాటి మధ్యన కొంత గ్యాప్ తో ప్రహించుటను చూచాను. ఆ నీటిని చూచి నేను ఎంతో ఆనందాన్ని పొందాను. గంగ ఇక్కడికి వచ్చిందని, ఇది ఆ శ్రీవేంకటేశ్వరుడి మహిమచే మాత్రమే సాధ్యమైనది అనుకున్నాను. నేను ఆనందంగా నీటిలోకి దిగి కాళ్ళు చేతులు కడుక్కున్నాను. మళ్ళీ ప్రక్కకు వచ్చి ఆ రెండు కాలువలను చూస్తున్నాను. స్వచ్ఛమైన నీరు, మంచినీరు, మురికిలేని నీరు, పైనుండి చూస్తే అడుగుభాగము స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ కాలువలు ఒక్కొక్కటి దాదాపు ఐదు నుండి ఏడు అడుగుల వెడల్పుతో ప్రవహిస్తున్నవి. కల చెదిరింది.

ఇంతకుముందు మా తోటబావి పొలము నీరు లేక బీడువారి పోయింది. అతి కష్టం మీద వ్యవసాయం చేసేవారిమి. కాని ఈనాడు శ్రీవేంకటేశ్వరుని కృపచే స్వచ్ఛమైన గంగ ఆ ప్రాంతానికి వచ్చింది. మేము చక్కగా వ్యవసాయం చేసుకోగలము అని సూచించారు. దీని భావం : ఇంతకుముందు నేను భగవంతుడు మెచ్చని ఎన్నో వికారాలు కలిగిన వ్యక్తిని. ఇప్పుడు నాలోని ఆ వికారాలు వదిలిపోవుచున్నవి. కాబట్టి హరినామ క్షేత్రము స్థాపించుటకు యోగ్యుణ్ణి అవుచున్నానని దీని భావము అని ఈ భాగము వ్రాస్తున్నప్పుడు గ్రహించాను.

## సాధన చక్కగా చేస్తున్నట్లు చూపుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాపై పెట్టిన బాధ్యతను ఎలాగైనా నెరవేర్చి స్వామివారిని సంతృప్తి పరచాలని అత్యంత దృఢ నిర్ణయముతో ఉన్నాను. దీనిని సాధించుటకు నాకు తెలిసిన పద్ధతులలో తీవ్ర కృషి చేస్తున్నాను. దీనిని గమనించిన స్వామివారు మరో క్రింది లీలను చూపి నా ప్రయత్నాలను కన్నులకు కట్టినట్లు చూపారు.

**తేది 27-03-2021 కల :** ఈ కలలో నేను ఇంజనీరింగ్ కళాశాల లాంటి బిల్డింగులోనికి ఆఫీసు పని నిమిత్తమై వెళ్ళాను. బహుశా ఏదో ఒక విషయము తెలుసుకొనుటకై ఉన్నది. అప్పుడు నాకు కావలసిన ఆఫీసర్ లేడు. శోధించగా ఆయన

నా క్లాస్మేటేనట. అక్కడివారు ఆయన పేరు, మరియు నెంబర్ ఇచ్చారు. ఓ... ఈయన నాకు తెలిసినవారే... నా మిత్రుడే అని అన్నాను. ఆయనతో మాట్లాడాలని అనుకున్నాను. కాని ఆయన దొరకలేదు. ఈ ఆఫీసు నేను చదివిన ఉస్మానియా యూనివర్సిటీ లోని ఇంజనీరింగ్ కళాశాల మాదిరిగానే ఉన్నది. కాని తరగతి గదిలా కాకుండా లోన ఆఫీసులు, అందులో బల్లలు, కుర్చీలు వేసి ఉన్నవి. నేను బహుశా ఏదో ముఖ్యమైన పనిని విచారించుటకు వెళ్ళినట్లు ఉన్నది. ఇంతే కల.

దీనర్థం ఏంటంటే... నేను తప్పకుండా పరీక్షలో పాస్ కావాలని తలంచాను కాబట్టి చదివే క్రమములో వస్తున్న సందేహములను తీర్చుకొనుటకు మళ్ళీ మళ్ళీ కళాశాలకు, ఉపాధ్యాయుల వద్దకు, ఆఫీసుల చుట్టూ తిరుగుచున్నానని భావించాను.

## హరినామ క్షేత్రం కొరకు మంకుపట్టు పట్టుట

**తేది 01-04-2021 :** స్వామివారి అఖండ నామస్మరణ క్షేత్రము తప్పకుండా ఏర్పాటు చేసి స్వామివారు మెచ్చేవిధంగా నిర్వహించాలని దృఢనిర్ణయం తీసుకున్నాను. ఇది నేను నివసించే ప్రాంతమునకు దగ్గరగా ఉన్నచో నిర్వహణ సులభమౌతుందని భావించాను. మరియు ఈ క్షేత్రం మొత్తం నా కంట్రోలులో ఉండాలని, మరొకరి పెత్తనం లేకుండా ఉండాలనే బలమైన కోరిక నాకున్నది. ఇది నెరవేరుటకు నాకు తెలిసిన ఎన్నో ప్రాంతాలను వెతికాను. తెలిసిన ఎందరికో చెప్పి సహాయపడమన్నాను. కాని ఎంత ప్రయత్నించినప్పటికీ ముందుకు సాగలేకపోయాను. ఇలా గత కొన్ని రోజుల నుండి స్వామివారిని అత్యంత దీనంగా ఈ క్రింది విధంగా ఒకరకంగా పోట్లాడుతూ ప్రార్థించాను.

ప్రభూ శ్రీవేంకటేశ్వరా! గత అయిదారు సంవత్సరాల నుండి మీ హరినామ క్షేత్రమును స్థాపించాలని అనుకుంటున్నప్పటికీ నాకు సాధ్యము కాలేదు, మీరు నాకు సహాయము చేయలేదు కాబట్టే ముందుకు వెళ్ళలేదు. ఇప్పుడు అలా చేయకండి, దయచేసి నాకు సహాయము చేయమని వేడుకున్నాను. నేను మీ వాడినని, నాకు ఈ లోకంలో మీకంటే ఇష్టమైనవారు ఎవ్వరూ లేరని, మీరే ఇష్టమని, ఇది మీకు తెలుసని అన్నాను. మీరు సహాయం చేయకుంటే నేను దిక్కులేని వాడినని, కాబట్టి దయవుంచి సహాయపడమని దీనంగా వేడుకున్నాను. మీరు సహాయము చేయకుంటే నేను పరీక్షలో పాస్ కాలేనని, మీ భక్తుడు ఓడిపోక తప్పదని బాధపడ్డాను. మీ భక్తుడు, సేవకుడు విజయము సాధించాలంటే మీ సహాయము అత్యంత అవసరమని వేడుకున్నాను. పైగా తమరు దయామయులని నాకు సహాయము చేయమని హరినామ క్షేత్రమును ఎక్కడ ఎలా స్థాపించాలో స్పష్టంగా చెప్పమన్నాను. ఈరోజు స్వామివారు నాకు సహాయము చేయుట లేదని, దుఃఖిస్తూ వాదన పెట్టుకున్నాను. ఒకరకంగా ఉడుంపట్టు పట్టాను. ఒక బిడ్డ తన తల్లిపైన అలిగినట్లు అనిపించింది.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను రాజ మహారాజుల కంటే ఎక్కువ ఆదరించి వారి అమూల్యమైన అనుగ్రహములను ఎన్నో ప్రసాదించారు. గతంలోని శ్రీకృష్ణదేవరాయలు లాంటి ఎంతోమంది మహారాజుల కంటే నాకే ఎక్కువ అనుభూతులు కల్పించి ఆదరించినట్లు భావించాను. అలాంటి నేను స్వామివారి సంకల్పాన్ని నెరవేర్చనందులకు సిగ్గుపడ్డాను. ఈసారి తప్పకుండా విజయం సాధించాలని నిర్ణయించుకున్నాను. చివరికి శ్రీవేంకటేశ్వరుణ్ణి మళ్ళీ ఇలా ప్రార్థించాను.

ప్రభూ శ్రీవేంకటేశ్వరా! రెండవ సంకల్పముగా నాకు 'శ్రీనివాస కళ్యాణాలు' అనే సంకల్పాన్ని ఇవ్వమని మళ్ళీ వేడుకున్నాను. మొత్తం 111 కళ్యాణాలను చేసి స్వామివారిని మా ఇంటికి ఆహ్వానించవలసి ఉంటుంది. ప్రతి 7 కళ్యాణాలు ఒక మెట్టు అనుకుంటే మొత్తం 16 మెట్లు కలిసి 111 కళ్యాణాలు కాగలవు. కాబట్టి నేను 16 మెట్లు ఎక్కి స్వామివారిని చేరవలసి ఉంటుందని భావించాను. స్వామివారు నేను సంకల్పములో ఓడిపోయానని తెలుపక ముందే ఈ కళ్యాణాల సేవను నాకోసం రచించాడని మురిసిపోయాను.

ఒక్క తప్పు లేకుండా సేవ చేసి మీ అనుగ్రహము పొంది హరినామ క్షేత్రమును స్థాపించే భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకున్నాను.

## భరతుణ్ణి అనుసరించమనుట

ఒక పర్యాయము నేను నా గత జప సమర్పణ సేవను పరికించి చూసుకున్నాను. తెలిసి నేను ఎక్కడా తప్పు చేయలేదు. అలాంటిది విధి వక్రీకరించి కోవిడ్-19 మూలంగా ఓడిపోయాను తప్ప నావల్ల తప్పు జరగలేదు. కేవలం విధి వక్రీకరించుట వలననే ఓడిపోయానని అనుకున్నాను. వెంటనే ఈ "విధి" అనేది శ్రీవేంకటేశ్వరుని చేతిలో ఒక పనిముట్టు మాత్రమేనని, స్వామివారి ఆజ్ఞ లేకుండా అది నాపై ప్రయోగింపబడదని నిర్ణయించుకున్నాను. కాబట్టి స్వామివారే కావాలని నన్ను ఓడించారని అర్థమయింది. ఎప్పుడైతే ఈ భావన నా మనస్సుకు వచ్చిందో... "నీవు భరతుణ్ణి అనుసరించమంటూ పదే పదే భావాలు రాసాగాయి. ఒకరోజు కాదు దాదాపు ఒక వారం రోజులు భరతుణ్ణి అనుసరించమంటూ, భరతుడే నా మనస్సులో మెదలసాగాడు. 2009 సంవత్సరం ప్రాంతంలో స్వామివారు నాలో భరతుని భక్తి బీజమును నాటారు. ఇప్పుడు ఆ భరతుని భక్తిభావము నాలో మొలకెత్తుచున్నట్లు అనిపించింది. ఎలాగైతే శ్రీ భరతులవారు, శ్రీరాముని రాక కోసం 14 సంవత్సరాలు వేచి చూచాడో... అదేవిధంగా నేను కూడా 'నా' అన్నది

నశింపచేసుకుని, శ్రీవేంకటేశ్వరుని రాక కోసం రోజులు లెక్కిస్తూ వేచి ఉండమన్నారని గ్రహించాను. మొత్తం 111 కళ్యాణాలలో ప్రతి కళ్యాణమును ఒక మెట్టుగా భావించి భరతుడి లాంటి తపనచే స్వామివారిని చేరవలసి ఉంటుందని భావించాను. ఏవిధంగానైతే భరతుని వలన రామాయణము ఏర్పడినట్లు నా వలన హరినామ క్షేత్రము ఏర్పడి సర్వులకు స్వామి కృప కలగాలనేది స్వామి సంకల్పమనుకున్నాను. మరియు మరో కోరికను ఈ విధంగా కోరాను.

## అనుభూతుల ప్రచురణకు ఆజ్ఞ ఇవ్వమనుట

ప్రభూ శ్రీవేంకటేశ్వరా! మీరు నాకు అమోఘమైన అనుభూతులను ఎన్నో ప్రసాదించారు. వీటిని చదువుచున్నప్పుడు నేను ఎంతో పరవశించిపోయాను. మీ భక్తులు కూడా వీటిని చదివి ఆనందించే భాగ్యాన్ని ప్రసాదించమంటూ వేడుకున్నాను. నేను మూడవ వంతు కళ్యాణాలను చేసిన తరువాత ఈ అనుభూతులను ప్రచురించే అవకాశమును ఇవ్వమని ప్రాధేయపడ్డాను. "తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశ-నా దశ" అనే శీర్షికతో వీటిని ప్రచురిస్తానని చెప్పాను. 2010 సంవత్సరంలో మీరు నా అనుభూతులను తరువాత ప్రచురించమన్నారని, ఇప్పుడు మూడవ వంతు కళ్యాణాలను చేసిన తరువాత ప్రచురించుటకు ఆజ్ఞ ఇవ్వమని వేడుకున్నాను.

## హరినామక్షేత్రం ప్రసాదిస్తున్నట్లు సూచనలు చూపుట

**తేది 06-04-2021 :** ఏ తప్పూ లేకుండా కళ్యాణాలను నిర్వర్తించుటతో పాటు, వీటిని ఉపయోగించి తగిన యోగ్యతను సాధించుటే ముఖ్యమని భావించాను. నేను అథమశ్రేణి విద్యార్థిని కానప్పటికీ స్వామివారి పరీక్షలో పలుమార్లు తప్పానని, కారణం నేను స్వామి చెప్పినట్లు వినకపోవడమేనని భావించాను. గతంలో నేను వ్యాపారమును మానినప్పటికీ కాలక్షేపము కొరకు అప్పుడప్పుడు ప్లాట్లు కొనేవాడిని, మరియు 'నా' అన్నది వదిలించుకోలేదు. ఈ తప్పులు పునరావృతం కాకుండా చూచుకున్నాను. ప్రతిరోజు, ప్రతిక్షణం స్వామివారిని స్మరిస్తూ ఉంటే ఈ పరీక్షలో ఉత్తీర్ణుణ్ణి అగుట అంత కష్టం కాదనిపించింది. స్వామివారు తప్పక దారి చూపుతారనిపించింది. నేను ఇతర ఆధ్యాత్మిక పుస్తకాలను చదువనప్పటికీ, ఆధ్యాత్మిక వ్యక్తులను అనుసరించనప్పటికీ కేవలం స్వామివారిని గట్టిగా పట్టుకుంటే అన్నీ ఆయనే ప్రసాదిస్తారని భావించాను. నా ప్రభు శ్రీవేంకటేశ్వరుణ్ణి మరియు గురుదేవులు శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామి వారిని తప్ప మరెవ్వరినీ ఆశ్రయించదలచుకోలేదు. మరియు ఇప్పటినుండి నా జీవితంలో ఎదురగు ప్రతి సమస్యను, శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, మరేవిధమైన సమస్యనైనా అది హరినామ క్షేత్రం వైపు దారి తీస్తుందనే భావనతో విశ్లేషిస్తూ దానికి అనుగుణంగా జీవించాలనుకున్నాను. 'నా' అన్నది మరియు ఇతరములైన కోరికలను, లౌకిక విషయాలను పూర్తిగా త్యజించాలని భావించాను. ఎలాగైనా స్వామివారు నిర్ణయించిన పరీక్షలో నెగ్గి వారిని ఆనందింప చేయాలని దృఢనిర్ణయం తీసుకున్నాను.

తేది 13-04-2021 నాడు ఉగాది. మేము శ్రీవేంకటేశం మాసపత్రికను ప్రారంభించి 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని నేటితో 15వ సంవత్సరంలోకి అడుగిడాము. ఈ సందర్భంగా ఏప్రిల్ 2021 వ సంచిక స్వామివారికి సమర్పించి ప్రార్థించాను. ఈ పత్రికను నా జీవితాంతం లేదా మీరు చాలు అనేవరకు ప్రచురించెదనని, మీ సేవను మరింత చేయాలని ఉన్నదని అన్నాను. నేను పరీక్షలో పాస్ అయి పిహెచ్.డి చేసే భాగ్యాన్ని ప్రసాదించమన్నాను. హరినామ క్షేత్రం స్థాపించి అందులో మీ అఖండ నామస్మరణ చూస్తూ సంతోషించాలని వేడుకున్నాను. ఇది మొత్తం మీ కృపా కటాక్షాలు, సహకారం లేకుండా సాధ్యం కాదని ప్రార్థించాను. ప్రభూ! మీరు నేను తృప్తి చెందేవరకు మీ సేవా భాగ్యాన్ని ప్రసాదిస్తానని మాట ఇచ్చారు. నేను ఇంకా తృప్తి చెందలేదు. మీకు మరింత సేవ చేయాలని ఉన్నది. మీ అఖండ నామస్మరణ కేంద్రాలను స్థాపించాలనే కోరిక ఉన్నది. కావున మీరు ఇచ్చిన మాట ప్రకారం నాకు సహాయం చేసి వీటిని ఏర్పాటు చేయ ప్రార్థించాను. నాకు మీరు తప్ప దిక్కెవ్వరు లేరని భోరుమన్నాను.

ఈవిధంగా నేను ఉడుంపట్టు పట్టి చాలా రోజుల నుండి పశ్చాత్తాపము చెందుచూ రకరకాలుగా ప్రార్థించాను. ఇన్ని రోజుల నా తపన వలన బహుశా నా మూలములో సరైన పరివర్తన జరిగింది. ఒక తల్లి మారాం చేసే తన పుత్రుణ్ణి ఊరడించినట్లు స్వామివారు కరుణించి నాకు హరినామ క్షేత్రమును ప్రసాదించునట్లుగనో లేక ఆ దిశగా నేను వెళ్ళుచున్నట్లుగానో ఒక చక్కని క్రింది లీలను చూపారు. నేను ఎంతో సంతోషించాను. ఇంతవరకు నేను పశ్చాత్తాపము చెందుచు దుఃఖించసాగాను. ఇప్పటినుండి నా దుఃఖానికి కారణమైన హరినామ క్షేత్రాన్ని ప్రసాదిస్తున్నట్లు ఒక్కొక్క విషయము తెలుపుతూ నన్ను సంతోషింప చేశారు.

**తేది 14-04-2021 కల :** అది మా ఇల్లు. హైదరాబాద్ లోనో లేక ఊరిలోనో చెప్పలేను కాని అది మా ఇల్లు, అందులో మేము ఉన్నాము. మా ఇంటిలో ఎప్పటిదో ఒక పాడైపోయిన సంగీత వాయిద్యము దుమ్ముపట్టి ఉన్నది. దానిని వాడక చాలా సంవత్సరాలు అవుతున్న కారణాన, దుమ్ముపట్టి ఒక మూలకు ఉన్నదట. అది కట్టెతో చేసిన వెనుకటి ఒక డోలు లేదా మద్దెల.

దానిని తెచ్చి, దుమ్ము దులిపి పాడైపోయిన ఆ డోలును తిరిగి బాగు చేశాము. ఇప్పుడు ఈ వాయిద్యము ఉపయోగించుటకు సిద్ధంగా ఉన్నది. కార్యక్రమాలు నిర్వహించాలి. ఇంకా ఆలస్యం చేయరాదు అనే భావం నా మనస్సులోకి వచ్చింది. అంటే ఆ వాయిద్యాన్ని ఉపయోగించి హరికీర్తనకు సంబంధించిన సంగీత కార్యక్రమాలు నిర్వహించాలనే భావము నా మనస్సులో కలిగింది. కల చెదిరింది.

ఈ కల ద్వారా ఎంతో ఆనందించాను. నూతనోత్సాహం వచ్చినట్లైంది. నేను ప్రార్థించిన విధంగా హరినామ సంకీర్తనము ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వబోతున్నారని మురిసిపోయాను. నా ప్రభువుకు శతకోటి ప్రణామాలను అర్పించాను.

## భక్తులను సమకూర్చు బాధ్యత స్వామివారు తీసుకొనుట

మళ్ళీ స్వామివారిని ఈ హరినామ క్షేత్రం ఏ తప్పులు లేకుండా జరగాలంటే తమ అనుగ్రహము కావాలని, మీరు భక్తులను చక్కగా అనుగ్రహించాలని, ఇందులో ఒకటి చిన్నగుండవెల్లిలో మరోటి హైదరాబాద్ లో ఏర్పాటు చేసే అవకాశమును ఇవ్వమని వేడుకున్నాను. తెల్లవారి మరో కల కన్నాను.

**తేది 15-04-2021 కల :** అది మా ఊరు చిన్నగుండవెల్లి. నేను అప్పుడే అంటే ఆ రోజు ఉదయం పూట హైదరాబాద్ నుండి ఊరికి పోయానట. చాలా రోజుల నుండి ఇంటిలో లేము కావున, నా భార్య ఇంటిని శుభ్రం చేయించింది. అది మా ఇల్లే, కాని ప్రస్తుతము మాకు ఉన్న ఇల్లు కాదు, పైగా మేము అమ్మిన ఇల్లు కూడా కాదు. ఒక క్రొత్త ఇల్లు, జాజుతో అలికి చక్కటి ముగ్గులతో అలంకరించి ఉన్నది. ఆ ఇల్లు ఒక ఆశ్రమము లేక వెనుకటి ఇంటి అందాలు కనబడ్డాయి. అంటే పొయ్యి దగ్గర ఎర్రమట్టితో అలుకుట, కళ్ళాపి చల్లుట, ముగ్గులు వేయుట, జాజు, సున్నముతో అలంకరించి చాలా అందంగా ఉన్నది. నేను స్వామివారి నామ జపము చేయించు ఉద్దేశ్యముతో, తగిన వ్యక్తులను ఎన్నుకుందామని లేదా ఎవరైనా తగినవారు దొరుకుతారా? అనే ఉద్దేశ్యముతో ఊరంతా తిరిగి నిరాశతో వచ్చి ఇంటిలోనికి పోవుచున్నాను. ఒక అడుగు గడప లోనికి వేశాను. ఇంతలో నా చూపు మా ప్రక్క ఇంటిపైన పడ్డది. అది మా పాలివారి




మా పాపకు వాయిద్యకారులను పరిచయం చేయుట

ఇల్లట. వారిది కూడా మా ఇంటిలాగా పొయ్యి వద్ద ఎఱ్ఱమట్టితో అలికి ముగ్గులు వేసి చక్కగా ఉన్నది. వారు ఉదయం వ్యవసాయం పనులు చూసుకుని సాయంత్రానికి ఇంటికి వచ్చి ఉన్నారు. సాయంత్రం భోజనం తరువాత ఒక పదిమంది చిన్నగుండవెల్లి వ్యక్తులు కలిసి ఆ ఇంటికి వచ్చి భజన నేర్చుకుంటున్నారు. వారి వద్ద పలకలు, బలపములు, పుస్తకములు ఉన్నవి. ఎవరో ఒక వ్యక్తి వారికి నేర్పుచుండగా వారు నేర్చుకుంటున్నారు. వారి సాధనలో భాగంగా 'వినా వేంకటేశం ననాథో ననాథః! సదా వేంకటేశం స్మరామి స్మరామి' అనే మంత్రములో భాగంగా "వినా వేంకటేశం" అంటూ గట్టిగా అన్నమాట నాకు స్పష్టంగా వినబడ్డది. ఒకరకంగా వారు శ్రీవేంకటేశ్వరుడు తప్ప మాకు దిక్కెవ్వరూ లేరంటూ ప్రార్థిస్తున్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో ఉత్సాహముతో వారు స్వామిగురించి నేర్చుకొనుటను గమనించాను. ఇంతలో నేను మా ఇంటిలోనికి రెండవ అడుగు వేసి వెళ్ళిపోయాను. అప్పుడు మా ఇంట్లో మూడు నాలుగైదు సంవత్సరాల వయస్సున్న పాప ఒకతి ఉన్నది. ఆమె మా ఇంటి వ్యక్తేనట, తెల్లని బట్టలపై రంగు రంగుల పూలు డిజైన్ కలిగిన గౌనును ధరించి ఉన్నది ఆ పాప. నేను ఆ పాపతో ఏదో మాట్లాడుచుండగ, ఇంతలో మా ఇంటి ముందునుండి ఒక ఇద్దరు వ్యక్తులు వారి డోలును బాగు చేయించుకొని వెళ్ళుచున్నారు. అది చూచిన పాప వారికేసి ఆశ్చర్యంగా చూసింది. ఆ పాపకు వారిని పరిచయము చేయాలనే ఉద్దేశ్యముతో వారిని పిలిచి వారితో మాట్లాడాను. వారు ఆ వాయిద్యాలను ఇప్పుడే బాగు చేయించుకొని పోవుచున్నామని చెప్పారు. అంటే భజన కార్యక్రమములను చేయుటకై వాయిద్యాలను సిద్ధం చేయించినారు. వారు మహా సంతోషంగా, ఉత్సాహంగా నాతో మాట్లాడారు. కల చెదిరింది.

**దీనర్థం:** శ్రీవేంకటేశ్వరుడు వారి అఖండ నామ సంకీర్తనను నిర్వహించుటకు అనుమతిస్తున్నారనే విషయమును గ్రహించాను. మరియు దీనిని నిర్వహించుటకు వ్యక్తులు లభించగలరని కూడా విశ్వాసము కలిగించారు. నా యొక్క జీవిత ధ్యేయమైన నా ప్రభువుకు అఖండ నామ సంకీర్తనను చేపట్టబోతున్నందులకు వారు అనుమతిస్తున్నందులకు చాలా ఆనందించాను. మరియు ఈ సమయం వరకు మా ఇంటిలో ఒక ఆడపాప (మనుమరాలు) ఉండగలదని కూడా సూచించారు. ఈ కల ఉదయం 5.25 కు అలారం మ్రోగడంతో చెదిరిపోయింది.

తెల్లవారి కూడా మరో చిన్న కల కన్నాను.

## స్వామివారిని మచ్చిక చేసుకుని సాధిస్తున్నట్లు చూపుట

గత ఐదు నెలల నుండి విరామం లేకుండా పశ్చాత్తాపంతో తపించుట ద్వారా లేదా మారాం చేయుట ద్వారా స్వామివారు కరిగిపోయి నా కోరికను మన్నిస్తున్నట్లు ఈ లీల ద్వారా చూపారు.

**తేది 16-04-2021 కల :** ఇందులో ఒక వ్యక్తి ఒక పెద్ద నాగుపాముతో ఆడుచున్నాడు. దాని పడగ క్రింది భాగమున చేతితో పట్టుకొని దాని పడగపై చిన్నగా తన రెండవ చేతితో కొట్టుచు ఆడుకొనుచున్నాడు. అది మంచి నాగుపాము. ఇంతే కల.



స్వామి వారిని మచ్చిక చేసుకొని సాధిస్తున్నానని సూచించుట

దీనర్థం – నిజానికి యోగ్యతను సాధించి హరినామ క్షేత్రమును సాధించవలసి ఉన్నది. కాని నేను మాత్రం ఏదోవిధంగా స్వామివారిని మచ్చిక చేసుకుని సాధించుకుంటున్నట్లు చూపాడు. మరియు ఆయనతో మళ్ళీ ఆటను మొదలుపెట్టానని భావం.

ఆ తరువాత స్వామివారు మరో ఆనందకర సన్నివేశాన్ని ఈ క్రింది విధంగా చూపారు.

**తేది 22-04-2021 కల:** ఈ కలలో నేను కళాశాలలో ఉన్నాను. అప్పుడు ఆ కళాశాలలో ఉత్సవము జరుగుచున్నది.

రకరకాల కంపెనీల వారు వారి వారి వస్తువుల అమ్మకం కొరకు కళాశాల ప్రాంగణములో స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. కొన్ని స్టాల్స్ లో టీషర్ట్స్ లాంటి వస్తువులను అమ్ముచున్నారు. విద్యార్థుల కొరకు కళాశాల యాజమాన్యము వారు కొన్ని పందెపు పోటీలను నిర్వహిస్తున్నారు. పిల్లలందరూ చాలా సంతోషంగా, ఉత్సాహంగా ఈ పరుగు పందాలలో పాల్గొన్నారు. కొందరు రకరకాలుగా మాట్లాడుచు వారి వారి మిత్ర బృందాలతో కలిసి షాపింగ్ చేస్తున్నారు, ఎగురుచున్నారు, దూకుచున్నారు, నవ్వుచున్నారు. ఇలా చాలా ఆనందంగా ఉన్నారు. నేను కూడా ఒక టీషర్ట్ అమ్మే షాపు వద్ద ఉన్నాను. నేను కూడా చాలా ఆనందంగానే ఉన్నాను. ఇదంతా కూడా ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల మైదానములో జరుగుచున్నది.

ప్రతిసారి నేను కళాశాలలో ఏమీ చదవక పరీక్ష ఎలా వ్రాయాలి అనే బెంగతో, చింతతో ఉండే నేను ఈసారి మాత్రం చాలా ఆనందంగా, సంతోషంగా కాలం గడుపుచున్నాను. నేను ఒంటరిగానే ఉన్నాను. కొద్దిమంది మిత్రులు దూరంగా ఉన్నారు. ఈ రకమైన కలను కన్నాను. ఈ కల కన్న తరువాత బహుశా నేను పరీక్షలో పాస్ అయ్యే సంకేతాలు చూపాడని భావించాను.

## హరినామక్షేత్రం ఏర్పాటుకు అభయం

శ్రీవేంకటేశ్వరుడు నాకు తన హరినామక్షేత్ర సేవను ప్రసాదిస్తున్నట్లు మరికొన్ని దృష్టాంతాలను ఈ క్రింది విధంగా చూపించారు.

**తేది 23-04-2021 :** గత కొన్ని నెలల నుండి నాలో చాలా మార్పు కలిగింది. నేను నా గత అనుభూతులను చదివిన పిదప నా మనస్సు చాలా బాధపడ్డది. స్వామివారు నాకు ఎన్నో మాహాత్మ్యాలను, అతి ప్రేమను చూపుచు, సృష్టి నియమాలను ప్రక్కన పెట్టి అనుగ్రహించారు. కాని నేను మాత్రం 'నా' అన్నది వదలక, అరిషడ్వర్గాలను వదులుకోలేక, లోకంలోని సుఖాలకు మరిగి లేదా నాలో శక్తి సామర్థ్యాలు లేక స్వామివారు చెప్పినట్లు చేయలేకపోయాను. చివరికి స్వామివారి పరీక్షలో తప్పిపోయాను. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా సమయము దాటిన తరువాత పశ్చాత్తాప పడ్డాను. నా తప్పును తెలుసుకొని ఓడిపోయానని ఒప్పుకున్నాను, తరణోపాయం చూపమన్నాను, రకరకాలుగా ప్రయత్నాలు చేశాను. అప్పటి నుండి నా దృష్టి కేవలం లక్ష్యసాధనే తప్ప మరేదీ ఉండకూడదని భావించుకున్నాను. దీనిని సాధించుటకు సహాయము చేయమని వేడుకున్నాను. దీనంగా... శరణాగతుణ్ణి, మందబుద్ధిని, మీ సేవకుడిని, అజ్ఞానినని మొరపెట్టుకొని సహాయము చేసినచో తిరిగి ప్రయత్నించి పరీక్షలో పాస్ కాగలనని అన్నాను. ఆ తరువాత పిహెచ్.డిలో సీటు ఇప్పించమని కూడా వేడుకున్నాను. నా మొర ఆలకించిన శ్రీవేంకటేశ్వరుడు తదనుగుణంగా నాకు సహాయము చేశారు. కుటుంబము పైన, లోకం పైన మమకారమును నశింపచేశారు. ప్రయత్నిస్తే సాధించగలవనే నమ్మకమును ఏర్పరచారు.

ఏ రోజైతే నేను తిరుమల శ్రీవేంకటేశ్వరుని హరినామ క్షేత్రమును స్థాపించి నడిపించగలనో ఆ రోజే నేను ఎం.టెక్ పరీక్షలో పాస్ కాగలనని అంతవరకు వేచి ఉండాలనుకున్నాను. లక్ష్యసాధనకు ప్రయత్నిస్తూ, స్వామివారిని ధ్యానిస్తూ జీవిస్తున్నాను. కనబడ్డ ప్రతివారిని విచారించి, హరినామ క్షేత్ర స్థలము గురించి, వారి వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నాను. మరోప్రక్క మార్గదర్శనము చేయమని స్వామివారిని పదే పదే వేడుకున్నాను. ఇదే నా జీవిత ధ్యేయమని చెప్పాను. నేను శక్తిహీనుణ్ణి, మీ సహాయము లేకుండా చేయలేనని అన్నాను. స్వామి ఆజ్ఞానుసారమే సేవలను చేయాలి కాబట్టి తగిన సూచనలను ఇవ్వమన్నాను. పైగా ఈ క్షేత్రము మీ ఇష్టప్రకారంగా ఉండాలి, మీరు ఏ ప్రాంతాన్ని ఇష్టపడుదురో సెలవీయమని దీనంగా, నా కనులవెంట నీరు కారుచుండగా ప్రతిరోజూ ప్రార్థించసాగాను. దీనిని చూచి స్వామివారు కూడా ప్రసన్నులైనట్లు కనబడ్డది. కాలము దగ్గరికి వస్తున్నట్లు తోచింది. స్వామివారు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు కనబడ్డది. గత కొన్ని రోజుల క్రితం మా ఊరిలో వ్యవసాయదారులు 'వినావేంకటేశం' అంటూ నేర్చుకొనుట, ఎప్పుడో చెడిపోయిన భజనలకు ఉపయోగించే సంగీత పరికరాలు తిరిగి బాగు చేయించుట, నేను కళాశాలకు మాటి మాటికి వెళ్ళుటను కూడా చూచాను. ఎలాగైనా ఈసారి ఈ క్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని పట్టుపట్టాను.

ప్రతిరోజు స్వామివారితో ఇదే విషయమై వేడుకోలు ప్రార్థనలు చేస్తున్నాను. వీటన్నింటిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు ఒక చక్కని కబురును నిన్న అనగా తేది 22-04-2021 నాడు వినిపించారు.

ఒక పర్యాయం ఈ హరినామక్షేత్ర స్థాపనకు తగిన స్థలమును లేదా ఆలయాన్ని సూచించమని, డా॥ కె.వి.రమణాచారి గారితో మరియు బాలాజీ అనే ఒక మిత్రునితో చెప్పాను. ఈ బాలాజీ స్వామివారి భక్తుడు. పైగా శ్రీలక్ష్మీనారాయణ ట్రస్ట్ అని ఒక సంస్థను హైదరాబాద్ లోని సఫిల్ గూడ ప్రాంతమున ఏర్పాటు చేసి సేవ చేస్తున్నాడు. వీరు ధ్యానములో ఉన్నప్పుడు స్వామివారు రకరకాల భావనలతో, రూపులతో జరగబోవు విషయములను తెలుపుదురు. కాబట్టి వీరికి నా సమస్యను చెప్పి ఎప్పుడు స్వామివారు నా సమస్యను తీరుస్తారో అడగమన్నాను. ఈయన నాకు గత 15 సంవత్సరాల నుండి పరిచయము. నేను హరినామ క్షేత్రము కొరకు తయారు చేసిన ఒక పత్రమును ఈయనకు పంపాను. ఈయన వారి మిత్రబృందముతో చర్చించి తనవంతు

కృషి చేస్తున్నారు. ప్రతి రెండు మూడు రోజులకొకసారి ఈయనతో ఈ విషయమై చర్చిస్తాను. నా తపనను చూచిన శ్రీమాన్ బాలాజీ గారు తేది 21-04-2021 శ్రీరామనవమి నాడు ధ్యానము లోనికి వెళ్ళి, స్వామివారిని నా గురించి, నా ప్రయత్నం గురించి అడిగారట. దానికి స్వామివారు తేది 22-04-2021 నాడు చక్కని సమాధానం ఇచ్చారట. ఆయన తేది 22-04-2021 రాత్రి 10.30 గంటలకు ఫోన్ ద్వారా ఇలా తెలిపారు. నేనెంతో ఆనందించాను.

"సాయిరెడ్డి గత 18 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం 7 కోట్ల జపసమర్పణ చేసి అర్హత సంపాదించాడు. అతడు ప్రస్తుతం ఈ క్షేత్రమును స్థాపించుటకు సమర్థుడు. కంగారు పడవద్దని చెప్పు, తప్పక సాధించగలడు". ఇది శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా బాలాజీ గారికి తెలిపిన విషయము. శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా నారాయణుడని, ఆయన మాట ఇచ్చారంటే తప్పక నెరవేరునని, కాబట్టి నీవు ఎక్కువ చింతించక ఉండమని నాకు సలహా ఇచ్చారు. ఈ విషయాన్ని మీతో త్వరగా పంచుకోవాలనే కోరికతో ఈ రాత్రి సమయాన మిమ్మల్ని డిస్టర్బ్ చేసి తెలుపుచున్నానని కూడా అన్నాడు. శ్రీ బాలాజీ గారు ఇంకా ఇలా అన్నారు. స్వామివారు సమయానుకూలంగా, ఏది ఎప్పుడు అవసరమో దానిని ఈ కార్యక్రమము గురించి ప్రసాదించునని, దీనిని నీచే దిగ్విజయంగా నడిపించునని చెప్పారు. ఇంకా సాధించాల్సిన రెండు పనుల కొరకు కొన్ని రోజులు ఆగమన్నారని కూడా చెప్పారు. ఆ రెండు పనులు తనకు తెలియదన్నాడు. ఈ మాటలు విన్న నాకు మనస్సు సంతోషంతో నిండిపోయింది. విజయం సాధించినంత ఆనందం కలిగింది. ఆ తరువాత పడుకున్నాను. ఉదయం 5.30 గంటలకు మళ్ళీ ఇదే విషయమును కలలో చూపెట్టాడు.

**తేది 23-04-2021 కల :** ఈ కలలో హరినామక్షేత్రం ప్రారంభోత్సవం జరిగినట్లు, నేను మహానందమును అనుభవిస్తున్నట్లు కల కన్నాను. నా చిరకాల కోరిక నెరవేరినందుకు శరీరమంతా పులకరించి, ఆనందంతో నిండింది. ఇంతే కల.

ఈ విధంగా ఎట్టకేలకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాకు తన హరినామక్షేత్ర సేవను ప్రసాదిస్తున్నట్లు ఏప్రిల్ 2021 లో మాట ఇచ్చారు. నా ఆనందానికి హద్దులు లేవు. స్వామివారికి ఎన్నో కృతజ్ఞతలను తెలుపుకున్నాను.

తేది 16-12-2020న నేను సంకల్పములో ఓడిపోయింది మొదలు ప్రతిరోజు ప్రతిక్షణం అత్యంత తపనతో స్వామివారిని ప్రార్థిస్తూ, నాకు తెలిసిన రకరకాల విధాలుగా ఆరాధిస్తూ వచ్చాను. నా దుఃఖమును, తపనను, ఆరాటమును చూచిన స్వామివారు ఒకసారి సంకల్పములో గెలిచినట్లు, మరోసారి స్వామివారు నా పట్ల సంతోషించినట్లు ఆనందాన్ని కలుగజేశారు. ఆ తరువాత మరో సంకల్పాన్ని ఇచ్చారు. కాని నా తపన ప్రార్థన అలాగే కొనసాగడం వలన చివరికి హరినామ క్షేత్రం ఏర్పాటు చేయబోతున్నావంటూ పాడైపోయిన వాయిద్యాలను బాగు చేయించుట చూపించారు. ఎలాగైనా హరినామ క్షేత్రం ఏర్పరచి స్వామివారిని తృప్తి పరచాలనే నా మూలములో జరిగిన మార్పును గమనించిన శ్రీవేంకటేశ్వరుడు నేను హరినామక్షేత్రం ఏర్పాటు చేయుటకు అర్హుణ్ణని త్వరలోనే దీనిని ప్రసాదిస్తున్నట్లు కూడా ప్రకటించారు. దీనితో చాలా తృప్తి చెందాను. నాకున్న సమస్త దుఃఖము తీరింది. ఒక్కసారి ఆనంద సాగరములో మునిగినట్లనిపించింది, పరవశించిపోయాను. హరినామక్షేత్రమును స్వామివారు ప్రసాదిస్తున్నారని ఇక దీనికై చింతించవలసిన పని లేదని భావించాను.

**ఒక వివరణ:** స్వామివారిని ప్రార్థిస్తుంటే ఎప్పటికప్పుడు కొత్తదనం ఉంటుండేది. ఎంత ప్రార్థించినా తనివితీరేది కాదు. కాబట్టి మళ్ళీ మళ్ళీ ఒకే విషయాన్ని విసుగు లేకుండా ప్రార్థించాను.

## సాధన

ఇక ఇప్పుడు ఈ హరినామ క్షేత్రం ఎలా ఉండాలి? ఎక్కడ నిర్మించాలనే ఆలోచనలు వచ్చాయి. 2009 సంవత్సరం లేదా మరికొన్ని సందర్భములలో హరినామ క్షేత్రము తిరుమల ఆలయ ప్రతిరూపముగా ఉండాలనే భావనను మరచాను. కాబట్టి ఈ క్షేత్రం ఎలా ఉంటే బాగుంటుంది? ఎక్కడ నిర్మించాలని ఈ రెండు ప్రశ్నలకు జవాబును రాబట్టేందుకు మళ్ళీ స్వామివారిని ప్రార్థించుట మొదలుపెట్టాను.

ఈ క్షేత్రంలో జరిగే స్మరణ, కొలిచే దేవుడు అంతా తిరుమల శ్రీవేంకటేశ్వరుడే కావున, ఆయన ప్రతిరూపాన్నే ఈ క్షేత్రంలో ప్రతిష్ఠించాలి. భక్తులు భజన చేసే సమయాన కేవలం తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుణ్ణే మనసా వాచా కర్మణా అనుసరించాలి. భక్తులు సదా ఈ ఆలయంలోని మూర్తిని తిరుమల శ్రీవారి ప్రతిరూపంగా భావించాలనే భావం కలిగింది. దొరికే క్షేత్రాన్ని బట్టి కాకుండా ఏ దిశ క్షేత్రము లభించినప్పటికీ తిరుమల వైపు ముఖము చేసి భజనలను చేయాలని భావించాను.

ఈ విధమైన రకరకాల భావనలతో సదా స్వామి స్మరణతో కాలం గడుపుచున్నాను.

## హరినామక్షేత్రమునకు స్థలమును ఇవ్వచూపుట

**తేది 29-04-2021 :** ఈరోజు సాయంత్రం డా॥ కె.వి. రమణాచారి గారు ఫోన్ చేసి ప్రేమతో మాట్లాడారు. హరినామ క్షేత్రం కొండపాక గ్రామములో ఉన్న వారి ఆనందనిలయం క్షేత్రంలో ఏర్పాటు చేయమన్నారు. తగినంత భూమిని

ఇస్తానన్నారు. తనకు చేతనైన సహాయం అందించగలనన్నారు. అక్కడ ఇప్పటికే ఒక స్వామివారి ఆలయంతో పాటు ఒక 30 మంది వృద్ధులు నివసిస్తున్నారని, అందులో కొందరు ఈ భజనలలో పాలు పంచుకుందురని చెప్పారు. మరియు నాకు పూర్తి స్వేచ్ఛతో పాటు, ఊరి వాతావరణం ఉంటుందని చెప్పారు. అది హైదరాబాద్ నుండి సిద్దిపేటకు వెళ్ళే మార్గంలో సిద్దిపేట నుండి ఒక 20 కిలోమీటర్ల ముందు ఉంటుంది. దీనికి జవాబుగా ఈ క్షేత్రాన్ని స్వామివారి ఇష్టంతో ఎక్కడ ఏర్పాటు చేయమంటే అక్కడనే చేయవలసి ఉంటుందని చెప్పాను. చివరికి ఈ విషయమై స్వామివారిని ప్రార్థించాను. కాని ఎలాంటి జవాబును పొందలేదు.

## సావధానంగా ఉండమని చెప్పట

ఈ మధ్యన మళ్ళీ కోవిడ్-19 సెకండ్ వేవ్ విజృంభించింది. అందరూ వారి వారి ఇళ్ళలోనే ఉన్నారు. నేను కూడా ఇంట్లోనే ఉండి కాలక్షేపము కొరకు టీవీలో సినిమాలు, సీరియళ్ళు చూడసాగాను. పైగా హరినామక్షేత్రం ప్రసాదిస్తున్నట్లు స్వామివారు చెప్పడంతో ధైర్యంగా ఉన్నాను. గతంలో చాలా రోజులు బాధలను అనుభవించాను కాబట్టి ఆ బాధలను కొంత కొంత మరిచాను. దీనిద్వారా మళ్ళీ నా మనస్సు ప్రక్కదారి పట్టింది. దైవిక ఆలోచనలకు దూరంగా, నెగెటివ్ ఆలోచనలు మనస్సులో చోటు చేసుకుంటున్నాయి. స్వామి స్మరణ తగ్గింది, లౌకిక వ్యామోహం మొదలైంది. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు ఈ క్రింది లీలను ప్రసాదించి సావధానంగా ఉండమని చెప్పారు.

**తేది 01-05-2021 కల :** నేను హైదరాబాదు లోని పురానాపూల్ వద్ద గల మూసీనది మురికి కాలువల ప్రక్కనుండి నడుచుకుంటూ పోతున్నాను. నా ముందు పాయలుగా చీలిన మూసీ మురికి కాలువలు ఉన్నాయి. నేను వాటి ప్రక్కనుండి నడుచుకుంటూ పోతున్నాను. ఆ దారి అంతా చెత్తా చెదారం వల్ల మురికిగా ఛండాలంగా ఉంది. దుర్వాసన వస్తోంది. ఎవరో ఒక అదృశ్య వ్యక్తి నాతో ఇలా అన్నారు. "అలా మురికి కాలువల వెంట ఎందుకు పోతున్నావు? దూరంగా పో, ఒంటరిగా ఉండు" అని అన్నారు. కల చెదిరింది.

గత కొన్ని రోజుల నుండి ఆఫీసుకు వెళ్ళకుండా ఇంటిలోనే ఉండేసరికి నాకు ఈ పరిస్థితి కలిగింది. గతంలో కూడా నేను అధికంగా సినిమాలు సీరియళ్ళు చూచినప్పుడు స్వామివారు నొచ్చుకున్నారు. ఈసారి మళ్ళీ అదేవిధంగా చేశారు. ఆ తరువాత మళ్ళీ నేను మా ఆఫీసుకు రావడము, స్వామిని స్మరించుట కొనసాగించాను. నాకు మా ఆఫీసు ఒక సాధనాలయంగా ఉపయోగపడింది.

## గోవిందా! గోవింద నామ జపం

ఈ కల నా భార్య సురేఖకు వచ్చింది. ఈ మధ్యన కరోనా-19 రెండవ వేవ్ చాలా తీవ్రంగా విజృంభిస్తున్న వేళ తిరుమల ఆలయానికి భక్తుల రాక తగ్గింది. జనాలు ఈ వ్యాధితో బాధపడుచున్నారు. మనిషి ఎదుటి మనిషిని చూచి భయపడుతున్నాడు. ఈ పరిస్థితిని రూపు మాపి పూర్వపు ఆనందకరమయ పరిస్థితులను స్వామివారే తీసుకురావాలనే ఉద్దేశ్యముతో శ్రీమాన్ మహంతి శ్రీనివాస్ అనే ఒక భక్తుడు 70 రోజులలో శ్రీవారికి "గోవిందా! గోవింద" అనే స్మరణను 700 కోట్లు చేసి సమర్పించాలని సంకల్పించాడు. ఈ మహాయజ్ఞం తేది 03-05-2021 నుండి ప్రారంభమై 70 రోజుల వరకు కొనసాగుతుంది. ప్రపంచము నలుమూలల ఉన్న శ్రీవారి భక్తులు, వారి వారి ఇళ్ళలోనే ఉండి, వారి అనుకూల సమయాన ఈ "గోవిందా గోవింద" అంటూ వారికి తోచినన్ని సార్లు జపం చేసి సాయంత్రానికి ఈయనకి వాట్సాప్ లో తెలియపరచవలసి ఉంటుంది. ఒక్కొక్క భక్తుడు ఒక్కడే కాని, లేదా ఆయన తరఫున సమూహంగా కాని జమచేసి పంపవచ్చును.

ఈ విషయాన్ని శ్రీమాన్ శ్రీనివాస్ గారు నాకు తెలిపారు. నేను సదా ఆయన స్మరణలోనే ఉంటాను కాబట్టి నేను నా భార్యకు చెప్పి తనను చేయమన్నాను. తాను గత 3-4 రోజుల నుండి స్మరణ చేసి ప్రతి రోజు తన జప సంఖ్యను ఆయనకు పంపుచున్నది. ప్రతిరోజూ ఈమె ఒక్కతే మూడు వేల నుండి ఏడు వేల వరకు చేస్తున్నది.

**తేది 12-05-2021 కల :** ఈ కలలో సురేఖ ఒక ముదుసలి స్త్రీని చూచింది. ఆమె ఒక చోట కూర్చుని దూదితో దీపపు వత్తులు చేస్తున్నదట. ఆమె వయస్సు దాదాపు 85 నుండి 90 వరకు ఉంటుందట. ఆమె ఒక అరుగుపైన కూర్చుండి ఈ వత్తులు చేస్తున్నది. ఆమె ప్రక్కన సురేఖ ఉన్నది. ఇంతలో మరొకామె బయటనుండి వారి వద్దకు వచ్చి, వారిని చూచి, ఈమె వత్తులు చేస్తున్నదా? అని సురేఖను అడిగిందట. అప్పుడు సురేఖ ఆమెతో మాట్లాడకుండా తన నామస్మరణ కొనసాగిస్తున్నదట. దీన్ని గమనించిన ఆమె ఆ... మాట్లాడవు చెప్పు... అంటూ సురేఖను మళ్ళీ అడిగిందట. అంతలో ఆ వత్తులు చేసే ఆమె కల్పించుకుని, సురేఖతో మాట్లాడకు, భంగపరచకు, ఈమె గోవిందనామ జపం చేస్తున్నది కనబడుట లేదా? అంటూ ఆమెతో అన్నదట. కల చెదిరింది.

ఈ విషయాన్ని సురేఖ ఈరోజు ఉదయం నాతో చెప్పింది. ఇది యాదృచ్ఛికమని, తాను స్వామినే తలుస్తున్నది కావున ఈ విధమైన కల కన్నానని చెప్పింది. ఇది విన్న నేను, యాదృచ్ఛికమనేది ఉండదు, నీవు గోవింద జపం చేస్తున్నావు కావున నిన్ను స్వామివారు కరుణించారని అన్నాను. మరియు




నామ జపం చేస్తున్న సురేఖను మాట్లాడుమని అడుగుట

మరింత మందికి ఈ కార్యక్రమము విస్తరించుమని చెప్పాను. చాలా రోజుల తరువాత సురేఖ కల కనడంతో సంతోషించింది.

## స్వామివారికి విన్నపము

గత కొన్ని నెలల నుండి హరినామ క్షేత్రమును స్థాపించి అందులో తిరుమల శ్రీవేంకటేశ్వరుని అఖండ నామస్మరణ జరిపించాలని ప్రయత్నిస్తున్నాను. దీనిని స్థాపించుటకు తెలిసిన అన్ని మార్గాలను ఉపయోగించుకున్నాను. తెలిసినవారిని తగిన స్థలము లేదా ఆలయము చూపించమన్నాను, కాని అది మా అధీనములో ఉండాలనే నియమంతో ప్రయత్నాలు చేశాను. మరియు దీనిని ఏవిధంగా నిర్వహించాలి? ఏవిధంగా భక్తులను ఆకర్షించాలని కూడా ఆలోచించాను. గుంటూరులో ఉన్న రామనామ క్షేత్రం గురించి తెలుసుకున్నాను. గత వారం క్రింద డా॥ కె.వి. రమణాచారితో మాట్లాడాను. ఆయన దీనిని చేయవచ్చని, భక్తులకు భోజనము మరియు దర్శనము ఏర్పాటు చేస్తే సరిపోతుందని అన్నారు. బహుశా ఆయన తిరుపతిని దృష్టిలో పెట్టుకుని అని ఉంటారని భావించాను. తిరుమలలో ఏమి ఇవ్వకున్నా భక్తులు ఎగబడి వస్తారు, నామస్మరణ చేస్తారు. వారు కోరేది కేవలం స్వామివారి దర్శనం మాత్రమే. కాని ఇక్కడ అలా ఉండదు. ఇక్కడ మనం నెలకొల్పే ఆలయానికి, ఆలయంలోని శ్రీవేంకటేశ్వరునికి అంతటి ఆకర్షణశక్తి ఉంటే తప్ప అది సాధ్యం కాదని భావించాను. కాబట్టి దీనంతటికీ ముఖ్య కారకుడు శ్రీవేంకటేశ్వరుడే. ఆయన తలచుకుంటేనే ఈ పని సులువు అవుతుంది. ఏ ప్రాంతంలో ఈ క్షేత్రాన్ని ఏర్పాటు చేయాలి? అనే విషయాలు కూడా ఆయన స్వయంగా తెలిపితే తప్ప మనకు తెలియదు. ఇక ఈ హరినామ క్షేత్రమును ఏర్పాటు చేసిన తరువాత భక్తులను ఆకర్షించే పని ఆయనే చేయాలి, లేకుంటే మాకు సాధ్యం కాదు. కాబట్టి అక్కడికి భక్తులు వచ్చే విధంగా, వచ్చినవారు నామస్మరణలో పాల్గొనే విధంగా స్వామివారే మార్చవలసి ఉంటుంది. ఈ కలియుగపు మానవుడు లాభం లేనిదే ఏ పనీ చేయడు. కాబట్టి ఆ క్షేత్రంలో వెలసిన స్వామివారు మా కోరికలను తొందరగా తీర్చగలరనే నమ్మకము ఏర్పడాలి. అప్పుడు భక్తులతో 7, 11, 21, 41, 60, 90 రోజులు... 6 నెలలు, 1 సంవత్సరం... 3 సంవత్సరాలు... 5 సంవత్సరాలు... 7 సంవత్సరాలు... వరకు ఒక్కొక్క భక్తుడు అన్ని రోజులు ఈ నామ స్మరణ చేయుదునని సంకల్పాలు తీసుకోవాలి. (ప్రతిరోజు 2 గంటలు లేదా 4 గంటలు మాత్రమే చేయాలి) శ్రీవేంకటేశ్వరునిపై అపార నమ్మకము, విశ్వాసం ఉంటే తప్ప ఇది

నెరవేరదు. భక్తులకు ఈ క్షేత్రానికి రావాలనే కోరిక అధికమవ్వాలి. అందుకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడే సహాయపడాలి. ఆయన తిరుమలలో భక్తులను ఏవిధంగా ఆకర్షిస్తున్నారో అదే విధంగా ఈ క్షేత్రంలో కూడా ఆకర్షించి తృప్తి పరచాలి. అప్పుడు మాత్రమే నేను ఈ హరినామ క్షేత్రమును స్థాపించి నిర్వహించగలను. స్వామి సహాయము లేకుండా సాధ్యపడదు. కాబట్టి ఈ రోజు నేను నా ప్రభువును ఈ విధంగా ప్రార్థించాను.

"ప్రభూ! మీరు తిరుమలలో ఏవిధంగా భక్తులను ఆకర్షించి అనుగ్రహిస్తున్నారో, వారిని క్షణమాత్రపు దర్శనానికే తృప్తి పరుస్తున్నారో అదేవిధంగా ఈ క్షేత్రానికి వచ్చే భక్తులను అనుగ్రహించమన్నాను. వారి వారి కోరికలను కృపతో నెరవేర్చవలసింది" అని ప్రార్థించాను. అప్పుడే ఈ హరినామ క్షేత్ర ఏర్పాటు సాధ్యమని విన్నవించాను. మరియు ఏ ప్రాంతములో దీనిని ఏర్పాటు చేయమంటారో సూచించవలసిందిగా వేడుకున్నాను. ఇది మొత్తం స్వామివారి అనుగ్రహంపై ఆధారపడి ఉన్నందున వారే నాకు ముందుండి తగిన విధంగా సూచించాలని, దానిని నేను తూచా తప్పకుండా అనుసరించగలనని విన్నవించాను. మళ్ళీ ఇలా ప్రార్థించాను. నాకు భక్తులను ఆకర్షించే గుణము కాని, వారికి తత్త్వమును బోధించే శక్తి గాని లేవు. నేను కేవలము తెర వెనుక సేవ చేయగలను. మీరు ముందుండి భక్తులను ఆకర్షిస్తూ, సంతోషపరుస్తూ సహాయము చేయమని వేడుకున్నాను. ఆ తరువాత ఈ క్షేత్రం ఎక్కడ నెలకొల్పమంటారనే విషయమును తెలుపమని నా సాధనను కొనసాగించాను.

ఒకానొక సందర్భములో స్వామివారు, తన భక్తులను సమ్మోహితులను చేసి తన వద్దకు రప్పించుకుందురనే విషయమును తెలిపారు, కాని దానిని మరచిపోయిన నేను పైవిధంగా అత్యంత ఆర్తితో ప్రార్థించాను. మరొక్క విషయము : స్వామివారి అనుభూతులను చదివానే కాని వాటిని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. కాలం గడిచిన కొద్దీ, యోగ్యత సాధించిన కొద్దీ అర్థం కాసాగాయి.

## హరినామక్షేత్ర ప్రదేశం చూపమని ప్రార్థన

**తేది 26-05-2021:** హరినామక్షేత్రమును ఏర్పాటు చేయాలనే బలమైన సంకల్పము ఉన్నప్పటికీ దీనిని ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయముపై తీవ్రంగా ఆలోచించాను. ఎందుకంటే ఇది అందరికీ అందుబాటులో ఉండాలి, పైగా శ్రీవేంకటేశ్వరునికి ఈ ప్రాంతం ఇష్టంగా ఉండాలి. కాబట్టి ఈ ప్రాంతాన్ని ఎన్నుకోవడంలో శ్రీవేంకటేశ్వరుణ్ణే చూపమని ప్రార్థించుట మొదలుపెట్టాను. గతంలో నాకు ఎన్నో విషయాలపై కలల రూపంలో దిశానిర్దేశం చేశారు. ఇది నాకు ఎంతో విలువైన ప్రాజెక్ట్, పైగా నా జీవితానికి అతి ముఖ్యమైనది. నా మొత్తం సాధనకు ఫలమిది, కాబట్టి దయచేసి ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమును చూపమని వేడుకున్నాను.

ఇలా కొన్ని రోజులు గడిచిన పిదప స్వామివారినుండి స్పందన లేనందున నిరాశపడ్డాను. మరియు ఇలా ప్రార్థించాను. హే ప్రభూ! ఈ ప్రాజెక్ట్ ద్వారా నా సంకల్పం నెరవేరకున్నా ఇబ్బంది లేదు. నేను ఓడిపోయినా సమ్మతమే, కాని నేను మీ సేవకుడిని, నా స్వామివారి కోసమై ఈ హరినామక్షేత్రమును ఏర్పాటు చేసి తద్వారా తరతరాల భక్తులకు మీ అనుగ్రహము లభించే విధంగా చేయాలనుకుంటున్నాను. నేను కూడా ఏదీ ఆశించకుండా మీ సేవ చేయాలనే కోరిక ఉంది. కాబట్టి దయచేసి నా కోరికను మన్నించి ఈ క్షేత్రం ఎక్కడ నెలకొల్పాలో తెలుపమని వేడుకున్నాను. ప్రతిరోజూ నాలుగైదు సార్లు సాష్టాంగ దండ ప్రణామాలు అర్పిస్తూ నా విన్నపాన్ని తెలియజేయసాగాను. అంతేకాకుండా గతంలో మా తండ్రిగారు కూడా ఈ క్షేత్రాన్ని ఏర్పాటు చేయమన్నారు. కాబట్టి ఇప్పుడు మా తండ్రి సహాయాన్ని కూడా అర్థించాను. నా మనస్సును ఈ విషయముపై కాకుండా ఇతరత్రా మరల్చలేదు.

ఈ రకమైన దృఢ సంకల్పముతో సాధనను చూసిన స్వామివారు నా కృషికి మెచ్చి ఒక చక్కని లీల ద్వారా మరింత ప్రోత్సహించారు. దీనిని వచ్చే భాగములో చూద్దాం!

**నా దశ :** నా సేవలను విశ్లేషించుకొనుట ద్వారా నా తప్పులు తెలిసినవి. హరినామక్షేత్రం ఏర్పాటు చేయుటకు పరివర్తన చెందుచున్నట్లు స్వామివారు చెప్పారు. మరియు దానిని ప్రసాదిస్తున్నట్లు కూడా సూచనలిచ్చారు. గతంలో నేను శ్రీ ఆంజనేయుణ్ణి ఆదర్శంగా తీసుకుని సేవ చేశాను. కాని ఇప్పుడు శ్రీ భరతుణ్ణి ఆదర్శంగా తీసుకొమ్మన్నారు.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**


**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి
పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**



# శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవం

– చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో|| "విశాల నీలోత్పల లోచనాయై వికాసి పంకేరుహ లోచనాయ
సమేక్షణాయై విషమేక్షణాయ నమశ్శివాయైచ నమశ్శివాయ"**

'మఖ' నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసాన్ని మాఘ మాసమని అంటారు. 'అఘం' అనగా పాపం అని అర్థం. పాపం లేకుండా చేసే మాసం కనుక మాఘమాసం అంటారు. శ్రీలక్ష్మీనారాయణులకు, ఉమామహేశ్వరులకు ఎంతో ప్రీతిపాత్రమైన మాసం. ఈ మాసంలో యజ్ఞ యాగాది క్రతువులు విశేషంగా జరుపబడతాయి. ఆధ్యాత్మిక కోణంలో పరిశీలిస్తే జన్మ జన్మల పాపాలను తొలగించుకునేందుకు భగవంతుడు మానవులకిచ్చిన అద్భుతవరం మాఘమాసం.

సృష్టి, స్థితి, లయ కారులైన త్రిమూర్తులలో లయ కారుడికి అత్యంత ఇష్టమైన ఈ మాసమందు స్నాన, దాన, జపాదులు, అర్చనల ద్వారా పవిత్ర జీవితము గడిపి, జీవితమును సార్థకము చేసుకోవాలి.

పంచాక్షరీ మంత్రము లోని అయిదు అక్షరాలలోని రెండు అక్షరాలు మహోత్కృష్టమైనవి. అవే 'శి' అనే అక్షరాలు. ఈ అక్షర ద్వయాన్ని జీవరత్నమంటారు. 'శివ' అంటే మంగళం, భద్రం, కళ్యాణం అనే అర్థాలు ఉన్నాయి. పరమ కళ్యాణం సమకూర్చు మహా నిర్ణేత. మాఘమాస బహుళ చతుర్దశి నాడు దివ్య (నిశీధి) రాత్రిలో ఆవిర్భవించాడు. అవ్యక్త స్వరూపుడైన పరబ్రహ్మం మొదట నిర్గుణుడు. లోక శ్రేయస్సు కోసం, భక్తులను అనుగ్రహించడం కోసం శివుడు లింగరూపం ధరించాడు. "లీయతే గమ్యతే యత్రయేన సర్వం చరాచరం తదే తల్లింద మిత్యుక్తం లింగ తత్వ విశారదైః" అన్నాడు వ్యాసుడు. ఎందులోంచి అన్ని వస్తువులు పుడుతున్నాయో అదే లింగం. సృష్టికి ప్రతీక. సృష్టిలోని శక్తికి ప్రతీక లింగమే. 'లిం' అంటే మన కంటికి కనిపించకుండా లీనమై

యున్నదానిని, 'గం' అనగా గుర్తుగా కనిపించేది అని 'లింగం' శబ్దానికి అర్థము. మరో మాటలో చెప్పాలంటే కనిపించని శివునికి, కనిపించే గుర్తు లింగం. సాంఖ్య దర్శనం ప్రకారం ప్రకృతి వికృతులు రెండూ లింగమే.

హిందువుల పండుగలలో మహాశివరాత్రి ప్రశస్తమైనది. ''శివ ప్రియాతు దుపాసా నార్థారాత్రి శివరాత్రి'' అని స్కాంద పురాణంలో పేర్కొన్నారు. అంటే శివునికి ప్రియమైన, శివుని ఆరాధనకు ఉత్కృష్టమైన రాత్రే శివరాత్రి. ''రుద్రో దివా ఉమా రాత్రిస్తస్మై తస్యై నమో నమః'' అంటుంది రుద్ర హృదయోపనిషత్తు. రుద్రుడంటే పగలు. రాత్రి రూపం ఉమ. 'పగలు' అంటే ప్రకాశవంతమైనది. లోకానికంతటికీ వెలుగులను ప్రసాదించి ప్రకాశవంతము చేస్తాడు శివుడు. రాత్రి అంటే నిశీధి. అంధకార బంధురమైన రాత్రిని అజ్ఞానంతో పోల్చింది వేదాంత శాస్త్రము. అజ్ఞాన మయమైన రాత్రివేళ అమ్మవారు పసుపు పచ్చని ముఖముతో, మల్లెల్లాంటి చిరునవ్వులతో ప్రకాశిస్తూ లోకములోని తన బిడ్డలకు అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞాన కాంతులను ప్రజ్వలింపచేస్తుంది. ప్రకాశవంతులను గావిస్తుంది. అందుకే మహాశివరాత్రి అయింది. సకల జీవరాశిని ఆది దంపతులిద్దరూ తమ ఒడి లోనికి తీసుకుని వారి ప్రార్థనలు, కోరికలు తీర్చి ధన్యులను చేస్తారు.

పూర్వం క్షీరసాగర మథనానంతరం శ్రీమహావిష్ణువు, బ్రహ్మలకు తమలో ఎవరు గొప్ప అని వాగ్వివాదం జరిగింది. ఆ సమయంలో ప్రళయం సంభవించకుండా వారిద్దరినీ శాంతింప చేయడానికి శివుడు మహానిశీధి (చీకటిరాత్రి)లో పాతాళం, భూమి, ఆకాశం కలుపుతూ కోటి సూర్యరశ్ములు వెదజల్లుతూ, ఓంకారనాదం ప్రతిధ్వనిస్తుండగా అనంతమైన తేజోరూపంతో జ్వాలాలింగంగా ప్రత్యక్షమై తన ఆది, అంతాలను కనుగొనమని ఆదేశిస్తూ, అలా మీ ఇద్దరిలో ఎవరు కనుగొని ప్రథమంగా వస్తారో, వారే గొప్పవారని పరీక్ష పెడతాడు. అప్పుడు శివ పాద దర్శనమునకై వరాహ రూపమున శ్రీహరి, శిరోదర్శనమునకై హంసరూపమున బ్రహ్మ భూమ్యాంతరిక్షాలంతటా తిరిగి సఫలీకృతులు కాలేక వారి గర్వం తొలగి ఈశ్వరుని ప్రార్థించగా, వారి ముందు ప్రత్యక్షమైన శివునికి అర్చన గావించిరి. ఇలా తాను జ్వాలాలింగ రూపంలో ఉద్భవించిన మాఘమాస బహుళ చతుర్దశి ధనిష్ఠ నక్షత్రంతో కూడిన దివ్య (నిశీధి) రాత్రి మహాశివరాత్రిగా, తనకు అత్యంత ప్రీతిపాత్రమైందన్నాడు పరమేశ్వరుడు. మహాశివరాత్రి ఉదయాన ప్రాతః కాలకృత్యాలనంతరం శివలింగమునకు అభిషేకాదులు, బిల్వ సమర్పణ, ఉపవాస జాగరణ గావించి ఆది దంపతుల కళ్యాణము, ఉత్సవములను వీక్షించినవారు పార్వతీ పరమేశ్వరుల కృపకు పాత్రులవుదురు. శివరాత్రి నాడు ఉద్భవించిన జ్యోతిర్లింగ రశ్ములు పడిన ప్రదేశాలే జ్యోతిర్లింగ క్షేత్రాలు. వాటిలో మిక్కిలి ప్రాచుర్యం పొందినవి ద్వాదశ జ్యోతిర్లింగాలు.


పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవదైన శ్రీ మల్లికార్జున స్వామివారు, అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవార్లకు నిలయం శ్రీశైల దివ్యక్షేత్రం. ఇది ఇల కైలాసంగా ప్రసిద్ధి గాంచింది. యుగ యుగాలుగా ఎంతోమంది మహానుభావుల ఆధ్యాత్మిక సాధనకు అనువుగా నిలిచి, అలాంటి ఎంతోమంది దివ్యపురుషుల పుణ్య పాద స్పర్శతో పునీతమైన ప్రదేశం శ్రీశైల క్షేత్రం. నిత్యం ఉత్సవాల శోభతో భాసిల్లే ఈ క్షేత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా రోజూ వేలాదిమంది భక్తులు దర్శిస్తుంటారు. ఇక్కడ అత్యంత వైభవంగా జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పెద్దయెత్తున జరిపిస్తారు. తిరుమలలో శ్రీవారికి జరిగే బ్రహ్మోత్సవాల మాదిరిగానే ఘనంగా ఇక్కడా నిర్వహిస్తారు. కోట్లాది రూపాయలు వెచ్చించి అత్యంత వైభవోపేతంగా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలను చూసి తీరవలసిందే కానీ వర్ణనాతీతం. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 8 నుండి 16వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవ సంబంధ విశేషాలను తెలుసుకుందాం.

బ్రహ్మ ఒకనాడు ధ్వజారోహణ పూర్వకంగా ఉత్సవం చేయడానికి సంకల్పించి, అందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా పరమేశ్వరుని ప్రార్థించాడు. బ్రహ్మ సంకల్పానికి స్వామివారి అనుమతి లభించింది. క్షేత్ర పాలకుడైన వీరభద్రుని పర్యవేక్షణలో, బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో, శివపరివార దేవతలలో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో ముని జన సమేతుడై ధ్వజారోహణ పూర్వకంగా ఉత్సవాన్ని ప్రారంభించాడు.

**"ఉదిత్యుత్కృష్ట వచనం నవో యజ్ఞ ఉదాహృతః**
**తస్మా దుత్కృష్ట యజ్ఞత్వా దుత్సవః పరిభాష్యతే"**

అని భృగువు ఉత్సవ పదాన్ని నిర్వచించాడు. ఉత్ + సవః = ఉత్సవం. 'ఉత్' యనగా ఉన్నతమైన 'సవః' అంటే యజ్ఞమని అర్థము. అన్ని యజ్ఞముల కంటే సమున్నతమైనది కనుక స్వామికి జరిపే ధ్వజారోహణ పూర్వకమైన ఈ సేవను ఉత్సవమని అత్ర్యాది మహర్షులు కూడా ప్రవచించారు.

బ్రహ్మ + ఉత్సవము – బ్రహ్మోత్సవం. చతుర్ముఖ బ్రహ్మ చేత ఆరంభింపబడిన ఉత్సవాలనేది ఒక అర్థం కాగా, పరబ్రహ్మ స్వరూపుడైన మహేశ్వరునికి సంబంధించిన ఉత్సవాలని రెండవ అర్థం. ఆలయ ప్రాంగణములోని ప్రధాన ధ్వజ స్తంభం మీద పతాకావిష్కరణ చేయడమే ధ్వజారోహణం. ఒక కొత్త వస్త్రము మీద పరమశివుని వాహనమైన నందీశ్వరుని, అష్టమంగళ చిత్రాలను చిత్రీకరిస్తారు. దీన్నే 'నంది ధ్వజ పటం' అంటారు. దీన్ని ధ్వజస్తంభము మీద కట్టేందుకు నూలుతో చేసిన తాడును సిద్ధం చేస్తారు. ధ్వజాన్ని ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు తెచ్చి చండీశ్వరస్వామి సమక్షంలో పూజాదికాలను నిర్వహిస్తారు.



ఇక్కడనే భేరీపూజను కూడా చేస్తారు. భేరీ పూజ అనగా తోలు వాద్యానికి పూజాదికాలను నిర్వహిస్తారు. తరువాత నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. ఈ ప్రక్రియ చేయడానికి (ధ్వజారోహణ) ముందు ఉత్సవాలలో ఆయా వైదిక విధులను నిర్వహించమని ఋత్విక్కులను ఆహ్వానిస్తూ దీక్షా వస్త్రాలను అందజేయడమే ఋత్విగ్వరణం అంటారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించి తదనంతరం ఆలయ ప్రాంగణములోని నిర్ణీత ప్రదేశంలోని మట్టిని స్వీకరిస్తారు. దీనిని 'మృత్సంగ్రహణం' అంటారు. అలా సేకరించి తొమ్మిది పాలికలలో నింపి వాటిలో నవధాన్యాలను పోసి, అవి వృద్ధి చెందేలా రోజూ నీరు పోసి నవధాన్యాలు మొలకెత్తింప చేస్తారు. అంకురాలను ఆరోపింపచేసే కార్యక్రమము కాబట్టి ఇది 'అంకురార్పణ' అయింది. తదనంతరం ధ్వజపటాన్ని స్తంభముపై ఎగురవేస్తారు. ధ్వజస్తంభము మీద ఎగిరే ఈ నంది పతాకమే సకల దేవతలకు, యక్ష, గంధర్వ గణాలకు ఆహ్వానం. ఈ ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన దేవతలకు రోజూ పద్ధతి ప్రకారంగా వారికి నివేదన సమర్పిస్తారు. దీనినే 'బలిహరణం' అని అంటారు.

బ్రహ్మోత్సవాలలో లోక కళ్యాణం కోసం మల్లికార్జునస్వామి వారికి విశేషార్చనలు, శ్రీ భ్రమరాంబాదేవి వారికి ప్రత్యేకపూజలు, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు, రుద్రహోమం, చండీహోమం మొదలైన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు నుండి రోజూ శ్రీ స్వామివార్లకు వాహన సేవలు నిర్వహించబడతాయి. వరుసగా భృంగి, హంస, మయూర, వాహన, పుష్పపల్లకీ సేవ, గజవాహనం మొదలైన వాటిపై ఉత్సవమూర్తులను ఉంచి ఊరేగిస్తారు. శివరాత్రి నాడు ప్రభోత్సవం, నందివాహనం, మరుసటి రోజు రథోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి, అమ్మవార్లకు విశేషంగా పుష్పాలతో, ఆభరణాలతో అలంకరింప చేసి, ఆలయ ప్రాంగణం లోని అక్క మహాదేవి అలంకార మండపంలో వేంచేపు చేయించి, వైభవోపేతంగా పూజలను నిర్వహిస్తారు. తదనంతరం స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవమును నిర్వహిస్తారు. గ్రామోత్సవంలో ఆలయ రథ వీధి గుండా నందీశ్వరుని ఆలయం, అక్కడినుండి క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి ఆలయం చెంతకు, తిరిగి అక్కడ నుండి ప్రధానాలయం వరకు ఊరేగింపు చేస్తారు. వీధులలో ఆది దంపతులు ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు. రథం మీద ఉన్న ఆదిదంపతులను చూచినచో జన్మ కర్మాణి బంధములు లేని శాశ్వత ముక్తి కలుగుతుంది.

శ్రీశైల క్షేత్రంలో స్వామివారికి జరిగే వివిధ అలంకరణలలో ప్రత్యేక అలంకరణ పాగాలంకరణ. ఈ అలంకరణ శ్రీశైల క్షేత్రంలో ఆనవాయితీగా కొనసాగుతోంది. స్వామివారి గర్భాలయం విమాన శిఖరం నుండి, ముఖమండపంపై ఉండే నదులను అనుసంధానం చేస్తూ పాగాను అలంకరింప చేయడం ఈ అలంకరణ ప్రత్యేకత. అనంతరం స్వామి, అమ్మవార్లకు కళ్యాణాన్ని జరిపిస్తారు. వేద మంత్రాల నడుమ, మంగళ నాదాలతో కళ్యాణం నేత్రానందంగా జరుగుతుంది. ఆదిదంపతుల కళ్యాణమును పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానముల వారు ఆ పుణ్యదంపతులకు పట్టువస్త్రాలను సమర్పిస్తారు.

బ్రహ్మోత్సవాలలో తొమ్మిదోరోజు సాయంకాలం సదస్యం, నాగవల్లి కార్యక్రమములను నిర్వహిస్తారు. అమ్మవారికి మెట్టెలను అలంకరిస్తారు. ముగింపు సందర్భముగా (ఉత్సవాల) ధ్వజమును అవరోహణ చేస్తారు. ముక్కోటి దేవతలు బ్రహ్మోత్సవాలకు వీడ్కోలు పలుకుతారు. అవరోహణతో బ్రహ్మోత్సవాలు సుసంపన్నముగా ముగుస్తాయి.

మహిమాన్వితమైన మాఘమాసాన పరమేశ్వరునికి జరిగే బ్రహ్మోత్సవములను దేవతలతో పాటు మనమూ దర్శించి తరిద్దాము.

**ప్రభుం ప్రాణనాథం – విభుం విశ్వనాథం**

> **స్వర్గం లభిస్తుంది 'గో' సేవతో –**
> **గోలోకం ప్రాప్తిస్తుంది 'గో'దానంతో**

ధారావాహికం



# మార్గదర్శకులు మహర్షులు

డా|| శివానందమూర్తి

**గత సంచిక తరువాయి**

ఇల్వలుడు విపరీతమైన ధనం ఇచ్చాడు. రెండు గుఱ్ఱాలు కట్టినటువంటి ఒక బంగారు రథం, ఇరవై వేల పాడియావులు, ఇరవై వేల గద్దెల బంగారము ఆయనకిచ్చేశాడు. (పెద్దపీట ఒకటుంటుంది. దానిచుట్టూ అంచులుంటాయి. దానిమీద రాశిగా పోస్తే బంగారం ఎంత ఉంటుందో దానిని ఒక గద్దె అంటారు).ఎలాగో అలాగ ఆయనను అక్కడినుంచి పంపించివేస్తే చాలుననుకొని ఇల్వలుడు ఆ ధనమంతా అగస్త్యుడికిచ్చాడు. వాడికి భయం. ఏం కోపం వస్తుందో, ఆయన ఏం చేస్తాడో అనే భయంతో ఆయనకు ఇచ్చేసి, నన్ను రక్షించండి అని కాళ్ళమీద పడ్డాడు.

ముగ్గురు రాజులూ ఆయన ధనం సంపాదించిన మార్గం చూచారు. దానం అడిగితే ఆయనకు ఇవ్వకూడదు. ఆయన సంపాదించుకోగలడు, బాగుందని అనుకున్నారు. లోకకంటకుడైన వాతాపిని తన తపస్సు ఖర్చు పెట్టకుండా సహజ శక్తితో చంపి, లోకోపకారం చేసి, ఆ ఇల్వలుడి యొక్క పొగరణిచి ధనం సంపాదించుకుని ఆశ్రమానికి తీసుకెళ్ళాడు అనుకున్నారు ఆ రాజులు. ఆ తర్వాత ఇల్వలుడిని కూడా ''నీవు నీ తపో యోగబలంతో నీ శరీరాన్ని చాలించేసెయ్యి'' అని చెప్పి వాణ్ణి కూడా అగస్త్యుడే చంపాడని పురాణం చెబుతున్నది. అక్కడే అప్పుడే చంపాడని మరొక పురాణం చెబుతున్నది. వాడికి మార్గోపదేశం చేశాడని వేరొక పురాణం చెబుతున్నది. ఆ విధంగా వాతాపి, ఇల్వలుడు ఇద్దరూ కూడా అగస్త్యుడి చేతుల్లో చనిపోయారు. ఆయన బంగారం తెచ్చి లోపాముద్రకు ఇచ్చి నగలు చేయించిపెట్టాడు.

అయితే ఆయన ఒక ప్రశ్న వేశాడు భార్యను. ''మనకి ఒక కొడుకు కావాలి. నీకు కూడా కొడుకుల మీద కోరిక ఉంది కదా. ఒక్కొక్కడిలో పదిమంది బలాఢ్యుల బలం కలిగిన పదిమంది కొడుకులు కావాలా? లేక నూరుమంది కావాలా? లేక ఒక్కొక్కడిలో నూరుమంది బలం కలిగిన పదిమంది కొడుకులు కావాలా? అలాకాక వెయ్యిమంది బలం కలిగిన ఒక్కడే కొడుకు కావాలా? అని అడిగాడు. ఏం చిక్కు ప్రశ్న? ఏం చెబుతుంది పాపం ఆవిడ? ఆమె ఆలోచించి, వెయ్యిమంది తేజస్సు, బలం కలిగిన ఒక్క కొడుకునే కోరుకుంది.

అలా అగస్త్యుడు, లోపాముద్రలకు ఒక కొడుకు పుట్టాడు. ఆ కొడుకు లక్షణం సహజంగా తేజస్సుతో ఉండటం చేత తేజస్వి అని పేరు పెట్టారు వాడికి. వెయ్యిమంది కొడుకులతో సమానమైన వాడు కాబట్టి అన్ని తరాలకు సరిపోయినవాడు ఒక్కడే పుట్టాడు. కాబట్టి పితృదేవతలందరూ కూడా ఉత్తమ లోకాలను పొందారు యథేచ్ఛగా. నిజానికి అగస్త్యుడు పితృదేవతలకు బాకీ లేదు. అయినప్పటికీ వాళ్ళకు ఉత్తమ లోకాలు కల్పించాడు. వాళ్ళ వాళ్ళ స్థానాలకు వెళ్ళారు.



ఆయన చేసిన పనులు ఎంత అద్భుతంగా ఉన్నాయంటే – అలాంటి మహాత్ములను చూడటానికి దేవతలు కూడా ముచ్చట పడతారు. ఒకనాడు బ్రహ్మదేవుడే సాక్షాత్తు ఆయన ఆశ్రమానికి వచ్చాడు. వేలాది సంవత్సరములు తపస్సు చేస్తే, దర్శనం కోసం తపనపడితే కూడా దర్శనం దొరకని బ్రహ్మ, పిలవకుండా, అడగకుండా, ఆయనను స్మరించకుండానే తానే వచ్చాడట. బ్రహ్మ అగస్త్యుడితో ''నిన్ను చూడాలని నాకనిపించింది. అందుకనే వచ్చాను'' అన్నాడట. అలభ్యయోగం అంటే అదే. ''అనేక వేల సంవత్సరాలు తపస్సు చేస్తే కాని దొరకని నీ దర్శనం నాకు

అలభ్యంగా దొరికింది. నా అదృష్టం. ఊరికే రావు కదా. నామీద దయతో ఏమి ఆజ్ఞాపిస్తావు?'' అని అడిగాడట అగస్త్యుడు.

''ఓ మహనీయ తపోనిధీ! నీవంటి ఉత్తమ మహర్షుల వలననే విశ్వం ఇలా సక్రమంగా నడుస్తున్నది. మనుష్యులలో సామాన్య ప్రజలు లక్షల కొద్దీ చేసే నేరాలు, అధర్మాలు – వాటినన్నింటినీ ఆహారంగా తీసుకుని, జీర్ణించుకొని, చక్కగా ఈ ప్రపంచాన్ని ధర్మబద్ధంగా నడిపించేటటువంటి వాళ్ళు మహర్షులే. మీ తపస్సులు లోకాలను కాపాడుతున్నాయి. నిరంతరము మహర్షులే మానవ జాతికి ప్రాతఃస్మరణీయులు, వందనీయులు. ఈ మాటలు చెప్పాలని వచ్చాను'' అని బ్రహ్మ అన్నాడు.

దక్షిణదేశంలో ఒకప్పుడు కవేరుడు అనే ముని ఒకరుండేవారు. ఆయన పరమశివుడి గురించి చాలాకాలం తపస్సు చేశాడు. చిరకాలానికి పరమశివుడు ప్రత్యక్షమై ''ఏం కావాలి?'' అని అడిగితే తనకు ముక్తినిమ్మని అడిగాడు. అప్పుడు శివుడు ''అది నేను నీకు ఇవ్వకూడదు. బ్రహ్మను గురించి తపస్సు చెయ్యి. ఆయన ద్వారా అజ్ఞానము తొలగి నీకు ముక్తి లభిస్తుంది'' అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

శివుడు అలా అనడానికి కారణం బ్రహ్మ చెప్పాడు. ''పూర్వజన్మ నుంచీ సిద్ధింపని కోరికలు కొన్ని నీకు (కవేరుడికి) ఉన్నాయి. లోకంలో అన్నీ నడిపించేవాడిని నేను కాబట్టి ఆ పని నాకిచ్చాడాయన. నీకు కొంత కార్యక్రమం బాకీ ఉంది. నువ్వు గృహస్థ ధర్మంలో ఉండాలి. నీ గర్భవాసంలో కారణ జన్మురాలయినటువంటి ఒక పుత్రిక జన్మించిన తరువాత నీకు అవరోధాలు తొలగి ముక్తికి మార్గం దొరుకుతుంది. ఆ కారణ జన్మురాలు సామాన్యురాలు కాదు. నీకు పుట్టబోయే కూతురు, నా కుమార్తెగా లోకంలో భావించబడే విష్ణుమాయ లోంచి పుడుతుంది'' అని బ్రహ్మదేవుడు కవేరుడితో చెప్పాడు.

తరువాత కవేరుడు గృహస్థ ధర్మంలోకి వెళ్ళాడు. ఆయనకు ఒక కుమార్తె పుట్టింది. ఇక తపస్సు చాలించి ముక్తి కోసం ఎదురు చూడసాగాడు. కవేరుడి ముక్తి కోసం ఆయనకు కుమార్తెగా జన్మించిన విష్ణుమాయ తపస్సు చేస్తోంది.

బ్రహ్మదేవుడు పై విషయాలన్నీ అగస్త్యుడికి చెబుతూ ''నీ భార్య అయిన లోపాముద్ర ఆ విష్ణుమాయ లోని ఒక అంశయే. మరొక అంశ కవేరముని పుత్రికగా జన్మించింది. అందుచేత నీవు లోపాముద్రతో సహా ఆమెను రెండవ భార్యగా స్వీకరించు'' అని ఆజ్ఞాపించాడు.

బ్రహ్మ ఆజ్ఞ ప్రకారంగా అగస్త్యుడు కవేరముని కుమార్తెను, లోపాముద్రతో పాటు రెండో భార్యగా పరిగ్రహించాడు. అందుకోసమే అగస్త్యుడు దక్షిణ దేశానికి వచ్చాడు. కవేరముని కుమార్తె కాబట్టి ఆమె 'కావేరి'.

వివాహానికి ముందు ఆమె అగస్త్యుడితో ''నేను వివాహం చేసుకోవటానికి సిద్ధమే. నేను నా తండ్రి ముక్తి కోసం తపస్సు చేశాను. ఆ తపస్సు ఫలించింది. విష్ణువు ఆజ్ఞ చేత నేను ఈ దేహం వదిలిపెట్టి నది రూపంలో శాశ్వతంగా ఇక్కడ ఉండాలి. నదిగా కావటానికి నేను సిద్ధమే. కాబట్టి నన్ను వివాహం చేసుకుని మీరు ఏమి సుఖపడతారు'' అన్నదట.

అప్పుడు అగస్త్యుడు ఆమెతో ''నదివైనా సరే నాకు పత్నిగా ఉండు. అలా చేయమని నన్ను బ్రహ్మదేవుడు అడిగాడు'' అన్నాడు. పత్నిగా ఈ శరీరంతో మిమ్మల్ని పొందటం, తర్వాత నదిగా మారటం ఎందుకు? ఇప్పుడే మీ కమండలంలో ప్రవేశిస్తాను. జల స్వరూపంలో నన్ను మీరు మీ కమండలంలో తీసుకు వెళ్ళండి. నేను మీకు మరో పత్నిగా ఉంటాను'' అని కావేరి ఆయన కమండలం లోకి ప్రవేశించింది. అయితే ఈ కథంతా జరిగింది ఉత్తరదేశంలో. తర్వాత అగస్త్యుడు దక్షిణ దేశం రావటం జరిగింది. ఆ తర్వాత ఆ కమండలంలోని ఉదకం ఇలాగ దక్షిణ దేశంలోంచి పోవటం చేత కావేరి అయింది.

అగస్త్య మహర్షి వింధ్య పర్వతాలు దాటి దక్షిణ దేశానికి వచ్చిన తరువాత ఆ ఉదకాన్ని వదిలిపెడితే, ఇక్కడ నదిలా పుట్టింది. కవేరుడు వచ్చి దక్షిణ దిశలో ఉన్న ఆ నదిలో స్నానం చేశాడు. కావేరి ఆయన కుమార్తెయే కదా! ఆవిడ హేతువుగా తనకు ముక్తి కావాలని కోరి ఉన్నాడు. ఈశ్వరాజ్ఞ అది. ఇక్కడికి రాగానే అతడికి దేహాత్మభావం పోయింది. దేహాన్ని విసర్జించాడు. ముక్తి పొందాడు. కవేరుడి కర్మపాశం అలా ఉంది. జీవులకు చాలా భయంకరమైన కర్మపాశం ఉంటుంది. అది ముక్తికి అడ్డు వస్తుంది. ముక్తిని కోరుకోగలిగినప్పటికీ, కర్మ జీవుని వదలదు. పూర్ణ కర్మక్షయం కావడం అనేది సాధ్యం కాదు. సులభంగా కాదు. అందుకే అనుభవించమంటారు దానిని. అనుభవించాలి. వదిలిపెట్టేటప్పుడు దానిని విడదీసుకోవాలి. పాశం మనకు ఎక్కడయితే బంధం అయిందో, అక్కడ దానిని కత్తిరిస్తే ఆ గొలుసంతా ఊడిపోతుంది.

ఈ 28వ మహాయుగంలో ఇప్పుడు కలియుగం నడుస్తున్నది. ఈ కల్పంలోనే కృతయుగంలో వృత్రాసురుడు అనే ఒక రాక్షసుడు ఉండేవాడు. వాడు కాలకేయులనే ఇద్దరు రాక్షసులతో కలిసి, ఇంద్రుడిని తన పరాక్రమంతో జయించి దేవతలను బాధించాడు. స్వర్గాన్ని ఆక్రమించుకున్నాడు. అప్పుడు దేవతలు బ్రహ్మ దగ్గరికి వెళ్ళి రక్షించమని అడిగారు.

స్వర్గాన్ని పొందటానికి రెండు దారులున్నాయి. ప్రతి పనికీ కూడా సవ్యమైన మార్గం – అపసవ్యమైన మార్గం అని రెండు మార్గాలు ఉంటాయి. భూలోకంలోని మనుషులు స్వర్గానికి వెళ్ళటానికి తపస్సు చేసి, పుణ్యం చేసి, యజ్ఞాలు చేసి, కష్టపడి యోగసాధన చేసి స్వర్గానికి వెళతారు. రాక్షసులు వెళ్ళక్కరలేదు. నేరుగా వెళ్ళి ఆక్రమించుకుంటారు. అంటే సవ్యమైన మార్గం,

అపస వ్యమైన మార్గం అని ఉన్నాయి. పూర్వం నుంచి కూడా ఎవరో ఒకరు కష్టపడి ధనం పొంది ఆ కష్టార్జితం అంతా పోగుచేసి, ఒక చిన్న నేలను కొనుక్కుంటాడు. అప్పుడొకడు వెళ్ళి దానిమీద కూర్చుంటాడు. ఇది పరిపాటియే మనకు.

వృత్రాసురుడిని చంపటానికి దేవేంద్రుడికి శక్తి చాలకపోయేసరికి వీళ్ళను చంపే ఉపాయం చెప్పమని బ్రహ్మను అడిగాడు. అప్పుడు బ్రహ్మ ఆ వృత్రుడు ఎవరి వలనా చావడు. వాడిని చంపటానికి దధీచి మహర్షి యొక్క ఎముకలు పనికివస్తాయి. ఆయన యుగయుగాలుగా తపస్సు చేశాడు. ఆయన తేజస్సు, బలము అంతా ఆయన ఎముకలలో ఉన్నది. ఆయన ఎముకలను తీసుకుని ఆయుధంగా చేసుకుని వాడితే, ఆ ఆయుధంతో వాడు చచ్చిపోతాడు అని చెప్పాడని స్కాందపురాణం చెబుతున్నది. బృహస్పతి చెప్పాడని ఒక పురాణంలో ఉంది.

ఆ ఉపాయాన్ని తీసుకుని దధీచిని ప్రార్థించాడు ఇంద్రుడు. ''నీ వెన్నెముకలో చాలా బలమున్నదట. దానితో ఆయుధం చేసుకుంటాను. వృత్రాసురుడిని సంహరించాలి. కనుక దానిని నాకు ప్రసాదించు'' అని అర్థించాడు. దధీచి అందుకు అంగీకరించి, ''నేను దేహాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతున్నాను తీసుకో'' అని దేహాన్ని త్యాగం చేశాడు. దేవేంద్రుడు దధీచి వెన్నెముకతో వజ్రాయుధాన్ని తయారు చేసుకుని వృత్రాసురుడిని చంపేశాడు. కానీ కాలకేయులు, వృత్రాసురుడితో కూడా ఉండే ఇతర రాక్షసులు, సాధ్యమైనంత వరకు తప్పించుకుని సముద్రంలో దాక్కున్నారు.

(ఇంతకు పూర్వం సముద్రంలో దాక్కున్న రాక్షసులు వేరు, ఈ రాక్షసులు వేరు. వీళ్ళను అగస్త్యుడు సముద్రాన్ని ఇంకించి చంపేశాడు. ఆ కథ అయిపోయింది. ఇది తరువాత జరిగింది.)

కాలకేయులను చంపటానికి ఇంద్రుడు ఉపాయాలు ఆలోచిస్తున్నాడు. ఇలా జరుగుతుండగా వాళ్ళు చేసినటువంటి పాపమో, లోకానికి చేసే అపకారమో చాలా పరాకాష్ఠకి వెళ్ళింది. ఎలాగంటే కాలకేయులు వసిష్ఠుని ఆశ్రమానికి వచ్చి అక్కడ తపస్సు చేసుకుంటున్న ఆయన శిష్యులు 197 మందిని చంపేశారు. చ్యవన మహర్షి ఆశ్రమానికి వెళ్ళి నూరు మందిని చంపారట. భరద్వాజ మహర్షి ఆశ్రమానికి వెళ్ళి ఇరవై మంది ఆయన ప్రియశిష్యులను చంపారట. అంతమందిని చంపటం చేతనే మహర్షులు చర్య తీసుకున్నారు. అంత అపకారం చేస్తేకానీ వాళ్ళకు క్రోధం రాదు.

అప్పుడు వీళ్ళు వెళ్ళి ఇంద్రుడితో చెప్పారు. బ్రహ్మ దగ్గరికి వెళ్ళారు. బ్రహ్మేమో విష్ణువుని అడగమన్నాడు. మళ్ళీ దేవతలందరూ వెళ్ళి విష్ణువును ప్రార్థించారు. ఆయన ''అగస్త్య మహర్షి ఉన్నాడు కదా! ఆయన్ను అడగండి. సముద్ర జలాలను ఇంకింపచేసి వాళ్ళను బయటపెట్టగలడు. ఆ సముద్ర జలాలను ఇంకింప చేసేటప్పుడు సముద్రంలో ఉన్న జీవకోటిని చావకుండా ఆయనే కాపాడగలడు. అంత మహత్తు కలిగినవాడాయన'' అన్నాడు. అలా విష్ణువు సలహా ప్రకారం దేవతలు వెళ్ళి అగస్త్య మహర్షిని ప్రార్థించారు. ఇంద్రుడూ వెళ్ళి అడిగాడు.

అగస్త్యుడు వాళ్ళకు సహాయం చేసే ఉద్దేశ్యంతో సముద్ర జలం



మొత్తాన్ని అరచేతిలోకి తీసుకొని ఆపోశన చేసుకున్నాడు. ఆయన చేతిలోకి మొత్తం సముద్రజలం అంతా మూడు చుక్కలుగా వచ్చింది. జీవకోటి అంతా అలాగే ఉండిపోయింది. కాలకేయులు బయటపడ్డారు. ఇంద్రుడు వాళ్ళను సంహరించాడు. అప్పుడు జలాన్ని మళ్ళీ వదిలిపెట్టాడాయన. ముల్లోకాలలోని ప్రజలందరూ చాలా ఆశ్చర్యపోయారు. దేవతలు సంభ్రమంలో మునిగిపోయారు. ఈ విచిత్రం ఇదివరకు ఎక్కడా జరగలేదు. ఇదివరకు ఎవరూ చేయలేదు. భారతంలోని అరణ్యపర్వంలో ఆ కథ ఒకలాగ ఉంటుంది. పురాణంలో మరొకలాగా ఉంటుంది. అలా పాఠాలలో కొంచెం తేడాలు ఉన్నాయి. సముద్రాన్ని ఇంకింపచేసి ఆయన కాలకేయులను చంపగానే మళ్ళీ దేవతలు అగస్త్యుడి వద్దకు వెళ్ళి ''జీవకోటి మీ రక్షణలో ప్రాణంతో ఉంది. జలాన్ని వదిలిపెట్ట''మని అన్నారు. ''ఆ సముద్రాన్ని తీసుకుని ఆపోశనం చేశాను. సముద్రాన్ని వదిలిపెట్టాలని ఇంతకుముందు మీరు నాకు చెప్పలేదు. అది జీర్ణమైపోయింది. దాన్ని మళ్ళీ మీకోసం సృష్టించి వదిలిపెడుతున్నాను'' అని చెప్పి వదిలిపెట్టాడట ఆ నీటిని. తాను వదిలిపెట్టటం చేత సముద్రం అపవిత్రమయిందని, ''నేను జీర్ణం చేసుకుని పవిత్రమయిన జలం

మళ్ళీ నాలోంచి వదిలిపెట్టాను. అయినా నిరంతరం సముద్ర స్నానం చేయకండి. పర్వదినాలలో, పుణ్యతిథులలో మాత్రమే – ఆ పుణ్యతిథుల ప్రభావం చేత దాంట్లో ఉన్న అపవిత్రత తొలుగుతుంది. ఆనాడు మాత్రమే స్నానం చేయాలి'' అని నిర్ణయం చేశారాయన. మహాభారతంలోని అరణ్యపర్వంలో అలా ఉంది. ఇంకో పురాణంలో వెంటనే సముద్రాన్ని వదిలిపెట్టాడని ఉంది.

ఇవన్నీ గడిచి రామాయణ కాలం వచ్చింది. అగస్త్యుడు దండకారణ్యంలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకుని తపస్సు చేసుకుంటున్నాడు. రాముడు అరణ్యవాసానికి వచ్చాడు. అక్కడ లోక విఖ్యాతులయిన మహాత్ములు – శరభంగుడు, మందకర్ణి మొదలైన ఋషులను చూశాడు. సుతీక్ష్ణుడు అనే ఒక ముని ఆశ్రమానికి వెళ్ళాడు. రాముడికి ఆయన ఆశ్రమం నచ్చింది. సుతీక్ష్ణ మునితో ''మీ ఆశ్రమం చాలా బాగుంది. సీతకు కూడా నచ్చింది. మీ సన్నిధిలో మూడు రోజులు ఉండాలని



అనిపిస్తున్నది'' అన్నాడు రాముడు. అలాగే ఉండమన్నాడు ఆయన. సీతారామలక్ష్మణులు ముగ్గురూ ఆయన ఆశ్రమంలో కొంతకాలం ఉండిపోయారు. అప్పుడు సుతీక్ష్ణుడు రాముడితో ''నా ఆశ్రమం బాగుందన్నావు. నేను ధన్యుణ్ణి. అగస్త్య మహాముని ఆశ్రమం దగ్గరలోనే ఉంది. నువ్వు అక్కడికి వెళ్ళు. అక్కడ నీకు జరిగే లాభం మేమెవ్వరమూ ఇవ్వలేము. ఆయన ఇచ్చేది ఆయన ఒక్కడే ఇవ్వగలడు'' అని చెప్పి పంపించాడు. సీతారామలక్ష్మణులు వస్తున్నారని తెలియగానే, అగస్త్యుడు తన ఆశ్రమం నుండి బయటకు వచ్చి నిలబడి, స్వాగతం పలికి వాళ్ళను ఆశీర్వదించి, అతిథి సత్కారాలు ఇచ్చాడు. రామాయణ కాలానికి అగస్త్యుడు వానప్రస్థాశ్రమంలో ఉన్నట్లు రామాయణం చెబుతున్నది. కొడుకు పుట్టగానే ఆయన గృహస్థాశ్రమం వదిలిపెట్టాడు. వానప్రస్థాశ్రమంలో ఉండటం కారణంగా, ఆయన యథోచితంగా ఎలా అర్చించాలో అలాగ రాముణ్ణి అర్చించి గౌరవించాడు. సమస్త అస్త్రసంపద ఇదివరకే ఇచ్చాడు. ''ఇదివరకు ఇవ్వని ఒకటో రెండో నా దగ్గర ఉన్నాయి, వాటిని నీకిస్తాను'' అన్నాడు. వైష్ణవతేజంతో వెలుగొందే విల్లును అగస్త్యుడు రాముడికి ఇచ్చాడు. అంతకుముందే వైష్ణవతేజంతో ఉండే విల్లును పరశురాముడు వివాహ సమయంలో రాముడికి నానా అల్లరి పెట్టి ఇచ్చాడు. ఆయన 'జితోస్మి' అని ఇస్తే ఈయన (అగస్త్యుడు) అనుగ్రహంతో ఇచ్చాడు. ''విష్ణుతేజస్సుతో నిక్షిప్తమైన సుదర్శన ఆయుధం శక్తి యున్న ధనుస్సును నేనిస్తున్నాను'' అని అలా తీసి ఇచ్చాడు అగస్త్యుడు. అంతేకాదు, అమోఘమైన బాణాలతో కూడిన అక్షయ తూణీరాన్ని ఇచ్చాడు. రెండు ఖడ్గాలను కూడా సృష్టించి ఇచ్చాడు. అటువంటి ఖడ్గాలు సవ్యసాచి వలె రెండు చేతులతో ఏకకాలంలో అందరినీ వధించే శక్తి ఎవరికోసం ఉంటుందో వాళ్ళకోసం ఏర్పడ్డాయి. యోధుడెవరైనా ఒక ఖడ్గాన్ని ఒక చేత్తోనే వాడుకోగలడు. ''కానీ రెండు ఖడ్గాలనూ ఏకకాలంలో వాడుకునే శక్తి నీకు ఒక్కడికే ఉంది కాబట్టి, వీటిని నీకు ఇస్తున్నాను. నీకు ఇవ్వటమే యోగ్యమైన విధానము'' అని చెప్పి ఇచ్చాడు.

రాముడు, ''అరణ్యవాసకాలంలో ఎక్కడ ఉంటే బాగుంటుంది?'' అని అడిగాడు. అందుకు అగస్త్యుడు ''గోదావరి ఒడ్డున పంచవటి అనే క్షేత్రం ఒకటి ఉంది. అక్కడ ఒక ఆశ్రమం నిర్మాణం చేసుకుని ఉండు. నీకు క్షేమం కలుగుతుంది'' అని చెప్పాడు. శ్రీరాముడు అగస్త్యుణ్ణి ఎన్నో విధాలుగా స్తోత్రం చేశాడు.

రామరావణ యుద్ధం జరుగుతున్నప్పుడు, రాముడికి రావణుణ్ణి చంపటం సాధ్యం కాలేదు. శిరస్సు ఛేదిస్తున్నా చావటం లేదు. అలసిపోయాడు. తన తేజస్సును గురించి తనకే సందేహం కలిగింది. మానవ మాత్రుడిగా ఉన్నాడు కదా! అప్పుడు రాముడు పిలవకుండానే, స్మరించకుండానే అగస్త్యుడు ఆయనకు ప్రత్యక్షమై, ''నువు అలసిపోతున్నావు'' అని రాముడితో అంటూ, ఆ యుద్ధభూమిలోనే రాముడికి 'ఆదిత్య హృదయము'ను ఉపదేశం చేశాడు. రాముడికి మహోపకారం చేసిన మహర్షులలో అగ్రగణ్యులు విశ్వామిత్రుడు, అగస్త్యుడు.

**–శివానంద సువిధ ఫౌండేషన్ సౌజన్యంతో**

**(ఇంకా ఉంది)**

> **'గో' క్షీరం ఇస్తుంది బుద్ధిబలం –**
> **విద్యార్థులకు ఇస్తుంది సరస్వతీ కటాక్షం**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

## యుద్ధకాండ

**గత సంచిక తరువాయి**

### ఆలింగనం

లంకలో జరిగిన విషయాలు, సీతామాత సందేశం అన్నీ వివరించాడు మారుతి. విన్నాడు రాముడు. అంటున్నాడు ''హనుమంతుని ఘనకార్యం అద్భుతం. అనితరసాధ్యం. సముద్ర లంఘనం, లంకా ప్రవేశం, సీతా సందర్శనం, అశోకవన ధ్వంసం, రా వ ణునికి హితోపదేశం, లంకా దహనం అసమాన్యమైనవి. గ రుత్మంతుడు, వాయుదేవుడు, హనుమంతుడు – ఈ ముగ్గురే సముద్రాన్ని దాటగలరు. ఇతరులకు అసాధ్యం.

లంకానగరం రావణుని పాలిటి రాజ్యం. అది రాక్షస వీరుల రక్షణలో ఉంది. దుర్భేధ్యమైన లంకలో ప్రవేశించాడు హనుమ. తిరిగి రాగల్గాడు. అది హనుమ కార్య సఫలతకి, పరాక్రమానికి నిదర్శనం. సుగ్రీవునికి నిజమైన భృత్యుడతడు. రాజకార్యాన్ని భంగపరచలేదు. అత్యుత్తమ భృత్యుడు మారుతి. అతడు నాకు నచ్చాడు. వైదేహి జాడ తెలిసింది. నాకు మహోపకారం చేశాడు హనుమ.

**ఏష సర్వస్య భూతస్తు పరిష్వంగో హనూమతః ।**
**మయా కాలమిమం ప్రాప్య దత్తస్య మహాత్మనః ॥**

ప్రత్యుపకారం చేయాలి. ఇదే తగిన సమయం. నా దగ్గర ఏం లేదు. ఈ దేహం తప్ప. ఈ దేహంతో హనుమని గాఢాలింగనం చేసుకుంటాను. ఇదే నా సర్వస్వం – అన్నాడు రాముడు. హనుమంతుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు.

సేవకులు మూడు రకాలన్నాడు రాముడు. రాజు చెప్పిన పని – అసాధ్యమైనా చేస్తు. అంతేకాదు దానికి చెందిన వేరొక పని కూడా చేస్తాడు. వాడు ఉత్తమ భృత్యుడు. రాజు చెప్పిన పని మాత్రమే చేస్తాడు. ఇంకా చేయగల సమర్థుడు. అయినా చేయడు. వాడు మధ్యముడు. రాజు చెప్పిన పని చేయగలడు. ఆ సమర్థత ఉండి కూడా చేయడు. వెనక్కి తిరిగి వస్తాడు. వాడు అధమ భృత్యుడు.

తనకి నియమించిన పని చేశాడు హనుమంతుడు. అశోకవనం పాడు చేశాడు. రాక్షస సేనలో కొంతభాగం హతమార్చాడు. రావణునికి హితోపదేశం చేశాడు. లంకను దహించాడు. రక్షణ వలయాన్ని కొంత ఛేదించాడు. రాబోయే వానరులకి అనుకూలంగా మార్చాడు. తాళ్ళతో బంధింపబడ్డాడు. అవమానపడలేదు. సీతకి ధైర్యం చెప్పాడు. ఓదార్చాడు. నియమించిన కార్యాలే కాదు, అనేక కార్యాలు సాధించాడు.



సుగ్రీవా! సీతాన్వేషణ సఫలమైంది. కాని సముద్రాన్ని అనుకుంటే చాలు – నా మనసు కలవరపడుతోంది. దాన్ని ఎలా దాటాలి? ఆవలి తీరం ఎలా చేరాలి? ఉపాయమేమిటి? – అన్నాడు. ఆలోచనలో పడ్డాడు రాముడు.

## ఉత్సాహ ప్రోత్సాహాలు

విన్నాడు సుగ్రీవుడు. రామా! సీతాదేవి జాడ తెల్సింది. శత్రు నివాసం తెల్సింది. నీవు వీరుడవు. సర్వ సమర్థుడవు. పండితుడవు. ఆత్మవేత్తవు. శాస్త్ర కోవిదుడవు. సామాన్యునిలా దిగులు పడరాదు. మనం సముద్రాన్ని దాటగలం. లంకపై దండెత్తగలం. రావణుని హతమార్చగలం. ఇపుడు దైన్యం వద్దు. శోకం వద్దు. అది మంచిది కాదు. అవి ప్రయోజనాన్ని భంగపరుస్తాయి. రామా! వానరవీరులు సమర్థులు. ధైర్యం వహించు. నిరుత్సాహం సర్వకార్య వినాశకరం.

ఉత్సాహం లేనివాడు దీనుడు. శోకాకులుడు కార్యం సాధించలేడు. ఆపదలపాలవుతాడు. వానివల్ల సర్వప్రయోజనాలు నశిస్తాయి. వానరవీరులు నీ తృప్తి కోసం ఏమైనా చేయగలరు. అగ్నిలో దూకగలరు. రావణుడు పాపాత్ముడు. వాణ్ణి వధించాలి. సీతామాతని తీసుకురావాలి. అది ఆలోచించు. సముద్రంపై సేతువు నిర్మించాలి. లంకలో ప్రవేశించాలి. ఆ ఉపాయం ఆలోచించు. త్రికూట పర్వతం కనపడితే చాలు రావణుడు చచ్చినట్లే.

సముద్రానికి వారధి కట్టకపోతే – దాన్ని దాటలేం. లంకను నాశనం చేయలేం. కామరూపులు మన వానరవీరులు. లంకను పెకలించి తీసుకురాగలరు. రామా! దిగులుపడకు. ఆ దిగులే అన్ని పనుల్ని పాడు చేస్తుంది. దిగులు మనిషి శౌర్యాన్ని చెడగొడుతుంది. కనిపించని దానికోసం చెడిపోయిన దాని కోసం దుఃఖించరాదు. అలా చేస్తే సర్వకార్యాలు భగ్నమవుతాయి. రాఘవా! నీవు మహా ప్రాజ్ఞుడవు. శౌర్యాన్ని పుంజుకో. శౌర్యవంతుడు ఏ కార్యమైనా సాధిస్తాడు. నీవు కోదండం పడితే రణభూమిలో నిల్చుంటే ముల్లోకాల్లో ఒక్కడూ నీ ముందు నిలబడలేడు. సముద్రాన్ని దాటగలవు. త్వరలో సీతాదేవిని చూడగలవు. దుఃఖించింది చాలు. కోపం తెచ్చుకో. పౌరుషం తెచ్చుకో. క్షత్రియులు ప్రయత్న శూన్యులై నిర్ వ్యాపారులైతే వాళ్ళని మందభాగ్యులంటారు. భయంకరులైతే అందరూ భయపడతారు. నీవు సూక్ష్మబుద్ధి కలవాడవు. మనం సముద్రం దాటగలం. అపుడు విజయం కరతలామలకం. పెద్ద పెద్ద బండరాళ్ళు మహావృక్షాలు ప్రయోగిస్తారు వానర వీరులు. రాక్షసుల్ని హతమారుస్తారు. రామా నీకు విజయం తథ్యం. ఇపుడు అన్నీ శుభ శకునాలు కనపడుతున్నాయి. సంతోషంగా ఉంది నా మనసు.

## లంకా రక్షణ వ్యవస్థ

విన్నాడు రాముడు. హనుమంతునితో అంటున్నాడు. ''నా తపః ప్రభావంతో (దివ్యత్వంతో) సేతువు నిర్మించగలను. లేదా సముద్ర జలాల్ని ఇంకింప చేయగలను. అందుకు నేను సమర్థుణ్ణి. లంకా నగరంలో ఎన్ని కోటలున్నాయి? ఎన్ని దుర్గాలున్నాయి? నీవు చూశావు కదా. సైనికబలమెంత? రక్షణ వ్యవస్థ చూశావు. స్పష్టంగా ఉన్నది ఉన్నట్లు వివరించు''.



విన్నాడు మారుతి. చెబుతున్నాడు. లంకా పట్టణంలో చతురంగ బలాలున్నాయి. అవి పటిష్టమైనవి. ఆ లంక దుర్భేద్యమైంది. నాలుగు వైపులా నాలుగు మహా ద్వారాలున్నాయి. ఎంతో విశాలంగా ఉన్నాయి. ఎంతో ఎత్తుగా ఉన్నాయి. బలంగా ఉన్నాయి. వాటి వాకిళ్ళు కూడా చాలా బలంగా ఉన్నాయి. అక్కడ వందల కొద్దీ శతఘ్నులున్నాయి. అవి అతి భయంకరమైనవి. బాణాలు రాళ్ళు కురిపించగలవు (యుద్ధంలో వాటిని ఉపయోగించినట్లు వాల్మీకి పేర్కొనలేదు).

నగర ప్రాకారాలు బంగారుమయం. వజ్రాలు వైఢూర్యాలు ముత్యాలు పొదగబడ్డాయి. ఆ ప్రాకారాల చుట్టూ అగడ్తలున్నాయి. అందులో మొసళ్ళు చేపలున్నాయి. అవి భయంకరాలు. ప్రమాదకరాలు. ప్రాకారాల మీద వంతెనలున్నాయి. అవి రాకపోకల కోసం ఉన్నాయి. అవసరం లేనపుడు మూసేస్తారు. అక్కడే సేనల నివాసాలున్నాయి. శత్రువుల దాడుల్ని ఎదుర్కోగలరు. వంతెనలు లేకపోతే అగడ్తలు దాటలేం. అసాధ్యం. ఆ వంతెనలు బంగారు స్తంభాలతో నిర్మించారు. సేనల్ని రక్షణ వ్యవస్థని పర్యవేక్షిస్తుంటాడు రావణుడు. అతడు సదా జాగరూకుడై ఉంటాడు. పైగా రణోత్సాహి.

లంకానగరం త్రికూటపర్వతం మీద ఉంది. అక్కడికి చేరటానికి ఆధారం ఏమీ లేదు. దేవతలు సైతం పోలేరు. నగరానికి అడ్డంకులున్నాయి. అవి నాలుగు రకాలుగా ఉన్నాయి. జలదుర్గం. దాన్ని దాటితే పర్వతదుర్గం. దాని తర్వాత వనదుర్గం. ఆ తర్వాత కృత్రిమ దుర్గం. నాల్గవది శిల్పులచేత నిర్మింపబడింది. సముద్రానికి దూరంలో ఉంది లంక. నౌకామార్గం లేదు. ఇతర దేశాల వార్తలకు అవకాశం లేదు.

తూర్పుద్వారం వద్ద పదివేల మంది రాక్షస యోధులున్నారు. శూలాలు ఖడ్గాలు వారి ఆయుధాలు. దక్షిణ ద్వారంలో చతురంగ బలాలున్నాయి. లక్ష మంది రాక్షస వీరులున్నారు. వాళ్ళు సర్వశాస్త్ర కోవిదులు. ఉత్తర ద్వారాన నూరుకోట్ల మంది రాక్షస యోధులున్నారు. వారు రథ అశ్వ గజ బలాలు కలవారు. అందరూ రావణునికి విశ్వాసపాత్రులు. లంకానగరం నడిబొడ్డున వందల వేల రాక్షస యోధులు కోటిమంది పైగా ఉంటారు.

నేను వంతెనల్ని పగలగొట్టాను. కొన్ని అగడ్తల్ని పూడ్చాను. నగరాన్ని దహించాను. కొన్ని ప్రాకారాల్ని పడగొట్టాను. నా శక్తి కొద్దీ సేనల్ని చంపాను. రామా! మనం ఏదో విధంగా సముద్రం దాటాలి. దాటితే లంకను జయించడం నిశ్చయం. అంగదుడు, ద్వివిదుడు, మైందుడు, జాంబవంతుడు, నలుడు, సేనానాయకుడు నీలుడు వెడితే చాలు. వనాలతో ప్రాకారాలతో బహిర్ద్వారాలతో అగడ్తలతో ఉన్న పట్టణాన్ని ధ్వంసం చేస్తారు. జైత్ర యాత్రకి ముహూర్తం నిర్ణయించు. అంగదాది ప్రముఖుల్ని ఆజ్ఞాపించు.

## రామదండు

రక్షణ వ్యవస్థ వివరించాడు హనుమంతుడు. విన్నాడు రాముడు. అంటున్నాడు సుగ్రీవునితో—సూర్యుడు ఆకాశమధ్యంలో ఉన్నాడు. ఇది అభిజిన్ముహూర్తం. ఇదే విజయ ముహూర్తం. శ్రేష్ఠమైంది. ఇపుడే బయలుదేరుదాం. రావణుడు తప్పించుకోలేడు. విషం తాగి చచ్చేలోగా చేతికి అమృతం అందినట్లుగా నేను వస్తున్నాను – ఆ వార్త తెలుస్తుంది. సీత జీవిస్తుంది.

సుగ్రీవా! ఇవాళ ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. నాది పునర్వసు నక్షత్రం. కాబట్టి ఇది నాకు సాధన తార. రేపు హస్తా నక్షత్రం. అది నాకు నైధన తార. ఈరోజే ఇపుడే సమస్త సేనలతో ప్రయాణమవుదాం. రావణుని సంహరిస్తాను. జానకిని తెస్తాను. నా మనోరథం సిద్ధిస్తుంది. నా కుడికన్ను అదురుతోంది. శుభ నిమిత్తాలు తోస్తున్నాయి.

విన్నారు సుగ్రీవ లక్ష్మణులు. రాముని మాట తగిందన్నారు. అతణ్ణి మెచ్చుకున్నారు. మళ్ళీ చెబుతున్నాడు రాముడు.

సేనాపతి నీలుడా! లక్షమంది వానర వీరుల్ని వెంటపెట్టుకో. నీవు ముందు భాగాన నడు. దారి చూపుతూ వెళ్ళు. ఆ దారుల్లో కందమూల ఫలాలుండాలి. నీళ్ళుండాలి. తేనెలుండాలి. నీడనిచ్చే చెట్లుండాలి. రాక్షసులు కామరూపులు. దుర్మార్గులు. అన్నీ



కలుషితం చేస్తారు. జాగరూకుడవై ఉండు. ఏ క్షణాన్నైనా మనపై దాడి చేయవచ్చు. అది గమనిస్తూ ఉండు. బాలురు వృద్ధులు ఇక్కడే ఉండాలి. వీరులు, బలశాలురు మనల్ని అనుసరిస్తారు. గజుడు, గవయుడు, గవాక్షుడు ముందు నడవాలి. ఋషభుడు కుడివైపు ఉండాలి. సేనల్ని రక్షిస్తూ ఉండాలి. గంధమాదనుడు ఎడమవైపు ఉండాలి. సేనల్ని రక్షిస్తూ ఉండాలి. ఐరావతంపై ఇంద్రునిలా నేను హనుమ భుజాలపై కూర్చుంటాను. కుబేరుడు సార్వభౌమం అనే ఏనుగునెక్కినట్లు లక్ష్మణుడు అంగదుని అధిరోహిస్తాడు. మేం సేనల మధ్యలో ఉంటాం. భల్లూకరాజు జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి – ఈ ముగ్గురూ సేనా మధ్య భాగాన్ని కాపాడుతూ ఉంటారు.

రాముని ఆదేశం పాటించబడింది. వానరులు గుహల్లోంచి వచ్చారు. కొందరు పర్వతశిఖరాల్లోంచి వచ్చారు. ఎగురుతున్నారు. దుముకుతున్నారు. ముందుకు సాగుతున్నారు. రామదండులో వందలు వేలు లక్షల కోట్ల కొద్దీ ఉన్నారు. సింహనాదాలు చేస్తున్నారు. దక్షిణ దిశవైపు పోతున్నారు. రావణునికి చావు మూడిందని అరుస్తున్నారు. దారిలో తేనెలు తాగుతున్నారు. పండ్లు తింటున్నారు. ఒకర్నొకరు ఎత్తుకుంటున్నారు. కింద పడేస్తున్నారు. పడ్డవాళ్ళని లేవదీస్తున్నారు. కొందరు రాముని చుట్టూ చేరారు. నడుస్తున్నారు. కొందరు సుగ్రీవుని చుట్టూ చేరారు. నడుస్తున్నారు. శతవలి వెంట పదికోట్ల వానరసేన ఉంది. అందరినీ రక్షిస్తున్నాడతడు. కేసరి పవనుడు వందకోట్ల అనుచరులతో ఉన్నాడు. సేనకు కుడివైపు రక్షణభారం స్వీకరించాడు. గజుడు, అర్కుడు ఒకవైపు రక్షిస్తున్నారు. అన్నివైపులా పర్యవేక్షిస్తున్నాడు నీలుడు. దధిముఖుడు, ప్రజంఘుడు, రంభుడు, రభసుడు చుట్టూ తిరుగుతున్నారు. త్వరగా నడవాలి అంటూ ప్రోత్సహిస్తున్నారు. రామదండు ఒక మహాసముద్రంలా సాగుతోంది.

హనుమ, అంగదులు రామ లక్ష్మణులను మోస్తున్నారు. నలుగురూ ఒకచోట చేరినట్లున్నారు. గురు శుక్రులతో కూడిన చంద్ర సూర్యుల్లా ఉన్నారు. నాలుగు గ్రహాలు ఒక చోట కూడటం – జన వినాశన హేతువు. అంటే రాక్షస వినాశనాన్ని సూచిస్తోందని చెప్పాలి.

బుద్ధిమంతుడు లక్ష్మణస్వామి అది గమనించాడు. అంటున్నాడు. రామా! త్వరలో రావణుని చంపుతావు. సీతమ్మతో అయోధ్యకు వెళ్తావు. దివిపై భువిపై శుభ శకునాలు గోచరిస్తున్నాయి. కార్యసిద్ధి నిశ్చయమని తెలుస్తోంది. పిల్లగాలులు అనుకూలంగా వీస్తున్నాయి. మృగాలు పక్షులు మధురంగా అరుస్తున్నాయి. దిక్కులు నిర్మలంగా ఉన్నాయి. సూర్యుడు ప్రసన్నుడై ఉన్నాడు. శుక్రుడు మనకు వెనుక భాగంలో ఉన్నాడు. అది మనకు మంచిది.

సూర్యుడు మీనరాశిలో ఉన్నాడు. అపుడే రాముని ప్రయాణం.

అది ఫాల్గుణ పూర్ణిమ. శుక్రుడు మేషరాశిలో ఉన్నాడు. జన్మరాశి రామునికి కర్కాటకం. మేషంలో శుక్రుడు దశమ స్థానంలో ఉన్నాడు. అది రామునికి శుభప్రదం.

అరణ్యవాసానికి బయల్దేరినపుడు రాముని వయస్సు 25 సంవత్సరాలు. ఇపుడు 38 నిండాయి. ఇక్ష్వాకుల నక్షత్రం విశాఖ. రాక్షసుల నక్షత్రం మూల. గోచార ఫలంగా రామునికి అనుకూలం. రాక్షసులకి ప్రతికూలం. విశాఖ నక్షత్రం నిర్మలంగా ఉంది. మూలా నక్షత్రాన్ని ధూమకేతువు ఆక్రమించింది. అది రాక్షసుల వినాశనానికి సూచితం. ఇవన్నీ గమనించావు కదా రామా! సంతుష్టుడవై ఉండు అన్నాడు లక్ష్మణుడు.

ఉత్సాహ భరితులై ఉన్నారు కపివీరులు. వాయువేగాన సాగుతున్నారు. పరస్పరం బలప్రదర్శనలు గావించుకుంటున్నారు. ఆనందిస్తున్నారు. కొందరు పరుగులు తీస్తున్నారు. కొందరు గంతులు వేస్తున్నారు. కొందరు కేకలు వేస్తున్నారు. తోకల్ని ఝాడిస్తున్నారు. భూమి అదిరేట్లు కాళ్ళతో తొక్కుతున్నారు. బండరాళ్ళను పెకలిస్తున్నారు. పెద్ద పెద్ద చెట్లని విరుస్తున్నారు. పర్వత శిఖరాలెక్కుతున్నారు. మహానాదాలు చేస్తున్నారు. గర్జిస్తున్నారు. రాళ్ళతో చెట్లతో ఆడుకుంటున్నారు. వేల లక్షల కోట్ల వానర వీరులు సాగుతుంటే నేల కనపడలేదు. అహోరాత్రాలు నిర్విరామంగా సాగింది ప్రయాణం. రావణునితో యుద్ధం చేయాలని – సీతామాతకి విముక్తి కల్గించాలని ఆగకుండా అమిత వేగంతో మహాసేన కదిలిపోతోంది. సహ్యాద్రి దాటారు. మహేంద్ర పర్వతం సమీపించారు. అక్కడి వృక్ష సంపదని అద్భుతంగా వర్ణించాడు వాల్మీకి. అవి 21 శ్లోకాలు. సముద్ర తీరం చేరారు. మహేంద్రగిరి ఎక్కాడు రాముడు. సముద్రాన్ని చూశాడు. కిందకి దిగాడు.

సుగ్రీవునితో అంటున్నాడు – ఈ సముద్రం దాటాలి. ఎలా? సమస్య మొదలైంది మనకు. ఉపాయం ఆలోచించాలి. వానరేంద్రా! మన సేనల్ని ఇక్కడే ఆపేద్దాం. సమీపంలో శత్రువులు దాగి ఉండొచ్చు. మనల్ని దెబ్బ తీయవచ్చు. అందరం జాగ్రత్తగా ఉండాలి. ఎవ్వరే కాని సేనని విడిచిపోరాదు. వానర నాయకులు అనుక్షణం పర్యవేక్షిస్తుండాలి.

అందరూ విన్నారు. చెట్లకింద చేరారు. రెండో సముద్రంలా ఉంది వానరసేన. వారి కోలాహల ధ్వనులు సముద్రఘోషని అధిగమించాయి. వానరులు, గోలాంగూలు (కొండముచ్చులు), భల్లూకాలు – మూడు వర్గాలుగా విభజించబడ్డాయి. మహా భయంకరమైన సముద్రాన్ని చూస్తున్నారు. ఆ సముద్రాన్ని అద్భుతంగా వర్ణించాడు వాల్మీకి. అవి 15 శ్లోకాలు. అది సంధ్యా సమయం. తెల్లని నురుగులు – ఎగసిపడే అలలు – సముద్రం నృత్యం చేస్తున్నట్లుంది.

**(సశేషం)**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 95 వ కళ్యాణం

ఇ ది తేది 30-12-2025, వైకుంఠ ఏకాదశి, మంగళవారము నాడు జరిగింది. వైకుంఠ ఏకాదశి కాబట్టి సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు భజగోవిందం జరిగిన తరువాత 7 గంటల నుండి శ్రీనివాస కళ్యాణం జరిగింది. దీనిని రెల్కాన్ మార్వెల్ గేటెడ్ కమ్యూనిటీ వాసులు, కనోజిగూడ, హైదరాబాద్ లో నిర్వహించారు.

## 96 వ కళ్యాణం

ఇది తేది 03-01-2026 శనివారం ఉదయం 10.30 గంటల నుండి కమ్యూనిటీ హాల్, సాయినగర్, రోడ్ నెం.3, నాగోల్, హైదరాబాద్ లో జరిగింది. దీనిని నవదుర్గా మహిళా సంఘం మరియు సాయినగర్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ వారు నిర్వహించారు.

## 97 వ కళ్యాణం

ఇదితేది 11-01-2026ఆదివారంఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇది శ్రీ కనకదుర్గ దేవాలయం, రాంగోపాల్ పేట, సికింద్రాబాద్ లో జరిగింది. దీనిని శ్రీ కనకదుర్గ దేవాలయ కమిటీ మరియు శ్రీమాన్ మాదాస్ నర్సింగరావు, సూర్యకళ దంపతులు నిర్వహించారు.

## 98 వ కళ్యాణం

ఇది తేది 19-01-2026 సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ప్లాట్ నెం.37, గుట్టం సావిత్రమ్మ కాలనీ, గుట్టంగూడ, రంగారెడ్డి జిల్లా వద్ద జరిగింది. దీనిని శ్రీమాన్ పొన్నం రాజీవ్ కుమార్, లీలారాణి దంపతులు నిర్వహించారు.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 395. శీత జ్వర భయాంతకాయ నమః

– శీత జ్వరము వలన భయమును పోగొట్టువాడు విష్ణువు. ''జ్వరఘ్నాయ నమః'' (150) నామ వ్యాఖ్యను పరిశీలించండి.

శీతజ్వర భయాంతకుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 396. నృగరాజోద్ధరకాయ నమః

– నృగుడు వైవస్వతుని రెండవ కుమారుడు. ఇక్ష్వాకుని తమ్ముడు. నృగుడు ధర్మపాలకుడు. వాపీ కూప తటాకాదులను ప్రతిష్ఠించినవాడు. గొప్ప కీర్తి గల రాజు. నృగుడు ఒక బ్రాహ్మణునికి దానము చేసిన ఆవు తప్పించుకొని, రాజు యొక్క ఆవుల మందలో చేరగా పొరపాటున దానిని నృగుడు మరొక బ్రాహ్మణునికి దానము చేసినాడు. అందుకు కోపించిన మొదటి బ్రాహ్మణుడు నృగుని ఊసరవెల్లి (తొండ) యగుమని శపించినాడు. అంత శాపాంతమును రాజు వేడుకొనగా ఆ బ్రాహ్మణుడు కృష్ణుని సంస్పర్శ దర్శనము వలన శాప విముక్తి యగునని చెప్పినాడు.

నృగుడు ద్వారకా నగర ప్రాంతమున ఒక బావిలో తొండయై ఉండెను. ఒకనాడు కృష్ణుడు ఆ మార్గమున వెళ్ళుచు బావిలో నున్న తొండను చూచి దయతో దానిని ఎత్తి శాపావసానము కలిగించినాడు. అంత నృగుడు స్వస్వరూపము దాల్చి కృష్ణునికి నమస్కరించి దివ్య విమానమున స్వర్గమునకు వెళ్ళినాడు.

నృగరాజుని ఉద్ధరించిన కృష్ణునిగా జన్మించిన విష్ణువు యొక్క అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.


## 397. పౌండ్రకాది వధోద్యకాయ నమః

– మాయా విష్ణు రూపము ధరించిన లోక వంచకుడైన పౌండ్రక వాసుదేవుడు మున్నగు వారిని సంహరింప పూనుకొన్నవాడు కృష్ణుడు. ఈ పూనిక కల్గియున్న కృష్ణుడు పౌండ్రక వాసుదేవుని అతని పక్షము వారిని సంహరించి వాని వంచనకు స్వస్తి పలికినాడు.

కరూష దేశాధిపతియగు పౌండ్రకుడు నేనే వాసుదేవుడనని, శంఖ చక్రములను, గద, శారఙ్గ ధనుస్సు మొదలగు వానిని ధరించి శ్రీవత్సలాంఛనుడై ఉండెను. పౌండ్రక వాసుదేవుని మూర్ఖులైన కొందరు రాజులు పౌండ్రకా నీవే భగవానుడైన వాసుదేవుడవు. జగత్తును రక్షించుటకై అవతరించినావు అని పొగడ్తలలో ముంచెత్తిరి. అంత పౌండ్రకుడు దూత ద్వారా కృష్ణుని సందేశము పంపినాడు. అది ఏమనగా ''కృష్ణా! ఈ లోకమున నేనొక్కడనే వాసుదేవుడను. కనుక నీకు గల వాసుదేవుడను పేరును త్యజింపుము. యాదవా! మూర్ఖత్వముతో నా చిహ్నములు (శంఖ చక్రాదులను) ధరించితివి. వెంటనే వాటిని పరిత్యజించి నన్ను శరణు వేడుము. లేనిచో నాతో యుద్ధమునకు రమ్ము'' అని. ఆ దూత మాటలను విని కృష్ణుడు దూతా నా మాటగా మీ ప్రభువుతో ఇట్లు చెప్పుము. ''మూఢుడవైన పౌండ్రకా! నీవు చెప్పినంత మాత్రమున నా శంఖ చక్రాదులను విడిచి పెట్టను. వాటిని నీమీదే విడిచెదను. నిన్ను ప్రోత్సహించిన వారిపై గూడ ప్రయోగించెదను. అప్పుడు నీవు మరణించగా నీ శరీరము కుక్కల నక్కల పాలగును'' అన్నాడు. వెంటనే దూత తమ నగరమునకు వెళ్ళి పౌండ్రకునితో కృష్ణుని తిరస్కారపు మాటలను చెప్పినాడు.

పిదప కృష్ణుడు రథమెక్కి పౌండ్రకుడు తన మిత్రుడగు కాశీరాజు వద్ద ఉండుటచే కాశీనగరమునకు వెళ్ళి యుద్ధ ప్రయత్నమును వానికి తెలిపినాడు. పౌండ్రకుడు కాశీరాజుతో కలిసి యుద్ధమునకు సిద్ధమైనాడు. అతడు గరుడ ధ్వజము కలిగి రంగస్థలమున నిలిచిన విష్ణువు వేషధారియైన నటుని వలె కన్పించినాడు. అంత కృష్ణుడు పెద్దగా నవ్వి యుద్ధ మారంభించెను. కృష్ణ పౌండ్రకుల మధ్య కొంతసేపు యుద్ధము జరిగింది. ఆ యుద్ధములో కృష్ణుడు తన చక్రమును ప్రయోగించి పౌండ్రకుని శిరమును ఖండించి కాశీరాజును సంహరించినాడు. కృష్ణుడు

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**



**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

విజేతయై రథారూఢుడై ద్వారకకు చేరినాడు. పౌండ్రకుడు మాత్సర్యముతో కృష్ణుని నామమును నిత్యము ధ్యానించుట వలన అతని కర్మబంధములు తొలగిపోయినవి. కృష్ణుని వలె వేష భూషణములు ధరించుట వలన అతనికి సారూప్య మోక్షము లభించింది. కృష్ణుడు పౌండ్రకాది వధోద్యతుడే కాక వారిని వధించినాడు. అట్టి కృష్ణుని అవతారమైన వేంకటేశునకు నమస్కారము.

పోతన మహాకవి పౌండ్రక వాసుదేవుని వేషమును సహజ రమణీయంగా భాగవతము దశమ స్కంధము ఉత్తర భాగములో 512 పద్యములో వర్ణించినాడు. పౌండ్రకుని విష్ణు వేషమును దర్శించండి.

**సీ ॥ చక్ర గదా శంఖ శారఙ్గాది సాధను గృత్రిమ కౌస్తుభ శ్రీనివాసు**
**మకర కుండల హార మంజీర కంకణ మణి ముద్రికా వనమాలికాంకు**
**దరళ విచిత్ర పతంగ పుంగవ కేతు జెలునొందు పీత కౌశేయవాసు**
**జవనాశ్వ కలిత కాంచన రథా రూఢుని రణ కుతూహలుని సన్మణి కిరీటు**
**తే ॥ నాత్మ సమవేషు రంగవిహార కలిత – నటసమానుని బౌండ్ర భూనాథు చూచి**
**హర్ష మిగు రొత్త నవ్వె బద్మాయతాక్షు – డంత వాడును నుద్వృత్తు డగుచు నడరి ॥**
**– భాగ. 10, ఉత్తర, 512**

–శంఖ చక్ర గదా శారఙ్గాది సాధనములు గలవాడు, కృత్రిమమైన కౌస్తుభమణి, లక్ష్మి గలవాడు మకరకుండల హార మంజీర కంకణ మణి ముద్రికా వనమాల ధరించినవాడు, విచిత్రమైన గరుడధ్వజము గలవాడు, ప్రకాశించుచున్న పీతాంబరమును ధరించినవాడు, వేగము కలిగిన గుర్రములు కట్టిన రథమును ఎక్కినవాడు, యుద్ధమునందు ఉత్సాహము కలవాడు, మణి కిరీటము ధరించినవాడు, తనతో సమానమైన వేషము గల వానిని, రంగస్థలమున ఉన్న విష్ణు వేషమును ధరించిన నటుని వలె నున్న వానిని పౌండ్ర రాజును చూచి మిక్కిలి సంతోషముతో కృష్ణుడు నవ్వినాడు. అంత పౌండ్రుడు గర్వాతిశయంతో యుద్ధము ప్రారంభించినాడు.

ఉత్తర హరివంశములో పౌండ్రక వాసుదేవుని వృత్తాంతము. నవీన గుణసనాథుడు నాచన సోమనాథుడు 14వ శతాబ్దం ఉత్తర హరివంశమను ప్రబంధమున అత్యంత రమణీయంగా రచించినాడు. అందు

**ఉ ॥ ఇక్కడ బౌండ్ర భూపతి, విహీన వివేహేత జేవ యెక్కగా**
**నెక్కడి వాసుదేవుడిల నేనొకరుండన వాసుదేవుడన్**
**దక్కిన వాడు నందక సుదర్శన శారఙ్గ గదాది హేతులున్**
**స్రుక్కక పట్టినన్, దెసల చుట్టునె నిర్మల కీర్తి పట్టికల్ ॥ ఉ.హరి. 3–4**
**మ ॥ కలరే రాజులలో మదీయ కరచక్ర క్రీడ సైరింప, బె**
**ద్దల భీష్మాదుల ధిక్కరింపదగ, దెత్తం జాలరీకైదు వో**
**రలునాడకు గోపవీరు నోరు పేరుంజీరుమీ, విక్రమా**
**ఢ్యులలో నేనును వాసుదేవుడనతండున్ వాసుదేవుండటే ॥ ఉ.హరి. 3–12**

అని పౌండ్రక వాసుదేవుడు విష్ణుని వేషము ధరించి ప్రగల్భములు పలుకుచుండేవాడు. కృష్ణుడు పౌండ్రునితో యుద్ధము చేయుచున్నప్పుడు పౌండ్రుడు

**ఉ ॥ నీవును వాసుదేవుడవు, నిక్కము, యేనును వాసుదేవుడం**
**బో వినువారికైన నిదినోలునే, యింతటి నుండి ధాత్రిలో**
**గోవుల గాచి, గాడిదల, గొడ్డుల బోతులం జంపిరేని నే**
**జీవుల వాసుదేవుడన జెల్లునె, లావున చేరు సెల్లునే ॥ ఉ.హరి. 3–94**

కృష్ణుని దూషించినాడు. అంత కోపముతో కృష్ణుడు చక్రమును ప్రయోగించి పౌండ్రక వాసుదేవుని వధించినాడు.

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

## 40వ శ్లోకం

శ్రీహరి పాదపద్మములపై మరులు గొన్న తుమ్మెద వంటి కులశేఖరులు తన గురువు లిరువురని చెప్పి వారికి నమస్కరించి, ముకుందుని స్మరించి, ముకుందమాలకి ముగింపు పలుకబోతున్నారు.

**యస్య ప్రియౌ శ్రుతిధరౌ కవిలోకవీరౌ**
**మిత్రే ద్విజన్మవర పద్మశరావ భూతామ్ ।**
**తేనాంబుజాక్ష చరణాంబుజ షట్పదేన**
**రాజ్ఞా కృతా కృతిరియం కులశేఖరేణ ॥**

వేదార్థములు లెస్సగా తెలిసినవారును, కవివరేణ్యులును, తనకు అత్యంత ఇష్టులైన వారు అగు ద్విజన్మ వరుడు, పద్మశరుడు అనే ఇరువురు ఏ కులశేఖరులకు మిత్రులైయుండిరో ఆ మహా ప్రభువగు కులశేఖరుల చేత ఈ ముకుందమాలయను కృతి రచింపబడినది.

వేదవిద్యా ప్రతిష్ఠాపకులు, కవిలోక వీరులు అగు "ద్విజన్మ పద్మశరులు" ఎవరికి మిత్రులై ఉండిరో, ఆ పుండరీకాక్ష పదాంబుజ భ్రుంగమగు కులశేఖర మహారాజు ఈ కృతిని నిర్మించెను.

కులశేఖరునకు ద్విజన్మవర, పద్మశరులను ఇద్దరు మిత్రులుండిరి. ఆ ద్విజన్మ వరుడు వ్యాసుడో, వాల్మీకియో అయిఉండవలె ననియు, పద్మశరుడు శఠగోపులనెడి ఆళ్వారు (నమ్మాళ్వారు) అనియు పెద్దలు చెప్పుచుందురు. అందు కవిలోక వీరుడనుటచే ఆదికవియగు వాల్మీకియే ద్విజన్మవరుడని, ఆయన శ్రీరామాయణమున వేదోప బృంహణము (బృహత్తరము) చేయుటచే శృతిధరుడు అనియు చెప్ప వచ్చును. తమిళమున, సంస్కృతమున ప్రసిద్ధులగు కవులలో శఠగోప, వాల్మీకులు ఆద్యులు కనుక వారినే ఇక్కడ పేర్కొనెనని చెప్పవచ్చును. శఠగోపునకు "మారన్" అని తమిళ నామము. మారుడనగా మన్మథుడు కనుక దానికి సంస్కృత పర్యాయమగు పద్మశరుడు అని ఇందులో ప్రయోగింపబడినది.


ఇలా కులశేఖరాళ్వార్లు దివ్యమైనటువంటి పరమాత్మ పరత్వ సులభత్వములను అత్యంత మనోహరంగా ఆ దివ్య తత్త్వమును విష్ణు తత్త్వమును నిరూపణ చేస్తూ సంసారమనే క్లిష్ట సాగరమును దాటుటకు సులువైన మార్గమును చూపించి పరమాత్మ యొక్క దివ్య చరణములే శరణం అని మార్గనిర్దేశకం చేశారు.

ధారావాహికం



ఈ మార్గాన్ని అనుసరించి తరించిన మహా భక్త శిఖామణి "అర్జున మిశ్రస్వామి".

అర్జునమిశ్ర పండితుడు పురుషోత్తమ ధామంలో బిచ్చమెత్తి జీవించే పరమ సాధు, ఉదార, శాంత, భక్తి స్వభావుడు. సదా భగవద్గీత పారాయణ చేసేవాడు. గీతార్థసారం గ్రహించి టీకా రాశాడు. ఇప్పటికీ ఉత్తరదేశంలో దీనికి విశేష ఆదరణ ఉంది. గీత 9వ అధ్యాయం 22వ శ్లోకానికి టీకా రాస్తూ "యోగక్షేమం వహామ్యహం" అనే దానిపై సందేహం వచ్చి "ప్రత్యక్ష భావం పూని ఉంటాను" అని చెప్పిన గీతాచార్యుని వాక్యం సత్యం కాదని భావించి కొట్టేసి "పరోక్ష భావంలో ఉంటాను అనే అర్థం వచ్చే శబ్దాన్ని" ఇరికించాడు. భగవద్గీత భగవానుని శరీరం కనుక, ఈ కొట్టివేత పరమాత్మకు దెబ్బగా తగిలి, మిశ్రకు జ్ఞానోదయం కలిగించటానికి మొదట్లో గాలివాన కల్పించాడు. భిక్షాటనం చేస్తేనే కుటుంబపోషణ జరిగేది కనుక, గాలివానకు బయటికి వెళ్ళలేక దంపతులు పస్తు ఉన్నారు. మర్నాడు భిక్ష కోసం బయల్దేరితే విపరీతమైన వర్షంలో దూరం పోలేక కూలిపోబోతున్న



ఇంతలో మిశ్ర వచ్చి విషయం తెలుసుకొని, వాళ్ళ రూపురేఖలు ఎలా ఉన్నాయని అడగ్గా, పెద్దవాడు బంగారం రంగులో చిన్నవాడు నలుపు రంగులో ఉన్నారని, ముఖాలలో దివ్య తేజస్సు కనిపించిందని చెవులకు బంగారు కుండలాలున్నాయని చెప్పింది. "అయ్యో! భగవానులను కొట్టింది నేనే" అని మూర్ఛపోయాడు దురంత వేదనతో. ఆమె కూడా మూర్ఛితురాలైంది. కాసేపటికి ఇద్దరూ తేరుకొన్నాక అతడు "వచ్చిన వారు శ్రీకృష్ణ బలరాములే. వారి దర్శన భాగ్యం పొందిన అదృష్టవంతురాలవు" అని చెప్పాడు. కలంతో గీతలో తాను వహామ్యహం "మాటకొట్టేసి వేరేమాట రాసినందుకు జగదీశుడికి తీవ్రమైన దెబ్బ కొట్టిందని, పశ్చాత్తాప పడి, తను చేర్చిన మాట తీసేసి మళ్ళీ యధా ప్రకారమే ఉంచాడు. ఇంకా ఎక్కువ శ్రద్ధా సక్తులతో హరి సేవనం చేశాడు. ఇద్దరి భక్తికీ మెచ్చి కృష్ణుడు సాక్షాత్కరించి ధన్యులను చేశాడు.

గుడిసెలో తలదాచుకొన్నాడు.

ఇంతలో ఇద్దరు బ్రాహ్మణ బాలురు శరీరమంతా రక్తం కారుతూ మిశ్ర ఇంటికి వెళ్లి మిశ్ర ఆహార పదార్థాలు పంపాడని చెప్పి ఒక రెండు మూటలు భార్యకిచ్చారు. ఆమె ఆశ్చర్యపోయి వాళ్ళ శరీరం రక్తమయం అవటానికి కారణం అడిగి, అలాంటి కోమల శరీరులను తన భర్త ఎలా అంత పెద్ద బరువు గల మూటలు ఇచ్చి పంపాడు అని బాధపడి వాళ్ళ వృత్తాంతం అడిగింది. వాళ్ళు తమ తల్లిదండ్రులు బీదవారని తామిద్దరం మూటలు మోసి సంపాదించి కుటుంబ పోషణకు సాయపడుతున్నామని, ఆ మూటలిచ్చి రమ్మంటే వచ్చామని ఆయనకు ఆకలి బాధతో మతి స్తిమితం తప్పి పిచ్చ కోపంతో తమను ఒక ఇనుపకడ్డీతో కొట్టడని ఆయనింటికి రాగానే అడిగితే నిజం తెలుస్తుందని చెప్పి మూటలు దించి వెళ్ళిపోయారు.

భర్తకే ప్రమాదం జరిగిందో అని కంగారుతో తన ఇద్దరు పిల్లల్ని వొళ్ళో వేసుకొని ఏడుస్తుంటే పిల్లలిద్దరూ ఎగిరి పోయారు.

దారిద్ర్యం కఠోర దీక్షకు కారణం కావాలి. సేవాధర్మం, పశ్చాత్తాపం, విశ్వాసం, అనుకూల దాంపత్యం జీవన్ముక్తికి హేతువులు.

కులశేఖరులు ఈ విధంగా ముకుందమాలను రచించి భక్తి లేని వారికీ భక్తి కలిగించిరి.

**॥ ఇతి ముకుందమాల స్తోత్రం సంపూర్ణం ॥**

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

## ధన్యవాదములు

**ఆ ముకుందుని అనుగ్రహంతో ఈ ముకుందమాల నేటితో పూర్తి అయినది. ఈ ముకుందమాలను తమ పత్రిక "శ్రీ వెంకటేశం" లో ప్రచురించిన పత్రికా సంపాదకులు " శ్రీ పుల్లగూర్ల సాయిరెడ్డి" గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. అలాగే సంపాదక వర్గానికి కూడా పేరు పేరున ధన్యవాదములు తెలియచేసుకుంటున్నాను. ఇంతకాలం ఈ ముకుందమాలను చదివి అభినందనలతో ఆదరించిన పాఠకులకు కృతజ్ఞతాభివందనములు తెలియచేసుకుంటూ, మరొక ధారావాహికతో మరల మీ ముందుకు రాగలనని సవినయంగా మనవి చేసుకుంటూ... నమస్కారములతో .....**

***– డా॥ మారేపల్లి భువనేశ్వరి***



# శివ విజయం

- గోనుగుంట మురళీకృష్ణ

(మహాశివరాత్రి సందర్భంగా)

తారకాసురుడు అనే రాక్షసుడికి ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు తారకాక్షుడు, రెండవవాడు విద్యున్మాలి, మూడవ వాడు కమలాక్షుడు. ముగ్గురూ సమానమైన బలం కలవారు. మనోనిగ్రహం కలిగినవారు, సత్యవాక్కు మీద నిలబడినవారు, విశేషించి శివభక్తి పరాయణులు. ఒకరోజు ముగ్గురూ సమావేశమైనారు.

“దేవతలు కుమారస్వామిని మంచి చేసుకుని మాయోపాయంతో మన తండ్రిని వధించేటట్లు చేశారు. పగతో నా హృదయం రగిలిపోతున్నది. ఎలాగైనా వారి మీద పగసాధించాలి” అన్నాడు తారకాక్షుడు.

“ఎలా? వారికి మాయావి విష్ణువు అండ ఉన్నది. అతడి అండతోనే ఎందరో రాక్షస వీరులను మట్టుబెట్టించారు” అన్నాడు విద్యున్మాలి.

“రాక్షసులు, విష్ణువును జయించాలంటే వారికి మించిన బలం మనం సంపాదించాలి. అందుకు ఒక్కటే ఉపాయం. బ్రహ్మను గురించి తపస్సు చేసి, మరణం లేకుండా వరాలు పొందుదాం” అన్నాడు మూడవవాడు.

“చక్కని ఉపాయం. మనం రేపే బయలుదేరి తపోవనాలకు వెళదాం”. అన్నాడు తారకాక్షుడు. ముగ్గురూ సరే అనుకున్నారు.

అనుకున్న ప్రకారం మృత్యువును జయించాలనే సంకల్పంతో మేరుపర్వతం వద్దకు పోయి అక్కడి వనంలో తపశ్చర్యలో మునిగిపోయారు. వానాకాలంలో వర్షంలో తడుస్తూ, చలికాలంలో కంఠం వరకూ నీటిలో మునిగి, వేసవికాలంలో పంచాగ్ని మధ్యలో నిలబడి (అంటే నాలుగు దిక్కులా అగ్ని రగిల్చి వాటి మధ్యలో ఒంటికాలి మీద నిలబడి, తల పైకెత్తి సూర్యుడి వంక చూస్తూ) ఉగ్రమైన తపస్సుని ఆచరించారు.

రోజుకు ఒక్క పండు మాత్రమే తిని కొంతకాలం, కొద్దిగా జలపానం చేసి మరికొంతకాలం, వాయువు భక్షించి ఇంకొంతకాలం, అదికూడా ఆపివేసి నిరాహారంగా ఉంటూ ఘోరమైన తపస్సు చేశారు ముగ్గురు సోదరులూనూ. వారి తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమైయ్యాడు. ఆయనను చూసి పులకాంకితులై అనేక విధాల స్తోత్రం చేశారు సోదరులు. “కుమారులారా! మీ తపస్సుకు మెచ్చాను. ఏం వరం కావాలో కోరుకోండి” అన్నాడు బ్రహ్మదేవుడు.

“తండ్రీ! మా ముగ్గురికీ మరణం లేకుండా వరం

ప్రసాదించండి" అన్నాడు తారకాక్షుడు. "అది అసాధ్యం. ఈ సమస్త ప్రాణికోటిలో పుట్టిన ఏ జీవియైనా మరణించక తప్పదు. ఇంకేదైనా వరం కోరుకోండి. ప్రసాదిస్తాను" అన్నాడు బ్రహ్మ.

"అయితే మూడు లోకాలలోనూ సంచరించగలిగే, సకల సం పదలతో కూడిన మూడు నగరాలను మాకు ఇవ్వండి. సర్వదేవతా స్వరూపుడైన పరమేశ్వరుడు ఎవరి ఊహకు అందని రథాన్ని అధిరోహించి, ఒకే ఒక్క బాణంతో ఛేదించినప్పుడు తప్ప అవి నశించకుండా ఉండేటట్లు, ఆ నగరాలు ఆకాశంలో నల్లని మేఘాల మధ్య ఒకదానిపై ఒకటి ఉండి కంటికి కనిపించకుండా ఉండేట్లు, మేము ముగ్గురమూ మనస్పర్ధలు లేక పరస్పరం అన్యోన్యంగా ఉండేటట్లు వరం ప్రసాదించండి".

"కుమారులారా! ఇటువంటి వరం మునుపెన్నడూ ఎవరూ కోరియుండలేదు. అయినా మీ తపస్సులకు సంతసించి అనుగ్రహిస్తున్నాను" అన్నాడు బ్రహ్మ. "ధన్యులం" ముగ్గురూ తలలు వంచి నమస్కరించారు. తారకాక్షుడు బంగారు నగరాన్ని, కమలాక్షుడు వెండి నగరాన్ని, విద్యున్మాలి ఇనుప నగరాన్ని కోరారు. బ్రహ్మ మయుడిని రప్పించి రాక్షసులు కోరినట్లుగా మూడు నగరాలను నిర్మించి ఇమ్మని ఆజ్ఞాపించి అదృశ్యుడైపోయాడు.

మయుడు బ్రహ్మ ఆజ్ఞ ప్రకారం తన శిల్పశాస్త్ర పరిజ్ఞానంతో మూడు దివ్య నగరాలను నిర్మించి ఇచ్చాడు. అందులో శివాలయాలు, అగ్నిహోత్ర శాలలు, వేదాధ్యయన పాఠశాలలు, గోశాలలు మొదలైనవి అనేకం ఉన్నాయి. వేదశాస్త్ర పండితులైన బ్రాహ్మణులు, వేదశాస్త్రాలలో చెప్పిన ధర్మాలను ఆచరించే ప్రజలతోనూ ఆ నగరాలు నిండి ఉన్నాయి. అక్కడి ప్రజలందరూ నిత్య శివార్చనా తత్పరులు. ప్రతి ఇంట్లోనూ ఒక శివమందిరం ఉన్నది.

"మనము, మన ప్రజలు అందరూ శివపూజా దురంధరులు. పరమేశ్వరుడు తన భక్తులను తానే సంహరిస్తాడా! ఇక మనకు మృత్యుభయం లేదు" సోదరులు ముగ్గురూ అనుకున్నారు ఆనందంగా.

బ్రహ్మ ఇచ్చిన వరబలంతో త్రిపురాసురులు మున్యాశ్రమాలను ధ్వంసం చేశారు. మునులను హింసించారు. ముని పత్నులను చెరపట్టారు. దేవలోకం పైకి దండెత్తి దేవతలను ఓడించి, ఇంద్రసింహాసనం కైవసం చేసుకున్నారు. దిక్పాలకులు చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదరు అయ్యారు. త్రిపురాసురుల తేజస్సు ముందు దేవతల బలం వెలవెల పోయింది. వారు పెట్టే బాధలను సహించలేక అందరూ బ్రహ్మ దగ్గరకు వెళ్లి కాపాడమని మొర పెట్టుకున్నారు.

"త్రిపురాసురులకు వరం ఇచ్చిన నేనే వారిని వధించలేను కదా! మీరందరూ కైలాసానికి వెళ్లి పరమేశ్వరుని ప్రార్థించండి" అని చెప్పాడు బ్రహ్మ. ఇంద్రుడు, వరుణుడు, యముడు, కుబేరుడు మొదలైన వారందరూ కైలాసానికి వెళ్లి "వృషభవాహనా! సర్వ జగత్స్వరూపుడవు, పాపాలను పోగొట్టి నరకం నుంచి రక్షించేవాడవు, ధర్మస్వరూపుడవు. బీజమంత్రాలలో ఓంకారం నీవే! ఆత్మల్లో పరమాత్మవు నీవే! దానములలో అభయదానము నీవే! నిత్యకర్మలలో సంధ్యోపాసన నీవే! సర్వమూ నీవే!" అని పరిపరి విధాల స్తోత్రం చేసి, "దేవా! తారకాసుర సంహారానికి మేము పడ్డ పాట్లు నీకు తెలియనివి కావు. వాడు పెట్టిన బాధల నుంచి మేము సొంతం కోలుకోక ముందే పులి మీద పుట్రలా వాడి కొడుకులు ముగ్గురూ వచ్చి మమ్మల్ని హింసిస్తున్నారు. మాకు దక్కవలసిన యజ్ఞ భాగాలను బలాత్కారంగా లాగుకొంటున్నారు. నీవు దప్ప మాకు దిక్కు లేరు. మామీద దయయుంచి త్రిపురాసురుల బారి నుంచీ మమ్మల్ని రక్షించు" అని ప్రార్థించారు.

"దేవతలారా! త్రిపురాసురులు, వారి నగరాలలోని ప్రజలు వేదధర్మాలను తప్పకుండా పాటిస్తున్నారు. వారందరూ విభూది ధారణ, నిత్య లింగపూజ చేసే శివభక్తులు, పంచాక్షరీ మంత్ర పరాయణులు. మీ బాధలు నాకు తెలుసు. మీ మీద ఎంత సానుభూతి ఉన్నా భక్తపాలన వ్రతంగా గల నేను నా భక్తులకు ద్రోహం చేయలేను కదా!" అన్నాడు శివుడు.

"మరి మా కష్టాలకు అంతం లేదా మహాదేవా!" అన్నాడు ఇంద్రుడు.

"మీరందరూ వెళ్లి శ్రీహరిని ఆశ్రయించండి. ఒకప్పుడు నన్ను భస్మాసురుడి బారి నుంచీ ఉపాయంతో రక్షించినవాడు హరియే! మీకు కూడా ఏదో ఒక ఉపాయం చెప్పకపోడు".

"సరే!" అని నిట్టూర్చి వెనుదిరిగారు దేవతలు. వైకుంఠం వెళ్లి జరిగినదంతా విష్ణువుతో చెప్పి కాపాడమని మొరపెట్టుకున్నారు. "అమరులారా! శంకరుడు చెప్పినది సత్యమే! సనాతన ధర్మం ఉన్నచోట దుఃఖం ఉండదు. ధర్మాచరణ ఉన్నవారికి దైవం కూడా కీడు చేయలేడు. అయితే ఒక ఉపాయం ఉన్నది. వారి చేత శివపూజ మాన్పించి, ధర్మ భ్రష్టులను చేయగలిగితే, అప్పుడు వారిని వధించటం సులభం అవుతుంది." అన్నాడు విష్ణువు.

"అదేదో మీరే చేయండి. పాల ముంచినా, నీట ముంచినా మీదే భారం" అన్నాడు ఇంద్రుడు. "సరే!" అని విష్ణువు ఒక మాయా విప్ర వేషధారిని సృష్టించాడు. అతడు విష్ణువుకు నమస్కరించి "నా నామాన్ని, నా కర్తవ్యాన్ని ఉపదేశించండి" అన్నాడు. "నీ పేరు విదలుడు. నువ్వు వేదవిరుద్ధమైన, వర్ణాశ్రమ విభాగం లేనిది, దైవంతో పని లేకుండా పురుష ప్రయత్నానికి ప్రాధాన్యత ఇచ్చేవిధంగా బోధనలు చేస్తూ, త్రిపురాసురుల రాజ్యంలోని ప్రజలను సనాతన ధర్మానికి దూరం చెయ్యి. లోకులు నీ మాయలను నమ్మేటట్లు, నీకు వశం అయ్యేటట్లు, అటువంటి

శక్తిని నీకు ఇస్తున్నాను. వెళ్ళు” అన్నాడు.

“చిత్తం” విదలుడు నమస్కరించి అదృశ్యుడయ్యాడు. దేవతల వంక చూసి, “శంకరుడి చేత త్రిపురాసురులు శీఘ్రమే వధించబడతారు. మీ బాధలు అనతికాలంలోనే అంతరిస్తాయి. ఇక మీ మీ నెలవులకు వెళ్ళండి” అన్నాడు విష్ణువు. దేవతలు అందరూ వెనుదిరిగారు.

విదలుడు నలుగురు శిష్యులను కూడగట్టుకుని త్రిపురాలను చేరాడు. అక్కడ నగరం చివర గల ఒక ఉద్యానవనంలో విడిది చేసి తన మత ప్రచారాన్ని ప్రారంభించాడు. “ఈ సృష్టికి కర్త లేదు. కర్తయే లేనప్పుడు క్రియ ఎలా ఉంటుంది. ఈశ్వరుడు లేడు, త్రిమూర్తులు మొదలైన వారందరూ మీలానే దేహాన్ని ధరించిన ప్రాణుల పేర్లు మాత్రమే! అంత కంటే విశిష్టత లేదు. వారు దైవాలు కారు. సర్వప్రాణులకు లాగానే త్రిమూర్తులకు కూడా ఆహార, నిద్రా మైథునాలు సమానంగానే ఉంటాయి. ఇంతకు మించి ఎవరిలోనూ అధికంగా ఏమీ ఉండదు. హంస తూలికా తల్పం మీద శయనించినా, నేలమీద శయనించినా పొందే నిద్రాసుఖం ఒక్కటే కదా! అలాగే ఆలోచిస్తే దేహధారులందరూ ఒకటే! భగవంతుడు లేడు, భక్తుడు లేడు. ఎక్కువ తక్కువలు లేవు.

స్వర్గనరకాలు అనేవి మనం కల్పించుకున్నవే! సుఖంగా జీవించటమే స్వర్గం, దుఃఖించటమే నరకం. జీవితకాలం చాలాస్వల్పం. అందునా యవ్వనం మరింత స్వల్పకాలం. దైవభక్తి పేరుతో ఉపవాసాలు ఉంటూ శరీరం కృశింప చేసుకోవటం నిష్ప్రయోజనమని గ్రహించండి. స్త్రీ సుఖం, వారకాంతల నృత్యోత్సవాలతో ఆనందించండి. హాయిగా సమస్త భోగాలు అనుభవించండి” అంటూ బోధించసాగాడు విదలుడు.

మొదట విదలుడి మాటలు ఎవరూ పట్టించుకోలేదు. ఒకరిద్దరు చూసి ఆకర్షింపబడి “మన నగరానికి ఎవరో ఒక మహానుభావుడు వచ్చాడు. అనేక ధర్మాలు చెబుతున్నాడు. అవన్నీ వాస్తవాలే! నేను అయన దగ్గర దీక్ష తీసుకున్నాను. మీరు కూడా తీసుకోండి.” అంటూ ప్రచారం చేయసాగారు. విష్ణువు మాయా ప్రభావం వలన క్రమక్రమంగా నగరం లోని వారందరూ విదలుడి నాస్తిక వాదానికి ఆకర్షింపబడి, పూజాపునస్కారాలు మానివేశారు. స్వసుఖమే ప్రధానం అని నమ్మి ఆచరించసాగారు. చివరకు పురుషులు బ్రహ్మచర్యాన్ని, స్త్రీలు పాతివ్రత్యాన్ని ఖండించి అందరూ వైదిక ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ ఉండేసరికి, ఆ నగర లక్ష్మి వారిని విడిచి వెళ్లిపోయింది. వెనువెంటనే జ్యేష్ఠాదేవి అక్కడికి ప్రవేశించింది. త్రిపురాసురుల పూర్వపుణ్యం నశించిపోయింది. వారి పరాక్రమం క్షీణించింది.

మరోపక్క దేవతలందరూ శివ పంచాక్షరీ మంత్రం ధ్యానిస్తూ తమ కడగండ్లను బాపవలసినదిగా ప్రార్థిస్తూ ఉన్నారు. దేవతల మనోగతాన్ని అనుసరించి శివుడు ప్రత్యక్షమై “అమరులారా! మీరు జపించే మంత్రం నాకు ఎంతో ప్రీతి కలిగించింది. గతంలో నేనిచ్చిన మాట నిలబెట్టుకుంటాను. ఈ కార్యంలో అందరూ సహకరించండి. నాకు తగిన తేరును సమకూర్చండి. యుద్ధ సామగ్రిని సిద్ధం చేయండి” అన్నాడు.

అప్పుడు దేవతాశిల్పి అయిన విశ్వకర్మ సర్వవేద స్వరూపము, సకల దేవాత్మకము, అతి సుందరమూ అయిన ఒక రథం నిర్మించాడు. ఆ రథానికి కుడి చక్రం సూర్యుడు, ఎడమ చక్రం చంద్రుడు. ద్వాదశాదిత్యులు కుడి చక్రాన్ని, చంద్రుని పదహారు కళలు ఎడమ చక్రాన్ని అధిష్ఠించి ఉన్నారు. ఉత్తరాయణ, దక్షిణాయనాలు ఆ చక్రాల ఇరుసులు. పంచభూతాలు దాని బలం. శ్రద్ధ దాని బలం. శ్రేష్ఠమైన మంత్రాలు ఘంటలు. ఆదిశేషువు దాన్ని కట్టుత్రాడు. పుష్కరాది తీర్థాలు బంగారు పతాకాలు. సప్త ద్వీపాలలోని పర్వతాలన్నీ ఆ రథానికి నలువైపులా ఉండే తాళాలు.

సృష్టికర్త బ్రహ్మ సారథి. ప్రణవం చేతి కొరడా. హిమవంతుడు శివుని చేతి విల్లు. ఆదిశేషువు అల్లెత్రాడు. సరస్వతి ధనుస్సుకు గంట. నారాయణుడు బాణం. నాలుగు వేదాలే రథానికి నాలుగు గుర్రాలు. మహర్షులు దానికి సంరక్షకులు. ఇలా సృష్టిలో ఉన్న సర్వ శ్రేష్ఠమైన వస్తువులు ఆ రథంలో ఉన్నాయి. సకల దేవతా సమూహం జయజయ ధ్వానాలు చేస్తూండగా సర్వదేవతా స్వరూపుడైన మహాదేవుడు రథం అధిరోహించాడు. ఆయన అధిరోహించగానే భూమండలం క్షోభించింది. ఆ భారాన్ని సహించలేక అనంతుడు అవనతుడయ్యాడు. వెంటనే శేషుడు రథం కిందకు చేరి, దానిని పైకెత్తి నిలబెట్టాడు.

పరమేశ్వరుడు త్రిపురాసురుల మీదికి యుద్ధానికి వెళుతున్నట్లుగా శంఖాన్ని పూరించాడు. దేవగణాలు అన్నీ మహాదేవుని వెంట కదిలాయి. విద్యాధరులు, అప్సరసలు, కిన్నెరులు, గంధర్వులు, సిద్ధులు అందరూ ఆయనను అనుసరించారు. అందరి చేతుల్లో వివిధ ఆయుధాలు ఉన్నాయి. వారందరూ నడచి వస్తూంటే భూమి కంపించి పోతోంది. (పరమేశ్వరుడు ఒక్కడు చాలు, ఆ రక్కసులను వధించటానికి! మరి ఈ అట్టహాసం అంతా ఎందుకు అంటే – దేవతలందరిలో సర్వోత్కృష్టుడు పరమేశ్వరుడొక్కడే అనే విషయం దుష్టులకు తెలియజేయటం కోసం!).

మహాదేవుడు త్రిపురాలను సమీపించగానే మూడు నగరాలు ఒక్క రేఖ మీదకు వచ్చాయి. “మహాదేవా! త్రిపురాలు ఒకే రేఖ మీదకు వచ్చాయి. ఇదే సుమూహూర్తం. అవి విడిపోకముందే శర సంధానం చేసి దహించు” అని చెప్పాడు విష్ణువు. వెంటనే శంకరుడు పినాకము అనే ధనుస్సు చేతబట్టి అల్లెత్రాటిని లాగి, లోక భీకరంగా ధనుష్టంకారం చేశాడు. విష్ణు స్వరూపమైన శరాన్ని సంధించి, మనసులో పాశుపతాస్త్రమును ధ్యానించి, “ఈ అస్త్రంతో త్రిపురాలు భస్మమగు గాక!” అనుకుంటూ బాణ

ప్రయోగం చేసాడు.

శతకోటి సూర్య ప్రభలతో వెలుగులు విరజిమ్ముతూ జ్వాలలు సాచి ఆ బాణం మూడు నగరాలను దగ్ధం చేసింది. అందులోని రాక్షసులు అందరూ హాహాకారాలు చేస్తూ మంటల్లో కాలిపోయారు. త్రిపురాసురులైన తారకాక్షుడు, విద్యున్మాలి, కమలాక్షుడు "హే! పార్వతీ పతీ! మేము నిన్ను తెలుసుకున్నాము. మాకు జ్ఞానోదయమైనది. బంధు మిత్ర సపరివార సమేతంగా మమ్మల్ని దహించటమే నీకు ఆనందం అయితే అలాగే కానివ్వు. మా భౌతిక దేహాలతో పాటు మా కర్మ బీజాలను కూడా దహించు. జన్మజన్మలలోనూ మా బుద్ధి నీ యందే నిమగ్నమై ఉండేటట్లు చూడు" అంటూ చేతులు జోడించి ప్రార్థించారు. వారి దేహాలు మంటలలో మాడి మసైపోయాయి. గతంలో చేసిన శివపూజా పుణ్యం ఫలితంగా త్రిపురాసురులు గణాధిపత్య స్థానాన్ని పొందారు.

రుద్రుడి భయంకర స్వరూపం చూసి దేవతలందరూ భయవిహ్వలురు అయ్యారు."దేవతలకు హితమును చేకూర్చువాడా! పరమేశ్వరా! ప్రసన్నుడవుకా! భక్తప్రియా, శంకరా! నిన్ను ధ్యానించేవారిని నువ్వు రక్షిస్తావు. నిర్వికారుడు, శాశ్వతుడు, త్రిగుణాత్మకుడు అయిన నీకు నమస్కరిస్తున్నాము. శాంతించు" అంటూ ప్రార్థించారు.

వారి ప్రార్థనలకు సంతుష్టుడై పరమేశ్వరుడు శాంతించాడు. "దేవతలారా! ఇంకా మీ అభీష్టాలు ఏమైనా ఉంటే చెప్పండి. నెరవేరుస్తాను" అన్నాడు.

"దేవా! మమ్మల్ని మీ దాసులుగా స్వీకరించు. మాకెప్పుడు దుఃఖం కలిగినా అది పోగొట్టి రక్షిస్తూ ఉండు" అని వేడుకున్నారు. రుద్రుడు "తథాస్తు" అని దీవించి అంతర్హితుడైపోయాడు.

సత్వ రజస్తమో గుణాలే త్రిగుణాలు. ఆ త్రిగుణాలే ఈ కథలో త్రిపురాలు. త్రిగుణాలే లోకంలో సుఖదుఃఖాలకు కారణాలు అవుతున్నాయి. ఆ త్రిగుణాలను జయించే కథే ఈ త్రిపురాసుర సంహార గాథ.

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. ప్రశ్న – శరణాగతి – ప్రపత్తి వీటిని వివరించండి?**

**– 'మా తల్లి' వసుంధర విజయవాడ**

జవాబు – చావు పుట్టుకలనే చక్రభ్రమణం నుంచి తన్ను తాను విడుదల చేసుకోవడానికి అత్యంత సులభమైనది ఖచ్చితమైన తరణోపాయం శరణాగతి. శరణాగతి కోరే భక్తుడు తన అకించనత్వాన్ని, అల్పత్వాన్ని వివరిస్తూ సంపూర్తిగా దైవంపైనే ఆధారపడి ''నీవే తప్ప నితరం బెరుగ'' అని, నా భారం అంతా నీదేనని విన్నవించుకోవడమే శరణాగతి. అహంకారం పూర్తిగా వదులుకోవడం దీనిలో ప్రధానం.

ప్రపత్తి మార్గాన్ని అనుసరించేవాడు తన బాధ్యతనంతా దైవానికే వదిలేసి తాను నిశ్చింతగా ఉంటాడు. మార్జాల కిశోర న్యాయం అనుసరిస్తూ తను త్రికరణశుద్ధిగా దైవానికే అంకితమై, ఎటువంటి ఆందోళన చెందక ఉంటాడు. శరణాగతికి పరాకాష్ఠే ప్రపత్తి. ప్రపత్తి భావనలో 'తను' ఉండదు. సంపూర్ణ శరణాగతి ప్రపత్తి మూలంలో ఉంటుంది.

**2. ప్రశ్న - భాగవతం గురించి, దాని నామౌచిత్యం గురించి వివరించండి?**

**– మంజులవాణి**

జవాబు – భాగవతం అనగానే పైకి భగవంతుని చరిత్ర అని అనిపించినా ఇది భక్తుల చరిత్ర. భగవద్భక్తుల గాథల సమాహారమే భాగవతం.

వేదవ్యాసులవారు 18 మహాపురాణాలు, 18 ఉప పురాణాలు, వేద విభజన, బ్రహ్మసూత్రాలు మొదలగు వాటి గురించి వ్రాసిన మహానుభావుడు. ఇంత వ్రాసినా ఆయనకు మనశ్శాంతి కలగలేదు. తృప్తీ అనిపించలేదు. చివరికి దేవర్షి నారదుల వారి ఆదేశానుసారంగా భగవద్భక్తుల చరిత్రలు గల భాగవతము వ్రాసిన తరువాతే ఆయనకు మనశ్శాంతి కలిగింది. 'భాగవతం' చదివితే మనం ''బాగ''వతం (బాగు అవుతాము). దీనిని శ్రీమద్భాగవతం అని అనడం సముచితం. శ్రీ చే ప్రారంభించబడడం వలన ఇది శుభకరము. సంస్కృత భాగవతాన్ని పోతనామాత్యుడు గొప్పగా అనువదించాడు. మూలం కన్నా ఆయన అనువాదమే చాలా సందర్భాలలో అద్భుతంగా, భక్తి స్ఫోరకంగా, మనసులను రంజింపచేసేదిగా పేరు తెచ్చుకున్నది. భాగవతానికి భాగవతమే సాటి.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

***– ఎడిటర్, శ్రీవేంకటేశం***

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

గత సంచిక తరువాయి

## శ్రీ వామన పురాణాంతర్గతం

ఆ గంధర్వాదులు బ్రహ్మర్షియైన అగస్త్యునితో ఇలా అన్నారు – "మహాత్మా! వినండి, మేము మహానుభావుడైన విష్వక్సేనుని అనుచరులం. ఆయన మహా బలపరాక్రమవంతుడు, బుద్ధిమంతుడు, సకల లోకనాయకుడు, మధుకైటభులను సంహరించినవాడు అయిన శ్రీహరికి అనుచరుడు. మేమూ విష్వక్సేనుని ఆజ్ఞానువర్తులము. ఆయనను జనులంతా నిశ్చలచిత్తంతో ధ్యానిస్తారు. ఈ చరాచర జగత్తంతా ఆయన వశంలో ఉంటుంది. దేవతలు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు, నాగులు, దానవులు, మునులు, దైత్యులు, సిద్ధులు, ఆ మహాపరాక్రమశాలికి, అపరనారాయణుని వంటి వానికి నమస్కరిస్తారు.

పూర్వం దేవదేవుని ఆజ్ఞచే ఇంద్రునితో సమానమైన బలపరాక్రమములు గల మహావీరుడైన వృషభాసురుని ఆయన సంహరించాడు. మహాభయంకరమైన, శరీరం గగుర్పాటు చెందే దేవాసుర సంగ్రామంలో ఆయన వందల, వేల రాక్షసులను హతమార్చాడు. ఆయనెప్పుడు సృష్టికర్తయైన ఆ భగవంతుని ఆజ్ఞానువర్తియై ఉంటాడు. ఊహింపనలవిగాని బలపరాక్రమ తేజస్సులు గల ఆయన శ్రీమహావిష్ణువు పాదపద్మముల నాశ్రయించి ఉంటాడు. ఆయన కోపిస్తే ఇంద్రునితో పాటు యక్షులు, నాగులు, గంధర్వులు, గుహ్యకులు, కిన్నరులు, రాక్షసులతో సహా లోకాలన్నింటిని కూడ ధ్వంసం చేయగలడు. ఇంతటి ప్రభావ సంపన్నుడైన విష్వక్సేనుడు, మహాబలవంతుడు, శ్రీహరికి అనుచరుడు. ఆయన లోకాలన్నింటిలో ప్రసిద్ధుడు. అటువంటి విష్వక్సేనునికి అనుచరులం మేము".

మహారాజా! ఆ గంధర్వాదులు ఈ విధంగా చెప్పగా అగస్త్యమహర్షి విష్వక్సేనుని బలపరాక్రమాలను ప్రస్తుతించాడు. దేవదేవుడైన శ్రీహరికి భక్తితో నమస్కరించాడు. తపోధనులైన ఆ మునులంతా కూడ నిర్మల చిత్తంతో భగవంతునికి నమస్కరించారు. ఆ మునీంద్రులు గంధర్వాదులందరినీ వీడ్కొని సంతోషంతో పూర్వం వలె శ్రీమన్నారాయణుని దర్శించగోరి ఆ నారాయణగిరిపై సంచరించసాగారు.

### పుణ్యతీర్థ సంసేవనం

రాజా! అగస్త్యమహర్షి ఆ మునీంద్రులతో పాటు మహత్తరమైన, సుందరమైన ఆ పర్వతరాజంపై అక్కడక్కడ సంచరిస్తూ వందల కొలది పర్వతాకారం గల పుష్పించిన మహావృక్షాలను దర్శించాడు. అలాగే పవిత్రములైన నిర్మలములైన శుభప్రదములైన నీటితో కూడిన మిక్కిలి సుందరములైన

సరస్సులను దర్శించాడు. అక్కడ అనేక పర్వత గుహలు, వృక్ష సముదాయాలతో అలంకరించబడినాయి. దివ్యములైన పర్వత బిలాలు, కృత్రిమ గృహాకారంలో ఉండేటటువంటి అందమైన పర్వత గుహలను, నీలమేఘాలవలె ఉన్న పర్వత శిఖరాలను దర్శించాడు. అక్కడ దివ్యసరస్సులు, తటాకాలు శుభప్రదాలైన జలాలతో శోభిస్తున్నాయి. వాటిలో హంసలు, కన్నెలేడి పక్షులు (సారసపక్షులు) సంచరిస్తున్నాయి. బెగ్గురు పక్షుల ధ్వనులతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తున్నది.

మిణుగురు పురుగులతోను, జింకలతోను, మదజలాన్ని స్రవిస్తున్న ఏనుగులతోను, సుందరంగా శోభిల్లుతున్న చక్రవాక పక్షులతోను ఆ ప్రాంతం నిండి ఉంది. అనేక రకాల పక్షుల ధ్వనులతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తున్నది. ఈ విధంగా నానా విధములైన పక్షి జంతు సముదాయంతో కూడి నిర్మలోదకాలతో శోభిస్తున్న దివ్యసరస్సులను వారు నారాయణ మహాపర్వతంలో దర్శించారు.

కడిమి చెట్లు, మద్ది వృక్షాలు, టేకు, బొట్టుగు చెట్లు, మల్లెతీగలు, కొండమల్లి, ఎర్రకాంచనం, సంపెంగ, అశోక, వేగిస మొదలైన వాటితో ఆ సరస్సుల తీరప్రాంతాలు శోభిస్తున్నాయి. వారంతా ప్రీతితో యథావిధిగా ఆ సరస్సులలో స్నానంచేసి దేవతారాధన పూర్తి చేశారు.

మహారాజా! అనంతరం అగస్త్యమహర్షి ఆ మునులందరితో పాటు ఆ పర్వతంపై సంచరిస్తూ దర్శనీయులైన మునులను, నల్లగరిక చిగుళ్ళను తింటూ అడవిలో సంచరిస్తున్న జింకలను, జింక పిల్లలను, తెల్లని దంతాలతో శోభిస్తున్న నల్లని మేఘము వంటి ఏనుగులను, ఒక శిఖరము నుండి మరొక శిఖరానికి వేగంగా దూకుతున్న వానర మూకలను దర్శించారు. ఈ విధంగా బహువిధ మృగములతో, వృక్షములతో, లతలతో శోభిస్తున్న ఆ పర్వత శిఖరంలో అగస్త్యమహర్షి ఋషులందరితో పాటు పితామహుడైన బ్రహ్మదేవుని మాటలను స్మరిస్తూ చాలాకాలం సంచరించాడు.

సనాతనుడు, దేవదేవుడు అయిన భగవంతుని దర్శింపగోరి అగస్త్య మహర్షి ఆ పర్వతంలో అనేక పుష్కరములను చూశాడు. ఆ మహాపుణ్య సరస్సులలోని నీరు శుభప్రదములై, నిర్మలములై, వైడూర్యములవలె స్వచ్ఛంగా ఉన్నాయి. ఆ మునిశ్రేష్ఠులు ఆ పవిత్రములైన తీర్థాలన్నిటిలో స్నానం చేసి జగత్ప్రభువైన శ్రీహరిని భక్తితో పూజించారు.

## కుమారధార తీర్థస్నానం

ఒకనాడు ధర్మాత్ముడైన అగస్త్యమహర్షి ఆ నారాయణగిరిపై సంచరిస్తూ మహత్తరమైన కుమారధారా తీర్థాన్ని దర్శించాడు. మిక్కిలి ఎత్తైన కొండశిఖరం నుండి పెద్ద జలధార క్రిందకు



పడుతున్నది. కుమారస్వామి పూర్వం దానిని సేవించాడు. సర్వపాపములను పోగొట్టునది, శుభప్రదమైన ఆ తీర్థాన్ని చూసి అగస్త్యమహర్షి ఆశ్చర్యచకితుడయ్యాడు. పుణ్యాన్ని కోరుకునే దేవతలు, ఋషులు, సిద్ధులు, మానవులు ఆ కుమారధారా తీర్థాన్ని సేవిస్తూ ఉన్నారు. ఆ కుమారధార మిక్కిలి ఎత్తైన శిఖరం నుండి క్రిందికి ప్రవహిస్తున్నది. ఆ నిర్మలమైన పవిత్రములైన పాపహరములైన దివ్యములైన జలములు ఒక సరస్సుగా ఏర్పడినాయి.

రాజేంద్రా! ఆ పవిత్రతీర్థంలో శివుని కుమారుడు, మహాపరాక్రమశాలి అయిన కుమారస్వామి మధుసూదనుడైన శ్రీహరి ప్రీతికై భయంకరమైన తపస్సు చేశాడు. దేవతలకు సేనానాయకుడు, రాక్షస సంహారకుడు, మహాతేజశ్శాలి అయిన సుబ్రహ్మణ్యస్వామి మూడువేళల యందు జగత్ప్రభువు, లక్ష్మీపతి అయిన శ్రీనివాసుని ఆరాధించాడు. అటువంటి పుణ్యతీర్థానికి అగస్త్యమహర్షి మునులందరితో పాటు వెళ్ళి ఆచమనం చేసి జితేంద్రియుడై నిర్మల చిత్తంతో సర్వపాపహరము, విశుద్ధము, నిర్మలము అయిన ఆ తీర్థంలో మునిగాడు. దేవదేవుడు, నిరామయుడు అయిన నారాయణుని స్మరిస్తు ఆ తీర్థంలో స్నానం చేసి యథావిధిగా మరల ఆచమనం చేసి ఆ మునిశ్రేష్ఠుడు సర్వ జగత్స్రష్ట, దేవదేవుడు, వాసుదేవుడు, అధోక్షజుడు అయిన గోవిందుని దివ్యపరిమళాలు వెదజల్లే పుష్పాలతో పూజించాడు. మహాత్ములైన ఆ మునులందరు కూడా ఆ పవిత్రజలాలలో స్నానం చేసి సావధాన మనస్కులై దేవదేవుడైన జనార్దనుని ఆరాధించారు.

ఆ ముని శ్రేష్ఠులందరు అపరిమిత తేజస్సంపన్నుడు, పరబ్రహ్మ స్వరూపుడు, పురుషోత్తముడు, జగత్ప్రభువు, జగత్తుకు ఆధారమైన వాడు, సకలపాపములను పోగొట్టే శ్రీహరియందు లగ్నంచేసి వరప్రదుడు, సర్వవ్యాపకుడు, సర్వలోకవంద్యుడు, వేంకటాద్రి నివాసి, ఆశ్రితుల కష్టాలను పోగొట్టేవాడు, శ్రీకృష్ణుడు, సర్వేశ్వరుడు, లక్ష్మీదేవితో క్రీడిస్తున్న సురోత్తముడైన శ్రీహరిని ఆరాధించి అగస్త్యమహర్షి మునుపటివలెనే ఆ పర్వతంపై

సంచరించసాగాడు. ఆయన ఆ విధంగా సంచరిస్తూ అనేక పాప పరి హారకాలైన తీర్థాలను సేవించాడు. దేవతలు, దానవులు, గంధర్వులు, సిద్ధులు, చారణులు, నాగులు, ఋషులు, వాలఖిల్యులు (జటావల్కలధారులు), ఆ పవిత్ర పర్వతాన్ని సేవిస్తున్నారు. అటువంటి నిర్మలమైన పర్వతాన్ని అగస్త్య మహర్షి మునులందరితోపాటు దర్శించాడు.

## వేంకటాద్రిలోని పుణ్యతీర్థాలు

జనక మహారాజు వామదేవ మహర్షిని 'ఓ మహామునీ! మహాత్ముడైన అగస్త్యమహర్షి ఆ మహాపర్వతంలో చూసిన తీర్థముల పేర్లను వాటి మాహాత్మ్యాన్ని, ఆ తీర్థాలు పాపాలను పోగొట్టే విధానాన్ని నాకు చెప్పండి. వాటిలో స్నానమాచరించుట వలన మానవులకు కలిగే పుణ్యఫలాన్ని గురించి నాకు సవిస్తరంగా తెలియజేయండి. ఆశ్చర్యకరము, అద్భుతము అయిన ఈ విషయాన్ని చెప్పటానికి వారే తగినవారు. కావున మహాత్మా! మీ నుండి ఆ విషయాలన్నిటిని సంపూర్ణంగా వినాలని మిమ్మల్ని అడుగుతున్నాను. ఓ తపోధనా! నాకు దయతో ఆ విషయాలను వివరించండి' అని ప్రార్థించాడు.

అంతట వామదేవ మహర్షి యిలా చెప్పసాగాడు. మహారాజా! మీరడిగిన విషయాలను నేను చెబుతా, మీరు శ్రద్ధగా వినండి. ఆ తీర్థముల పేర్లు, వాటి మాహాత్మ్యము చాలా అద్భుతమైనది. మహాశ్చర్యకరములైన వాటి మాహాత్మ్య విశేషాలను వివరంగా చెప్పడానికి నూరు సంవత్సరాలకైనా వీలుకాదు. కాబట్టి నేను సంగ్రహంగా చెబుతాను వినండి.

1) వారాహం 2) వామనం 3) సౌమ్యం 4) దివ్యమైన పంచనదనం 5) శిలాతోరణం 6) మహాతీర్థం 7) పద్మసరోవరం 8) సౌరతీర్థం 9) పాపనాశనం 10) ఐంద్రం 11) వాయవ్యం 12) వారుణం 13) బ్రహ్మతీర్థం 14) అఘఘ్నం 15) ఆగ్నేయం 16) సర్వకామదం 17) మమాపుణ్యప్రదమైన పంచతీర్థం 18) గౌరీతీర్థం 19) ప్రసిద్ధమైన ఆశ్వినం 20) పారమేశ్వరం 21) మహాపుణ్యప్రదమైన చక్రతీర్థం 22) శంఖతీర్థం 23) విజయం 24) విమలం 25) శోకనాశనం 26) మత్స్యతీర్థం 27) దివ్యమైన కౌర్మం (కూర్మతీర్థం) 28) గారుడం 29) పాండవతీర్థం 30) మాయామయం 31) మహాతీర్థం 32) కాండవం 33) కౌహలం 34) దాడిమం 35) మధురతీర్థం సర్వపాప ప్రణాశకమైనది. శ్రీవేంకటాచలంలోని ఈ పుణ్యతీర్థాలున్నాయని వామదేవ మహర్షి జనకునితో చెప్పాడు.

## పంచతీర్థ మాహాత్మ్యం

అప్పుడు జనకుడు వామదేవ మహర్షితో 'ఓ మునిశ్రేష్ఠా! మహాత్మా! మీరు పంచతీర్థాల గురించి ప్రస్తావించారు. వాటిని



గురించి తెలుసుకోవాలని ఉంది. కాబట్టి వాటిని వివరించండి' అని అడిగాడు. అప్పుడు వామదేవ మహర్షి మరల ఇలా చెప్పనారంభించాడు –

కపిలతీర్థానికి పడమటి వైపున పవిత్రమైనది, పుణ్యతీర్థమైన పంచతీర్థం ఉంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు, ఇతరులకు పంచతీర్థాలున్నాయి. అక్కడ ఈ ఐదు జాతుల వారికి అభిమాన దేవతలు పరమ సంతోషంతో కపిలేశ్వరుని దర్శిస్తూ ఆనందంగా నివసిస్తున్నారు. వారు అంజనాద్రిపై నివసించే వరాహస్వామిని నిరంతరం చింతిస్తూ, పూజిస్తూ స్తుతిస్తున్నారు. పై భాగంలో ఉన్న పుణ్యతీర్థం మొదటిది బ్రాహ్మణతీర్థం. దానిలో స్నానం చేసి, ఆ తీర్థాన్ని పానం చేసి, జపతపానుష్ఠానాదులు చేసే బ్రాహ్మణులకు వెంటనే అభీష్టాలు సిద్ధిస్తాయి. దాని క్రింద ఉన్న మహాతీర్థం క్షత్రియులకు అభీష్టాలను ప్రసాదిస్తుంది. ఆ తరువాత తీర్థం వైశ్యులకు శీఘ్రంగా శుభ ఫలాలనిస్తుంది. దాని తరువాతి తీర్థం శూద్రుల పాపాలను పోగొడుతుంది. ఆ క్రింద పర్వతమూలంలో ఉన్న తీర్థం చండాలుర పాపాలను వెంటనే నశింపజేస్తుంది.

వరాహ రూపంలో ఉన్న విష్ణుభగవానుడు భక్తుల కోసం దయతో ఆ పంచతీర్థంలో సదా నివసిస్తూ వర్ణాశ్రమ ధర్మాలు, ఆచారాలలో ఏర్పడే దోషాలను పోగొడుతున్నాడు.

**వారాహరూపీ భగవాన్ విష్ణుర్భక్తానుకమ్పయా ।**
**తేషు పంచమ తీర్థేషు సాన్నిధ్యం కురు తే సదా ॥**
**వర్ణాశ్రమాణామాచార వైకల్యం నాశయత్యహో ॥**
**- వామనపురాణం అధ్యాయం.30, శ్లోకాలు 20,21.**

రాజా! మానవుడు వాటిలో ఏ తీర్థాన్ని సేవించినా ఆ తీర్థప్రభావం వలన అతనికి ఆయా కోరికలు నెరవేరుతున్నాయి. ఆ భగవంతుని అనుగ్రహం వలన ఉత్తమమైన శుభాలను పొందుతున్నాడు. ఆ పర్వత రాజంలో ఈ తీర్థాలన్నీ కలిసి ఒకే చోట ఉన్నాయి. అక్కడ ఉన్న నదులన్నీ పాపహరాలే. వాటి సంఖ్య చెప్పలేము. అయినప్పటికీ చెబుతున్నాను విను. అవి అరవై ఆరు కోట్ల తీర్థాలు. ఈ నారాయణగిరిలో, అంజనాద్రిలో

ఆ తీర్థాలున్నాయి. దేవతలు, ఋషులు, సిద్ధులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, నాగులు, గుహ్యకులు, విద్యాధరులు, అప్సరసలు, కిన్నరులు, గరుడులు, దేవతా నాయకులు మొదలైన వారంతా పుణ్యం కోరి ఆ తీర్థాలను సేవిస్తున్నారు. కావున వాటి మాహాత్మ్యాన్ని వర్ణించడం సాధ్యం కాని పని.

ఈ పవిత్రమైన పర్వత శిఖరాల్లో ఏ శిఖరంలో ఎక్కడ జలం కనిపించినా అది శుభప్రదమైనది. ఆ పవిత్ర జలం మహాపుణ్యప్రదమైనది. అది తీర్థాలలో నుండి వచ్చినదే. బుద్ధిమంతుడైన వాడు ఆయా తీర్థాలలో స్నానమాచరించి చిత్తనైర్మల్యం కొరకు వాటిని స్మరిస్తూ, ధ్యానిస్తూ అక్కడే సంచరించాలి. అని చెప్పి వామదేవ మహర్షి జనకునితో ప్రభూ! రాజర్షీ! ఇంతకు ఈ పర్వతంలో ఉన్న తీర్థాల విశేషాలను వివరిస్తాను. వాటన్నిటిని సావధానంగా వినండి అని మరల ఇలా చెప్పనారంభించాడు –

## స్వామి పుష్కరిణి మొదలగు సకల తీర్థ మాహాత్మ్యము

ఈ నారాయణగిరి మహాపవిత్రమైనది. దీనిని దర్శిస్తే సకలదోషాలు పోతాయి. ఈ పర్వతం ఉత్తరభాగంలో గల పుణ్యతీర్థాలను గురించి చెబుతాను. వినండి. 1) శాలివాహన తీర్థం 2) రోగఘ్న తీర్థం 3) శాంత తీర్థం 4) సర్వదుఃఖ ప్రశమనం 5) కృష్ణునిధ్యానం 6) స్వామి పుష్కరిణి. ఇది మహాపుణ్యప్రదమైనది. సర్వపాపాలను పోగొడుతుంది. దాని తీరంలో జగత్ప్రభువైన శ్రీనివాసుడు లక్ష్మీదేవితో విహరిస్తూ క్రీడిస్తున్నాడు.

**స్వామి తీర్థం మహాపుణ్యం సర్వపాప ప్రణాశనమ్ ।**
**యస్య తీరే జగన్నాథో రమతే రమయా సహ ॥**

**- వామనపురాణం, అధ్యాయం 30, శ్లోకం 33.**

మహారాజా! ఈతీర్థంయొక్క విఖ్యాతి ముల్లోకాలలో విశేషంగా వ్యాపించింది. తెల్లని మేఘాలవలె శోభిల్లే రాజహంసలు దానిని సేవిస్తూ ఉంటాయి. మత్తెక్కిన కోకిలలు, రమ్యమైన చక్రవాక పక్షులు, నానావిధ వృక్షాలు పుష్పభారంతో వంగి సుందరంగా ఉంటాయి. ఆ తీర్థంలోని నీటిని త్రాగడానికి పర్వతాలవంటి ఏనుగులు, ఎలుగుబంటులు, సింహాలు, వరాహాలు, తోడేళ్ళు, జింకలు, నక్కలు మొదలైన జంతువులు అక్కడికి వస్తూంటాయి. ఈ విధంగా జంతువులు, పక్షులతో సందడి ఉండే ఆ తీర్థం నూరు ధనువుల విస్తీర్ణం కలిగి, చంద్రకాంత మణులవలె స్వచ్ఛమైన, నిర్మలమైన నీటితో శోభిస్తున్నది.



రాజేంద్రా! నేను కొన్ని ముఖ్యమైన తీర్థాలను గురించి చెప్పాను. మహారాజా! సకల తీర్థాలను గురించి వివరించడానికి సాధ్యం కాదు. నేను కేవలం ఆ నారాయణగిరిలోని కొన్ని తీర్థాలను గురించి మాత్రమే చెప్పాను. నేను చెప్పిన స్వామి పుష్కరిణీ తీర్థం శుభప్రదమైనది. దాని ప్రభావం అసమానమైనది. దేవతలుగాని, మానవులుగాని దాన్ని వర్ణించలేరు. ఆ పుష్కరిణీ తీరంలో శ్రీహరి స్వయంగా లక్ష్మీదేవితో ప్రీతితో విహరిస్తూ ఉంటాడు.

నారాయణగిరిలో ఉన్న సర్వపాప పరిహారమైనది, దేవర్షి గణాలచే సేవించబడునది, ముల్లోకాలలో విఖ్యాతిగాంచినది, దేవతలచే కూడ ఆరాధించబడునది అయిన స్వామి పుష్కరిణిలో స్నానంచేస్తే మానవుడు అనేక వేల జన్మలలో చేసిన పాప సమూహములన్నిటి నుండి విముక్తుడవుతాడు. సాక్షాత్తుగా నారాయణాద్రి ఉన్న ఈ పుష్కరిణి సర్వలోకవాసులను మోహింపజేస్తున్నది. సర్వదోషములను పోగొట్టే ఈ తీర్థం పరమేశ్వరుని మాయాశక్తి స్వరూపిణి.

మహారాజా! స్వామి పుష్కరిణి సకల తీర్థాలలో శ్రేష్ఠమైన ప్రాతఃకాలంలో నిద్రలేచి స్వామి పుష్కరిణిని కీర్తించే మానవులు మహాత్ములై పరమగతిని పొందుతారు. దానిలో స్నానం చేసినా, అద్భుతమైన ఆ నీటిని దర్శించినా, మహత్తరమైన పుణ్యం వస్తుంది. వారు సర్వపాపాల నుండి విముక్తులవుతారు. వారికి సకల దుఃఖాలు నశిస్తాయి. వారు దివ్యమైన విమానాన్ని అధిరోహించి స్వర్గానికి వెడతారు.

'వరిష్ఠా సర్వతీర్థేభ్యః స్వామి పుష్కరిణీ నృప ।
**యే నరాః ప్రాతరుత్థాయ 'స్వామి పుష్కరిణీతిపై'**
**కీర్తయంతి మహాత్మానః తే యాన్తి పరమాం గతిమ్ ॥**
**తస్యాం స్నాత్వా చ తద్వారి దృష్ట్వా చ మహదద్భుతమ్ ।**
**సర్వపాపవినిర్ముక్తాః సర్వశోక వివర్జితాః ॥**
**విమానం దివ్యమారుహ్య వ్రజంతి త్రిథాలయమ్'**

**- వామనపురాణం, అ.30, శ్లో.44-47.**

ఓ మిథిలాధీశ! ఆ పుష్కరిణీ తీర్థాన్ని తాగినవారు అనేక వేల పాపాలు చేసిన వారైనప్పటికిని వాటినుండి విముక్తులౌతారు. పాపులలోకెల్లా మహాపాపులైనా వారి సర్వపాపాలూ నశిస్తాయి. రోగులు రోగాల నుండి విముక్తులౌతారు. దుఃఖితులైన జనులు వారి కష్టాలు తీరి వారు ఆ బాధల నుండి విముక్తులౌతారు.

మోహాన్ని పొందిన వారి మోహం పోతుంది. ఆ శోక సముద్రం నుండి బయట పడతారు.

సంసార దుఃఖతప్తులై, ఆర్తులై వికల మనస్కులైన వారు ఆ స్వామి పుష్కరిణిని ఆశ్రయిస్తే సచ్చిదానంద స్వరూపమైన నిర్మల పరబ్రహ్మాన్ని పొందుతారు. పూర్వం దేవదేవుడు, సృష్టికర్త, సకల లోకనాయకుడు ఇంద్రియాతీతమైన స్వరూపం కలవాడు అయిన శ్రీమహావిష్ణువు మేఘ గంభీరస్వనంతో సర్వదేవతలు, ఋషులు వింటూండగా 'ఈ స్వామి పుష్కరిణి సర్వపాప పరిహారకాలైన గంగాది సకల తీర్థాలతో సమానమైనదని' ప్రకటించాడు అని వామదేవుడు చెప్పగా జనకమహర్షి వామదేవుని 'మహర్షీ! పూర్వం శ్రీహరి స్వామి పుష్కరిణి గంగాది సకల తీర్థాలతో సమానమైనదని ఎలా చెప్పాడు? మహాత్మా! అది జరిగింది జరిగినట్టుగా మీరు నాకు వివరించండి. ఓ మునిశ్రేష్ఠా! నేను దానిని మీ నుండి వినవలెనని అనుకుంటున్నాను' అని ప్రార్థించాడు.

మహాత్ముడైన జనకుడు ఈ విధంగా అడుగగా వామదేవ మహర్షి జనక మహారాజుతో 'రాజా! మీరడిగినది చెబుతాను వినండి' అని ఇలా చెప్పనారంభించాడు –

## శంఖనృపతి వృత్తాంతము

పూర్వం హైహయ వంశంలో మహాతేజశ్శాలియైన శంఖుడనే రాజు జన్మించాడు. ఆయన తన ధర్మకర్మల వలన భూలోకంలో ప్రఖ్యాతిగాంచాడు. ఆయన మహాబలవంతుడైన 'శ్రుతు' డనే మహారాజు కుమారుడు ఆయన శత్రుపురాలను జయించాడు. ఆ శంఖ మహారాజు పర్వతాలు , వనాలు, అడవులతో కూడిన సమస్త భూమండలాన్ని పరిపాలించాడు. పరమ ధార్మికుడైన ఆయన సర్వసద్గుణోపేతుడై ప్రహ్లాదుని వలె పరమ భాగవతోత్తముడై వెలుగొందాడు. ఆయన ఆర్తత్రాణపరాయణుడు, జగత్ప్రభువు, సర్వజీవనాథుడు అయిన నారాయణుని అశ్వమేధాది యజ్ఞాలలో ఆరాధించాడు.

ఆ శంఖమహారాజు భగవంతుని యందు భక్తియుక్తుడై ఆ యజ్ఞాలన్నింటిలో ఆ మధుసూదనుని ప్రీతి కొరకు వేలకొలది దక్షిణలు యిచ్చాడు. ఆయన అన్ని యజ్ఞాలు చేసినప్పటికీ సనాతనుడు, పుండరీక దళనయనుడు, అచింత్యుడు అయిన నారాయణుని దర్శించలేక పోయాడు. జరామరణ రహితుడైన ఆ భగవంతుని దర్శించడానికి ఎంతో శ్రద్ధతో ఆయన అనేక యజ్ఞాలు చేశాడు. భక్తితో అనేక భూరి దక్షిణలు యిచ్చాడు. అయినప్పటికీ ఆ జనార్దనుని దర్శనం కాలేదు. దానితో దుఃఖసంతప్తుడైన శంఖమహారాజు నిశ్చల భక్తిశ్రద్ధలతో అనేక యజ్ఞయాగాదులు చేసినా ఆ భగవంతుని దివ్యదర్శనం కాలేదు.

మహారాజా! ఇలా ఉండగా మహాత్ముడైన ఆ శంఖ మహారాజు దుఃఖాన్ని చూసి ఒకనాడు భగవంతుడు, పురుషోత్తముడు, సర్వవ్యాపియైన పరాత్పరుడు, దయాళువైన వాసుదేవుడు, సర్వభూతాలు వింటుండగా మేఘ గంభీరమైన వాక్కులతో అదృశ్యంగా ఆ శంఖమహారాజుతో ఇలా అన్నాడు –

**నారాయణగిరౌ మాం త్వం ద్రక్ష్యసే హే మహీపతే ।**
**భక్తిభావేన మనసా తపస్తప్త్వా సుదుశ్చరమ్ ॥**
**- వామనపురాణం, అ.31, శ్లో.11.**

ఓ రాజా! నీవు నారాయణ పర్వతంపైన భక్తిభావంతో కూడిన చిత్తంతో ఘోరతపస్సు చేసి నన్ను దర్శిస్తావు. అక్కడ దివ్యమైన పుష్కరిణి ఉంది. అది నూరు ధనువుల విస్తీర్ణం కలది. దానిలోని నీరు నిర్మలంగా, వైడూర్యమణుల వలె స్వచ్ఛంగా ఉంటుంది. ఆ పుష్కరిణి సర్వపాపాలను పోగొడుతుంది. అది ముల్లోకాలలోను పుణ్యప్రదమైన స్వామి పుష్కరిణిగా ప్రసిద్ధి చెందింది. నిర్మలములైన జలములు కల ఆ పుష్కరిణి గంగాది సకల తీర్థములతో సమానమైంది.

మానవులు దానిలో స్నానం చేస్తే సర్వపాపాల నుండి విముక్తులౌతారు. ఓ రాజా! మహాపుణ్యప్రదమైన ఆ పుష్కరిణీ తీరంలో నీవు నిశ్చల చిత్తంతో తీవ్రనిష్ఠతో గొప్ప తపస్సు చేయి. ఆ విధంగా వేయి సంవత్సరాలు తపస్సు చేయగా మహాతేజస్సంపన్నుడైన అగస్త్యమహర్షి అనేక వందల వేల మునులతో కూడి నన్ను చూడాలనే కోరికతో ఆ పర్వతంపై సంచరిస్తూ అక్కడకు వస్తాడు.

బ్రహ్మవేత్తలందరిలో శ్రేష్ఠుడైన ఆ మహర్షి నాయందు మిక్కిలి భక్తితో నన్నన్వేషిస్తున్నాడు. ఆ మహర్షి వచ్చిన కొద్ది కాలానికే నా అనుగ్రహం వలన ఆ మహాత్మునితో పాటు నీవు నన్ను దర్శించగలవు. కావున నీవు దుఃఖించవలదు. నీ అభీష్టాలను ప్రసాదిస్తాను. ఓ రాజా! మహావీరా! విషాదం పొందవద్దు. నీవు ఆ నారాయణాద్రికి వెళ్ళు.

**ఆయాస్యతి మహాతేజాః అగస్త్యో మునిభిస్సహ ।**
**ఆగతేథ మునరౌ తస్మిన్ అచిరేణైవ మాం నృవ ॥**
**ద్రష్టాసి మత్ప్రసాదేన తేవ సార్ధం మహాత్మనాం ।**
**త్వయా న శోకః కర్తవ్యో దాస్యే తవ యథేప్సితమ్ ॥**
**మా విషాదం కృథా వీర! గచ్ఛత్వం తం మహీధరమ్ ।**
**- వామనపురాణం, అ.31, శ్లో.16,18,19.**

'జనకమహారాజా! పూర్వం దేవదేవుడు, జగన్నాథుడు అయిన భగవంతుడు, స్వామి పుష్కరిణికి ఈ విధంగా గంగాది నదులతో సామ్యాన్ని చెప్పాడు' అని వామదేవ మహర్షి జనక మహారాజుకు ఆ తరువాత వృత్తాంతాన్ని ఇలా చెప్పసాగాడు.

## శంఖ మహారాజు తపస్సు

మహారాజా! ఆ ధీమంతుడైన శంఖ మహారాజు దేవదేవుడు, సారఙ్గపాణి అయిన శ్రీమహావిష్ణువు అదృశ్యంగా పలికిన

మధురమైన వాక్కులను విని దేవేంద్రునితో సమానమైన పరాక్రమం కలవాడు. సౌమ్యుడు, పురుష శ్రేష్ఠుడు, అపర దేవేంద్రునివలె నున్న పరాక్రమశాలియైన తన కుమారుని రాజ్య పట్టాభిషిక్తుని చేసి వాసుదేవుడైన నారాయణుని దర్శించాలనే కోరికతో దివ్యమైన నారాయణునికి నిలయమైన ఆ నారాయణగిరికి వెళ్ళాడు.

ఆ మహారాజు భగవంతుడు చెప్పినట్టుగా స్వామి పుష్కరిణీ తీరంలో ఘోరమైన తపస్సు చేశాడు. సకల విషయాల నుండి మనస్సును మరలించాడు. పరబ్రహ్మయైన ఆ కేశవుని యందు మనస్సును నిశ్చలంగా పెట్టి జితేంద్రియుడై ఆ విశ్వేశ్వరుని యథావిధిగా ఆరాధిస్తూ వేయి సంవత్సరాలు తపస్సు చేశాడు.

ఈ విధంగా శుభప్రదమైన స్వామి పుష్కరిణి మహాపుణ్యప్రదమైనది. పురాతనమైన దానిని సేవించే మానవుడు సమస్త పాపాలు చేసినా నశించడు. దీనిని భక్తితో సేవించేవారు పరమగతిని పొందుతాడు. దేవదేవుడైన ఆ శ్రీకృష్ణుని దివ్యనుగ్రహంతోవారి సకలాభీష్టాలు నెరవేరుతాయి. జితేంద్రియులై దీనిని కోరికలతో సేవించేవారి కోరికలు సిద్ధిస్తాయి. ఋషులు, వాలఖిల్యులు, సిద్ధులు వేలాదిమంది ప్రతిదినం దీనిలో స్నానమాచరించి ఆ జగత్ప్రభువును ఆరాధిస్తారు.


వేలకొలది గంధర్వులు, కిన్నరులు ఈ పుష్కరిణీ తీరానికి వచ్చి ఆ దేవదేవుని ప్రసన్నుని చేసుకోవడానికి మృదుమధుర స్వరంతో గానం చేస్తారు, కీర్తిస్తారు. రాత్రి, పగలు ఆయనను ఆరాధిస్తూ సేవిస్తారు. మంచి నేత్రములు గల అప్సరసలు నాట్యం చేస్తారు. ఈ విధంగా వారంతా రాత్రింబవళ్ళు అనేక విధాలుగ ఆయన్ని శ్రద్ధాభక్తులతో సేవిస్తూ, అర్చిస్తూ, స్తుతిస్తూ, ఆయన్ని ప్రసన్నుని చేసుకుంటారు. మహారాజా! భూలోకంలోని ఈ స్వామి పుష్కరిణిని దేవతా గణాలు ఆరాధించడం చాల ఆశ్చర్యకరమైన విషయం. ఇది సాక్షాత్తు నారాయణగిరిలో ఉంది. ఇది తనకు చాల ప్రియమైనదని సాక్షాత్తు ఆ నారాయణుడే చెప్పాడు

**ఏషా మహాశ్చర్యతమా మహీవతే**
**మహీతలే దేవగణైరభిష్టుతా ।**
**నారాయణాద్రి ప్రవరం సమాశ్రితా**
**నారాయణేనొప్యుదితా ప్రియేత్ సా ॥**
**- వామనపురాణం, అ.31, శ్లోక34.**

## అగస్త్యాది మహర్షుల తపస్సు

జనక మహారాజా! అగస్త్యమహర్షి ఆ మునులతో పాటు స్వామి పుష్కరిణిని తప్ప మిగిలిన తీర్థములన్నిటిని సేవించాడు. ఆ తరువాత మనస్సు కాహ్లాదం కలిగించే స్వామి పుష్కరిణిని చూసి ఆనందించాడు. పవిత్రమైన జలాలు గల ఆయా తీర్థాలన్నింటిలో స్నానం చేసి ఆ కేశవునికి నమస్కరించి పూజించాడు. ఆ మునులందరు కూడ చాలా సంతోషాన్ని పొందారు. వారంతా వందలు, వేలకొలది పుణ్యతీర్థాలను సందర్శించి ఆ ద్విజోత్తములు వాటిలో స్నానమాచరించి సనాతనుడైన భగవంతుని నిశ్చల చిత్తంతో ఆరాధించారు.

వారందరితో పాటు అగస్త్యమహర్షి కూడా జితేంద్రియుడై పురుషోత్తముడైన జగన్నాథుని ఆరాధించి, త్రికాలాధీశుడు, ఆదిదేవుడు, విశాలాక్షుడు, అఘటన ఘటనాసమర్థుడు అయిన భగవంతుని దర్శింపగోరి ఆ పర్వతముపై సంచరించాడు. కాని చాలాకాలం వరకు జగత్స్రష్ట, దేవదేవుడు, సర్వలోక శరణ్యుడు అయిన ఆ పురుషోత్తముని దర్శించలేదు. మహారాజా! అందుచేత అగస్త్యమహర్షి చాల విచారిస్తూ మునులందరితో పాటు ఆ మునిశ్రేష్ఠుడు ఒక పర్వతగుహలో కూర్చున్నాడు.




ఆ పర్వతాన్నంతా పరికించి చూస్తూ 'పూర్వం బ్రహ్మదేవుడు ఈ పర్వతం మీద భగవంతుని దర్శనం అవుతుంద'ని చెప్పాడు. కాని ఇదేమి విచిత్రమో నాకు ఆయన దర్శనం కాలేదు అని బ్రహ్మదేవుని మాటలను స్మరిస్తు మిక్కిలి విచారగ్రస్తుడై కూర్చున్నాడు. ఆ ఋషులందరు కూడా దుఃఖతప్తులై ఆ దేవదేవుని దర్శించలేదని విచారిస్తు ఆ అగస్త్యమహర్షి చుట్టూ కూర్చున్నారు. రాజా! ఈ విధంగా ఆ మునీంద్రులు ఆ పవిత్రమైన ఆ వేంకటాద్రిపై సంచరిస్తూ ఉండగా నూరు సంవత్సరాల కంటె ఎక్కువ కాలమే గడిచిపోయింది.

**(సశేషం)**

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## అనంతాళ్వార్ గడ్డపార (గునపం)




పడికావలి దాటగానే దేవాలయంలోకి వెళ్తుంటే, అంటే ద్వారానికి ఉత్తరం వైపు భాగంలో, ఈ గునపం గోడకు వ్రేలాడదీయబడి ఉంటుంది. ఇది సుమారు వెయ్యి సంవత్సరాలు ప్రాచీనమైనది. దీనికి సంబంధించి అత్యంత ఆసక్తికరమైన కథను శ్రీవారి మహాభక్తుడు అనంతాళ్వార్ చరిత్రలో వివరంగా తెలుసుకున్నాం. సాక్షాత్తూ శ్రీవారిని గాయపరచిన ఈ గునపాన్ని ఆలయంలోకి ప్రవేశించేటప్పుడు, బయటకు నిష్క్రమించేటప్పుడు తప్పక దర్శించండి.

మనకి తెలియకుండానే మనమిప్పుడు ఆలయం లోనికి, అంటే రెండవ ప్రదక్షిణమార్గమైన సంపంగి ప్రదక్షిణ మార్గం లోనికి ప్రవేశించి, దేవదేవుని దర్శనం కోసం ఆత్రుతతో ఎదురు చూస్తున్నాం. సంపంగి ప్రదక్షిణ మార్గంలో ఎందరో రాజులు, చక్రవర్తులు శ్రీవారి మీద ఎనలేని భక్తితో కట్టించిన అనేక మండపాలు, వారి వారి కాంశ్య ప్రతిమలు మరెన్నో దర్శించదగ్గ ప్రదేశాలున్నాయి. ప్రతి మండపం, ప్రతి ప్రతిమ మనను చరిత్రలోకి తీసుకుపోతుంది. ఆ విశేషాలన్నింటిని రేపు తెలుసుకుందాం.

## సంపంగి ప్రదక్షిణం

మహాద్వారం ముందు పాదప్రక్షాళన చేసుకొని, శంఖనిధి–పద్మనిధిల మూర్తులకు నమస్కరించుకొని, అనంతాళ్వార్ గడ్డపారను దర్శించుకొని, మహాద్వారం గుమ్మాన్ని దాటగానే మనం సంపంగి ప్రాకారంలోకి, అంటే మందిరంలోకి ప్రవేశిస్తాము. దేవాలయం యొక్క మహాప్రాకారం మరియు సంపంగి ప్రాకారం మధ్యన (అంటే మొదటి – రెండవ ప్రాకారాల మధ్యన) గల సుమారు 30 అడుగుల వెడల్పైన ప్రదక్షిణ మార్గాన్ని సంపంగి ప్రదక్షిణం అంటారు. ఆలయం లోనికి ప్రవేశించిన వెంటనేఉండే మొట్టమొదటి ప్రదక్షిణ మార్గం ఇదే. లెక్క ప్రకారం ఇది రెండవ ప్రదక్షిణ మార్గం అయినప్పటికీ, ఆలయం వెలుపలి మహా ప్రదక్షిణ మార్గాన్ని ఆగమ శాస్త్రం పరిగణించదు కాబట్టి శాస్త్రరీత్యా ఆలయానికి ఇదే మొదటి ప్రదక్షిణ మార్గం. పూర్వం ఈ ప్రదక్షిణ మార్గంలో స్వామివారి పుష్పకైంకర్యానికి ఉపయోగపడే సంపంగి లేదా చంపక వృక్షాలు విరివిగా ఉండటం చేత, ఈ మార్గానికి సంపంగి ప్రదక్షిణ మార్గం లేదా చంపక ప్రదక్షిణమార్గం అనే పేర్లే ఏర్పడ్డాయి. పేరుకు ప్రదక్షిణమార్గమే అయినా, ప్రస్తుతం

ఉన్న క్యూ ప్రతిబంధకాల కారణంగా ఈ మార్గం ద్వారా పూర్తి ప్రదక్షిణం చేయలేము. కేవలం తూర్పుమార్గం, దక్షిణ – ఉత్తర మార్గాల్లోని కొంతభాగం మాత్రమే మనం దర్శించుకోగలం.

## కృష్ణరాయ మండపం లేదా ప్రతిమా మండపం

మహాద్వారాన్ని దాటగానే, మనం సంపంగి ప్రదక్షిణ మార్గం లోని ప్రతిమా మండపం లోనికి ప్రవేశిస్తాము. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఉండటం వలన దీనిని కృష్ణరాయ మంటపం అనీ, ఇంకా ఇతరుల ప్రతిమలు కూడా ఉండటం వలన ప్రతిమా మంటపం అని వ్యవహరిస్తారు. పదహారు స్తంభాలతో ఉన్న ఈ ఎత్తైన మంటపం విజయనగర వాస్తుశైలిలో నిర్మించబడింది. ఆలయంలోకి వెళుతూంటే, మహాద్వారానికి కుడిపక్క, ఉభయదేవేరులైన తిరుమలదేవి–చిన్నాదేవి సమేతంగా శ్రీకృష్ణదేవరాయలు స్వామివారికి ఎదురుగా ప్రాంజలి ఘటిస్తూ, పడమర దిశలో నిలబడి దర్శనమిస్తాడు. రాయలవారే తమ విగ్రహాలను జనవరి 2, 1517వ తేదీన స్వయంగా ప్రతిష్ఠించుకున్నారు. యావద్దక్షిణ భారతదేశాన్ని కంటిసైగతో శాసించిన ఆ చక్రవర్తినలా అత్యంత నిరాడంబరంగా నమస్కరిస్తూ చూస్తుంటే ఏమనిపిస్తుంది?

**“కోటికీ పడగెత్తినా ధనవంతుడూ, నీ కృపకెన్నడూ సమపాత్రుడూ...”**

అన్న ఘంటసాల గీతం గుర్తుకు రావట్లేదూ?

ఆలయ అధికారులు తెలియక చేసిన తప్పుల వల్ల భక్తులకేదన్నా అసౌకర్యం కలిగితే, వారి తరఫున రాయలవారు క్షమాభిక్ష అడుగుతున్నట్లుగా కూడా మనకు గోచరిస్తుంది. దర్శనానంతరం ఆలయం నుండి బయటకు వెళ్ళేటప్పుడు, మనకు ఎడమప్రక్కగా, ఈ విగ్రహాల్ని దగ్గరగా చూడగల్గుతాం.

అలాగే మహాద్వారానికి ఎడమ ప్రక్కన నమస్కార భంగిమలో ఉన్న, చంద్రగిరి రాజైన వేంకటపతి రాయలవారి నిలువెత్తు కాంశ్యవిగ్రహం కూడా చూడవచ్చు. ఈ విగ్రహానికి దక్షిణం వైపున



అచ్యుత రాయలు, ఆయన రాణి వరదాజి అమ్మాణ్ణిల నిలువెత్తు నల్లరాతి విగ్రహాలు నమస్కార భంగిమలో ప్రతిష్ఠించబడ్డాయి. ఈ రాజులందరూ శ్రీవారికి పరమభక్తులే కాక, దేవాలయ పోషణకు అనేక మడులూ, మాన్యాలు సమర్పించి చిరస్మరణీయులయ్యారు. రాయలవారి ప్రతిమలు తప్ప, మిగతా విగ్రహాలన్నింటినీ మనం క్యూలో శ్రీవారి దర్శనార్థం వెళుతున్నప్పుడు, మనకు ఎడం ప్రక్కగా చూడవచ్చు.

ఈ మండపం చూస్తుంటే, ‘‘రాజులకైనా, రారాజులకైనా సమస్త భోగభాగ్యాలూ ఆ శ్రీవారి చలవే. వారికి అందరూ వినమ్రంగా కృతజ్ఞతలు తెలపాల్సిందే’’ అన్న అలౌకిక భావం కలుగుతుంది.

## తులాభారం

ప్రతిమా మంటపానికి సమీపంలో, ఎడం ప్రక్కగా ఓ త్రాసు కనబడుతుంది. సంస్కృతంలో త్రాసును తుల అంటారు. భక్తుల శరీరబరువును త్రాసులో కొలుస్తారు కాబట్టి దీనిని తులాభారంగా పేర్కొంటారు. కోరిన కోర్కెలు సిద్ధించినవారు, తమ బరువుకు




లేదా తమ కుటుంబ సభ్యుల బరువుకు సరితూగేట్లుగా, తాము మొక్కుకున్న ధనాన్ని లేదా ద్రవ్యాన్ని స్వామివారికి సమర్పిస్తారు. ఈ ద్రవ్యాల్లో ముఖ్యంగా కలకండ, బెల్లం, కర్పూరం మొదలైనవి ఉంటాయి. అదే మొక్కుకుంది ధనమైతే, తగినంత రొక్కం చెల్లిస్తే కావలసిన నాణాలను దేవస్థానం వారే సమకూరుస్తారు. నేటికీ, దక్షిణ భారతదేశంలోని అనేక కుటుంబాల్లో, పసిపిల్లలకు శ్రీవారి ఆలయంలో తులాభారం జరిపించి సరిపడా ద్రవ్యాన్ని లేదా ధనాన్ని స్వామివారికి సమర్పించటం పరిపాటి.

ఇది కేవలం నాణాల సమర్పణ కాదు. శ్రీవారికి కృతజ్ఞతాపూర్వకంగా చేసుకునే ‘‘ఆత్మసమర్పణ’’ కూడా.



## అద్దాల మంటపం

ఆలయంలోకి ప్రవేశిస్తుంటే కుడివైపున, రాయలవారి కాంశ్యప్రతిమకు ఎదురుగా ఉన్న విశాలమైన మంటపమే అద్దాల మంటపం. దాన్నే ఉత్తర భారతీయులు ''ఆయినా మహల్'' అనీ, తమిళులు ''కన్నాడీ అరై'' అని పిలుస్తారు. అన్ని వైష్ణవాలయాల్లో విధిగా ఉండే ఈ అద్దాల మంటపం, శ్రీవారి ఆలయంలో ఓ ఎత్తైన రాతి అధిష్ఠానం మీద నిర్మింపబడి ఉంది. ఈ మంటపంలో ''ముఖమంటపం'', ''అంతరాళం'' అని రెండు భాగాలు ఉన్నాయి.

ముఖమంటపంలో ఇదివరకు ''ప్రసాద అరలు'' ఉండేవి. ఈ అరల్లో అర్చకులు తమ వంతుకు వచ్చే ప్రసాదాన్ని ఉంచి భక్తులకు విక్రయించేవారు. ఈ అరలు ఉండే ప్రాంతాన్ని ''ప్రసాదం పట్టెడ''గా పిలుస్తారు. ప్రస్తుతం అర్చకుల వంతుకు వచ్చే ప్రసాదాలను కూడా దేవస్థానం వారే స్వీకరించి భక్తులకు ఉచితంగా, విక్రయాల ద్వారా వేర్వేరు ప్రాంతాలలో అందజేస్తున్నారు కాబట్టి ''ప్రసాద అరలు'' తీసివేయబడ్డాయి.

అంతరాళం మధ్యలో, నాలుగు స్తంభాల నడుమ ఉన్న చతురస్రాకార వేదిక గోడలకూ, పైకప్పుకూ, అన్నివైపులా పెద్ద పెద్ద అద్దాలు అమర్చబడ్డాయి. అలాగే డోలోత్సవానికి అనువుగా గొలుసులు వ్రేలాడదీయబడి ఉన్నాయి. ఈ మంటపంలో ఉభయ నాంచారుల సమేత మలయప్పస్వామికి డోలోత్సవం (ఊయల సేవ లేదా ఊంజల్ సేవ) జరుగుతున్నప్పుడు, స్వామివారి ప్రతిరూపం అద్దాల్లో అన్ని ప్రక్కలా కనువిందు చేస్తూ, స్వామివారి సర్వవ్యాపకత్వానికి ప్రతినిధిత్వంగా గోచరిస్తుంది. ఈ అద్దాల మంటపంలో ప్రతి మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ డోలోత్సవం ఆర్జితసేవ. ఈ సేవలో పాల్గొనే భక్తులు మాత్రమే అంతరాళం దర్శించగలరు. సాధారణంగా, ముఖమంటపం లోనికి భక్తులను అనుమతించరు. అయితే శ్రీవారి దర్శనానంతరం, ప్రసాదాలు స్వీకరించిన తరువాత చేతులు శుభ్రపరచుకోవటానికి వెళ్ళేటప్పుడు, మనకు కుడిప్రక్క నుండి ఈ ''ముఖమంటపాన్ని'' దగ్గరగా చూడవచ్చు. ఉత్తర భారతదేశం నుండి వచ్చిన ఈ డోలోత్సవ సేవా విధానం, మహంతుల ద్వారా శ్రీవారి ఆలయంలో పెట్టబడి ఉండవచ్చు. 1831వ సంవత్సరం నుండి ఈ ఉత్సవం జరుగుతున్నట్లు ఆధారాలున్నాయి.

అన్నమాచార్యుని బాణీలో ఈ డోలోత్సవ శోభను వర్ణించుకుందాం.

**"డోలాయాంచల డోలాయాంహరే డోలాయాం**
**మీన కూర్మ వరాహ మృగపతి అవతారా**
**దానవారే గురశౌరే ధరణిధర మరుజనక...**
**శిరపాణే గోసమాణే శ్రీవేంకటగిరి కూటనిలయ"**

## రంగనాయక మంటపం

అద్దాల మంటపానికి ఎదురుగా, ప్రతిమా మంటపంలోని వేంకటపతిరాయల విగ్రహానికి దగ్గర్లో, దర్శనానికి వెళ్ళేటప్పుడు మన ఎడమ ప్రక్కగా, ఎత్తైన శిలావేదికపై ఉండే విశాలమైన మండపమే రంగనాయక మండపం లేదా రంగమండపం. 108 అడుగుల పొడవు, 60 అడుగులు వెడల్పు గల ఈ మండపంలో శ్రీరంగనాథుడు కొన్నాళ్ళు కొలువై ఉన్నాడు కావున, ఆయన పేరు మీద ఇది ''రంగమంటప''మైంది. 1320-1360



సంవత్సరాల మధ్య మహమ్మదీయ దండయాత్రల కారణంగా, శ్రీరంగక్షేత్రంలోని రంగనాయకుల ఉత్సవమూర్తులను, సురక్షితమైనదిగా భావింపబడే తిరుమల క్షేత్రానికి తెచ్చి, ఈ మంటపంలో ఉంచి నిత్యాపూజ, నివేదనలు చేశారు. తరువాత విగ్రహాలను యథావిధిగా శ్రీరంగానికి తరలించారు. కేవలం శ్రీరంగనాథుని ఉత్సవ విగ్రహాలను ఉంచి పూజాదికాలు నిర్వహించటానికే ఈ మంటపాన్ని ''రంగనాథ యాదవ రాయలు'' అనే ఓ స్థానిక పాలకుడు నిర్మించాడు.

**"రంగ రంగ రంగపతి రంగనాథా - నీ**
**సింగారాలె తరచాయ శ్రీరంగనాథా...**
**వేంకటాద్రి మీద చేరి నన్ను కూడితివి**
**ఏవల చూచిన నీవే ఇటు రంగనాథా"**

ఈ మంటపంలో ''పెద్దశేషవాహనం''గా పిలువబడే ఏడు పడగల బంగారు శేష వాహనాన్ని కొద్ది దూరంగా, క్యూలోనుంచే దర్శించుకోవచ్చు. బ్రహ్మోత్సవాల మొదటి రోజున ఈ వాహనం మీదే స్వామివారు ఊరేగుతారు.

మల యప్ప స్వామివారు ఉభయ దేవేరుల సమేతంగా, సంవత్సరానికి రెండు మార్లు – దసరా బ్రహ్మోత్సవాల్లో ఒకసారి, వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఒకసారి – ఈ మండపంలో కొలువై ఉంటారు.

ఒ కప్పుడు ఈ మంటపంలోనే స్వామివారికి నిత్య కళ్యాణోత్సవాలు, వసంతోత్సవం, బ్రహ్మోత్సవం జరిగేవి. రాను రాను భక్తుల సంఖ్య పెరగడంతో, ప్రస్తుతం సంపంగి ప్రదక్షిణ మార్గంలో దక్షిణం వైపున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మంటపంలో కళ్యాణోత్సవం జరుగుతూ ఉంది.

ప్రస్తుతం ఈ మంటపంలో శ్రీవారి తిరుమంజన కార్యక్రమాలు, దేశాధిపతులు, రాష్ట్రాధిపతులకు వేదపండితుల ఆశీస్సులూ వారికి ప్రసాద వితరణలూ జరుగుతున్నాయి.

## తిరుమలరాయ మంటపం

రంగనాయక మంటపాన్ని ఆనుకుని దానికి పడమర దిక్కున, ధ్వజస్తంభ మంటపానికి దక్షిణ దిశగా, పది అడుగుల దూరంలో, రెండంచెలుగా ఈ మంటపం నిర్మింపబడింది. మొదటి అంచె ఎత్తైన వేదికగా, వేరొక అంచె నేలమట్టానికి సమంగా ఉండి, వేదికపై జరిగే ఉత్సవాలను భక్తులు దక్షిణ దిశగా కూర్చుని తిలకించటానికి వీలుగా నిర్మింపబడింది.

విజయనగర ప్రభువైన సాళువ నరసింహరాయలు శ్రీవారికి మొక్కు చెల్లింపుగా ''అన్నా ఊయల తిరునాళ్ళ'' అనే ఉత్సవాన్ని నిర్వహించే నిమిత్తం 1473వ సంవత్సరంలో ఎత్తైన వేదిక నిర్మించాడు. ''అన్నా'' అనే తమిళ పదానికి ''హంస'' అని అర్థం. తమిళ ''ఆణిమాసం'' (జూన్–జులైల మధ్య)లో జరుపబడే ఉత్సవం కాలాంతరంలో నిలిచిపోయింది.



అరవీటి వంశ చక్రవర్తి అయిన తిరుమల రాయలు 16వ శతాబ్దంలో ఈ మంటపాన్ని విస్తరింపచేసి, వార్షిక వసంతోత్సవం నిర్వహింపచేసేవాడు. అందువల్ల ఈ మంటపానికా పేరు వచ్చింది. కానీ ఆయన ఏర్పాటు చేసిన ఉత్సవం కూడా అర్ధాంతరంగానే నిలిచిపోయింది.

ప్రస్తుతం ఈ మంటపంలో ''కొలువు మేళం'' గా పిలవబడే ఓ సేవలో భాగంగా – మేళం, డోలు, నగారాలు – మ్రోగింపబడతాయి. సూర్యోదయవేళ 6.00 – 6.30 గంటల మధ్య జరిగే కొలువును ''హరికొలువు''గా, సూర్యాస్తమయ సమయంలో 5.30 – 6.00 గంటల మధ్య జరిగే కొలువును ''సందె కొలువు''గా పిలుస్తారు.

ప్రస్తుతం బ్రహ్మోత్సవాల సమయంలో ధ్వజారోహణ వేళ మాత్రమే స్వామివారు ఈ మంటపంలోకి వేంచేసి పూజా నివేదనలు అందుకుంటారు.

## రాజా తోడరమల్లు

తిరుమలరాయ మంటపంలో, ధ్వజస్తంభానికి సుమారు 10 అడుగుల దూరంలో స్వామివారికి అభిముఖంగా ముగ్గురి భక్తుల నిలువెత్తు రాగి ప్రతిమలు దర్శనమిస్తాయి. ఈ విగ్రహాల భుజాలపైనున్న పేర్లననుసరించి, తలపాగా ధరించి ఉన్న పురుషుడు ''లాలా ఖేమరాము''. మిగిలినవి ఆయన భార్య ''పితాబీబీ'', తల్లి ''మాతా మోహనదేవి''ల విగ్రహాలు. లాలా ఖేమరామునే ''రాజా తోడరమల్లు'' అని పిలుస్తారు. 17వ శతాబ్దంలో శ్రీవారి ఆలయానికి వచ్చే భక్తజన సందోహాన్ని చూసి, అప్పట్లో భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో అధికారంలో ఉన్న మహమ్మదీయుల మరియు బ్రిటిష్ వారి కళ్ళు ఆలయంపై పడ్డాయి. హైందవమతానికి ఆలవాలమైన ఈ దేవాలయాన్ని ధ్వంసం చేయాలనే ఉద్దేశ్యంతో మహమ్మదీయులు, అత్యధిక ఆదాయం వచ్చే ఈ ఆలయంపై ఆధిపత్యం సాధించటానికి బ్రిటిష్ వారు ఒకేసారి ఆలయంపైకి దండెత్తారు. శ్రీవారికి పరమభక్తుడూ, వారికోసం ప్రాణాలైనా అర్పించే తోడరమల్లుకు ఈ విషయం తెలిసి, మిత్రుల సహాయంతో వారిద్దరి (మహమ్మదీయులు, బ్రిటిషువారు) మధ్య చిచ్చుపెట్టి, ఒకరితో ఒకరు కలహించుకొనేటట్లు చేసి ఆలయాన్ని రక్షించాడు. అప్పుడు ఆయన ఆర్కాటు నవాబు సాదతుల్లాఖాన్ తరఫున కర్ణాటక ప్రాంతాన్ని పర్యవేక్షించేవాడు. ఓ మహమ్మదీయుని కొలువులో ఉంటూ, హిందూ దేవాలయాన్ని రక్షించి భావితరాల వారికి పదిలంగా అప్పగించిన ఆ భక్తశిఖామణికి జోహార్లు. స్వామివారంటే తనకున్న అపరిమిత భక్తికి చిహ్నంగా, నమస్కార భంగిమలో ఉన్న ఈ విగ్రహాలను ఆయనే ప్రతిష్ఠించుకున్నారు.

సంపంగి మార్గంలో ఉన్న మంటపంలోనూ, మూర్తులనూ

దర్శించుకొని ఇప్పుడు మనం ధ్వజస్తంభం మంటపంలోకి అడుగుపెట్టాం. ఈ మంటపం ద్వారానే వెండివాకిలి దాటి మనం విమాన ప్రదక్షిణ మార్గంలోకి ప్రవేశించాలి. ఇక్కడ తెలుసుకోవలసిన విషయాలు చాలానే ఉన్నాయి.

## ధ్వజస్తంభ మంటపం

ఇప్పుడు మనం – ప్రతిమా మంటపం (తూర్పు) వెండివాకిలి (పడమర), అద్దాల మంటపం (ఉత్తరం) తిరుమలరాయ మంటపాల (దక్షిణం) – మధ్యన ఉన్న చతురస్రాకార మంటపంలో ఉన్నాం. ఈ మంటపంలో ఆలయ ధ్వజస్తంభం ఉన్నది కావున దీన్ని ధ్వజస్తంభ మంటపం అంటారు. ఇక్కడినుంచి చూస్తే, మేలిమి బంగారు కాంతులతో మెరుస్తున్న ధ్వజస్తంభం వెండివాకిలికి తూర్పుదిక్కులో కనిపిస్తుంది. పైకి చూస్తే, ధ్వజస్తంభానికి ఎదురుగా ఏడు బంగారు కలశాలతో కూడిన మూడంతస్తుల వెండివాకిలి గోపురం కూడా చూడవచ్చు.

15వ శతాబ్దంలో నిర్మింపబడిన ఈ మంటప శిలాస్తంభాలపై, యోగనరసింహస్వామి, ఆంజనేయుని మూర్తులు, బకాసురవధ, శ్రీనివాస కళ్యాణం వంటి పౌరాణిక ఘట్టాలు ఎన్నెన్నో మనోహరంగా మలచబడ్డాయి. ఈ మంటపంలో బంగారు తొడుగుతో ఉన్న ధ్వజస్తంభం; దాన్ని ఆనుకుని తూర్పువైపున పెద్ద బలిపీఠం; దానికి ఈశాన్య దిక్కున చిన్న బలిపీఠంలా కనిపించే ''క్షేత్రపాలకశిల'' స్థితమై ఉన్నాయి. వీటన్నింటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## ధ్వజస్తంభం

వెండివాకిలికి ఎదురుగా, నగిషీలు చెక్కిన శిలాపీఠం మీద ఉన్నటువంటి ఎత్తైన కొయ్యస్తంభమే ధ్వజస్తంభం. శిలాపీఠం మరియు స్తంభం మొత్తానికి బంగారు పూత పూయబడిన రాగిరేకు తాపడం చేయబడి ఉంటుంది. ఈ స్తంభం మీద కూడా – గరుత్మంతుడు, హనుమంతుడు, శంఖుచక్రాలు, కాళీయమర్దన ఘట్టం – వంటి శిల్పాలు అత్యద్భుతంగా చెక్కబడి ఉన్నాయి.

ధ్వజం అంటే ''జెండా''. తమిళంలో ధ్వజస్తంభాన్ని ''కొడిక్కంబం'' అంటారు. ''కొడి'' అంటే ''కేతనము'' లేదా ''జెండా'' అని అర్థం.

ధ్వజారోహణం అంటే – స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని సూచిస్తూ, ధ్వజస్తంభంపై స్వామివారి పరమభక్తుడు మరియు వాహనమైన గరుడుని చిత్రపటం ఉన్న జెండా ఎగురవేయటం. అందుకే ధ్వజస్తంభాన్ని గరుడగంభంగా కూడా పిలుస్తారు.

''ధ్వజారోహణం'' ద్వారా ఆకాశమార్గాన అత్యంత వేగంగా పయనించగల గరుడునితో సమస్త లోకాల వారికీ బ్రహ్మోత్సవ సంబరాల నిమిత్తం లాంఛనప్రాయంగా ఆహ్వానం పలకబడుతుంది. ఈ ధ్వజస్తంభానికి మరో ప్రాముఖ్యత కూడా ఉంది. ఏ వ్యక్తులైనా, వస్తువులైనా, పూజాద్రవ్యాలైనా, ఆఖరుకు స్వామివారైనా, మందిరంలో నుంచి బయటికి వెళ్ళాలన్నా, బయటనుంచి లోనికి రావాలన్నా, ధ్వజస్తంభానికి



ప్రదక్షిణ చేస్తూ వెళ్ళాల్సిందే. సహస్రాబ్దాలుగా శ్రీవారి ముందు స్థిరచిత్తంతో నిలుచుని ఉండే ధ్వజస్తంభానికి ఆమాత్రం గౌరవ మర్యాదలు దక్కాల్సిందే మరి. చిత్తచాంచల్యంతో చరించే మనబోటి మానవులకో చక్కటి సందేశమిస్తుందీ అచంచలమైన ధ్వజస్తంభం.

పూర్వం విమాన ప్రదక్షిణ మార్గంలో నుండే ధ్వజస్తంభం, అక్కడ స్థలాభావం కారణం చేత ఐదారు శతాబ్దాల క్రితం ప్రస్తుతమున్న ప్రాంతానికి మార్చబడింది.

ఈ ధ్వజస్తంభం కర్రదైనందువల్ల దాన్ని మార్చుతూ ఉండాలి. ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం 1982వ సంవత్సరంలో కర్ణాటకలోని ''దండేలి'' అడవుల్లో లభించే టేకుచెట్టు మానుతో తయారైంది. ధ్వజస్తంభానికి ఉపయోగించే మాను – ఎలాంటి తొర్రలు, పగుళ్ళు, కొమ్మలు, వంకరలు లేకుండా, 75 అడుగుల పొడవుతో, దృఢంగా దీర్ఘకాలం మన్నేట్లు ఉండాలి. ఇన్ని సులక్షణాలు కలిగిన టేకుమానును వెతకడం, కొండమీదకు రవాణా చేయటం, కనీసం వందేళ్ళ వరకూ చెక్కు చెదరకుండా ఉంచే రసాయనిక ప్రక్రియ చేపట్టటం, అన్నిటినీ మించి అంత పొడవైన ఏకస్తంభాన్ని దానికంటే ఎంతో తక్కువ ఎత్తుతో నుండే పైకప్పు గల ఈ నిర్ణీత ప్రదేశంలో ప్రతిష్ఠించడం కోసం అప్పటి తి.తి.దే యాజమాన్యం అత్యంత వ్యయప్రయాసల కోర్చింది. గత 200 సంవత్సరాల తి.తి.దే రికార్డుల్లో ధ్వజస్తంభం మార్చిన సాంకేతికాంశాల ప్రస్తావనేమీ లేకపోవడం వల్ల, ఈ కార్యక్రమం మరింత జటిలం అయింది. అయితే ఆ శ్రీనివాసుని కృప, భక్తుల సహకారం, తి.తి.దే యాజమాన్యం – సిబ్బంది యొక్క అంకితభావంతో, అత్యంత క్లిష్టతరమైన ఈ ప్రక్రియ అవిఘ్నంగా జరిగి ఎట్టకేలకు విజయవంతమయింది.

తమిళ శాసనాలు ఎక్కువగా ఉండే తిరుమల ఆలయంలో ధ్వజస్తంభాన్ని మార్చేటప్పుడు, పాత ధ్వజస్తంభం యొక్క పద్మపీఠంపై ఓ తెలుగు శాసనం బయటపడింది. దాని ప్రకారం సుమారు 300 సంవత్సరాల క్రితం; పాత ధ్వజస్తంభాన్ని ''సిద్ధూరి రామాజీ మాదర్సు పంతులు'' అనే ఒక తెలుగు భక్తుడు సమర్పించాడు. ఆలయంలో తమిళుల ఆధిపత్యం ఎక్కువగా ఉండే ఆ రోజుల్లో, దేవాలయానికి ఆయువుపట్టైన ధ్వజస్తంభాన్ని ఓ తెలుగు భక్తుడు సమర్పించినట్లు తెలుసుకోవడం మన తెలుగు వారందరికీ కొద్దిగా ఉపశమనం కలిగిస్తుంది.

మయూరధ్వజుడనే మహారాజు త్యాగనిరతికీ, దానశీలతకు మెచ్చి శ్రీకృష్ణభగవానుడిచ్చిన వరాన్ననుసరించి, అతనికి ధ్వజస్తంభరూపంలో వైష్ణవాలయాల యందుండే భాగ్యం కలిగింది. శ్రీకృష్ణుని ఆనతి ప్రకారం ధ్వజస్తంభ దర్శనం, ప్రదక్షిణం పూర్తయిన తరువాతనే దైవదర్శనం చేసుకోవాలి. ఈనాటికీ అదే సాంప్రదాయం కొనసాగుతోంది.

## క్షేత్రపాలకశిల (లేదా గుండు)



ధ్వజస్తంభ మంటపంలో ఈశాన్యదిక్కున ఉన్న ఒకటిన్నర అడుగుల ఎత్తైన, చిన్నపాటి శిలాపీఠాన్ని ''క్షేత్రపాలకశిల'' లేదా ''క్షేత్రపాలక గుండు'' అంటారు. తిరుమల ఆలయానికి క్షేత్రపాలకుడు ''శివుడు'' అని ''సన్నిధిగొల్ల'' ప్రకరణంలో తెలుసుకున్నాం.

ఆ క్షేత్రపాలకునికి గుర్తుగా, మాడవీధుల్లోని ఈశాన్యదిక్కున జీవం ఉన్న ఓ పెద్దశిల ఉండేదట. అర్చకులు ఆలయ ద్వారాలు మూసేసి ఇళ్ళకెళుతూ తాళాల గుత్తిని ఆ శిలకు మూడుసార్లు తాకించేవారు. దాంతో ఆలయ ద్వారాలు మూసుకున్నట్టి సంకేతం అందుకున్న ఆ శిల గుడిచుట్టూ మాడవీధుల్లో తిరుగుతూ, ఆలయానికి కాపు కాస్తూ, అన్యులెవరినీ మాడవీధుల్లోకి ప్రవేశించనిచ్చేది కాదు. సుప్రభాత సమయంలో వాకిళ్ళు తెరిచేముందు మరలా ఆ తాళాల గుత్తిని శిలకు తాకిస్తే, ఆ శిల తన గమనాన్ని ఆపి, తిరిగి ఈశాన్యమూలలో స్థిరంగా ఉండేది. ఒకనాటి రాత్రి వేగంగా సంచరిస్తున్న ఆ శిల కిందపడి ఓ బాలుడు మరణించడంతో, అటువంటి దుర్ఘటన పునరావృతం కాకుండా ఆ శిలను ఆలయానికి కొద్దిదూరంలో ఉన్న గోగర్భ తీర్థం వద్దకు తరలించారు. అయితే ఆ శిలలోని చిన్న భాగాన్ని మాత్రం, తరలించబడిన క్షేత్రపాలక శిలకు గుర్తుగా, ధ్వజస్తంభ మంటపంలోని ఈశాన్య దిక్కున ఉంచారు.

ఆలయం బీగాల గుత్తిని రెండు పూటలా ఈ శిలకు తాకించి, నమస్కరించే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.

ప్రతి మహాశివరాత్రి పర్వదినాన అర్చకులూ, ఆలయాధికారులూ, భక్తులూ ఛత్రచామర మంగళవాద్యాలతో గోగర్భతీర్థానికి వెళ్ళి; నమకం చమకంతో రుద్రాభిషేకం చేసి; ఆ గుండుకు వెండి నామాలూ (ఊర్ధ్వపుండ్రాలు), కళ్ళూ అతికించి, పుష్పాలంకరణానంతరం ధూప–దీప–అర్చన–నివేదనాదులు కావించి; భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారు. విష్ణుమూర్తికి సాక్షాత్తు శివుడు క్షేత్రపాలకుడుగా ఉండటం; ప్రపంచ ప్రసిద్ధ వైష్ణవాలయంలో శివరాత్రి ఉత్సవం ఘనంగా నిర్వహించటం;

శివుణ్ణి ఊర్ధ్వపుండ్రంతో అలంకరించటం చూస్తుంటే, ''శివాయ విష్ణురూపాయ – విష్ణురూపాయ శివయే'' అన్న తత్వం సంపూర్ణంగా అవగతమవుతుంది.

## బలిపీఠం



ధ్వజస్తంభాన్నానుకుని, తూర్పుదిక్కున ఉన్న ఓ ఎత్తైన పీఠమే ''బలిపీఠం''. ఇది కూడా బంగారు పూత పూసిన రాగిరేకు తాపడంతో తళతళా మెరుస్తూ ఉంటుంది. శ్రీవారికీ, ఇతర ప్రధాన పరివార దేవతలకూ, ద్వారపాలకులకూ ప్రసాదాలను నివేదించిన తరువాత; విమాన ప్రదక్షిణ మార్గంలోని అష్టదిక్కుల్లో ఉన్న బలిపీఠాలపై ఆయా దిగ్దేవతలకు మంత్రపూర్వకంగా బలిని వేస్తారు. ఇలా సమర్పిస్తూ చివరగా వెండివాకిలి వద్దకు వచ్చి; మిగిలిన అన్నాన్ని, అంటే బలిని ధ్వజస్తంభం ముందున్న ఈ ఎత్తైన బలిపీఠంపై ఉంచుతారు. ఈ బల్యన్నాన్ని రాత్రింబవళ్ళు సంచరించే భూత–ప్రేత–యక్ష–పిశాచాది గణాలూ, క్రిమికీటకాదులు ఆహారంగా భుజిస్తాయని ప్రతీతి.

శ్రీకృష్ణుని ఆనతి ప్రకారం మనం ధ్వజస్తంభానికి భక్తిపూర్వక నమస్కారాలు సమర్పించుకున్నాం కాబట్టి ఇక శీఘ్రంగా వెండివాకిలి దాటి, బంగారు వాకిళ్ళలో ఉన్న శ్రీవారిని దర్శించుకోవచ్చు.

దీనితో వెండి వాకిలి లోనికి ప్రవేశించే ముందు, సంపంగి ప్రదక్షిణంలో చూడవలసిన ముఖ్య విశేషాలన్నీ పూర్తయ్యాయి.

శ్రీవారి దర్శనానంతరం ప్రసాదం స్వీకరించిన తరువాత, ఓ ఊచల పంజరంలో ఉన్న నల్లటి బావిని మనందరం చూసే ఉంటాం. దాని విశేషాలూ, శ్రీవారి దర్శనానంతరం, సంపంగి ప్రదక్షిణ మార్గంలో చూడవలసిన మరికొన్ని విశేషాలను ఈపై చెప్పుకుందాం.

సంపంగి ప్రదక్షిణ మార్గంలో శ్రీవారి దర్శనానికి ముందు చూడగలిగే విశేషాలన్నింటినీ దాదాపుగా చెప్పుకున్నాం.

ఇదే ప్రదక్షిణ మార్గంలో, దర్శనానంతరం చూడగలిగేవి, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే చూడగలిగేవి, అసలు దర్శించలేనివి ఎన్నో విశేషాలున్నాయి. వాటన్నింటి గురించి ఇపుడు తెలుసుకుందాం.

## నాలుగు కాళ్ళ మంటపాలు

1470 వ సంవత్సరంలో విజయనగర చక్రవర్తి సాళువ నరసింహరాయలు – తన భార్య, ఇద్దరు కుమారులు, తన పేరున – నాలుగు కాళ్ళ మంటపాలుగా పిలువబడే నాలుగు మంటపాలను సంపంగి ప్రదక్షిణ మార్గానికి నాలుగు మూలల్లో అంటే – ఆగ్నేయ, నైఋతి, వాయువ్య, ఈశాన్యాల్లో – కళాత్మకంగా నిర్మించాడు. జనసమ్మర్ధం అంతగా లేని కాలంలో స్వామివారి ఉత్సవ–ఊరేగింపులన్నీ సంపంగి ప్రదక్షిణ మార్గం నందే జరిగేవి. ఆ సమయంలో, ఈ మార్గంలోని నాలుగు మూలల్లో ఉన్న మండపాల్లో స్వామివారు వేంచేసి పూజాదికాలు అందుకునేవారు. కళ్యాణోత్సవాలు సైతం వీటిలోనే నిర్వహించేవారు. ఎత్తైన ఈ మంటపాల్లో జరిగే పూజలను భక్తులు అన్నివైపులనుండీ వీక్షించవచ్చు. కళ్యాణోత్సవ సమయాల్లో ఈ మండపాల ఉపరితలం నుంచి మంగళవాద్యాలను నగారాల వలె మ్రోగించేవారు.



కాలక్రమేణా భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో, శ్రీవారి ఉత్సవాలను ఇతర మంటపాల్లోనూ, ఊరేగింపులను వెడల్పాటి మాడవీధుల్లోనూ నిర్వహించసాగారు.

ప్రస్తుతం ఆగ్నేయ, వాయువ్య, ఈశాన్య మూలల్లోని నాలుగు కాళ్ళ మంటపాలు మూడు మాత్రం మిగిలి ఉండగా, నాల్గవది తరువాతి కాలంలో చేపట్టిన విస్తరింపు కట్టడాల్లో విలీనమైపోయింది. మిగిలిన మూడింటిలో కూడా కేవలం

ఆగ్నేయ మూలలో ఉన్న మంటపాన్ని మాత్రమే ఇప్పుడు మనం చూడగలం. ఇతర దిక్కుల్లో ఉన్న మంటపాలను చూడటానికి భక్తులకు ప్రవేశం లేదు.

## శ్రీవేంకటరమణుని కళ్యాణ మంటపం



నీరజాక్షుని నిత్యకళ్యాణోత్సవం కోసం సంపంగి ప్రదక్షిణంలోని దక్షిణ మార్గంలో నూతనంగా, సృజనాత్మకత ఉట్టిపడేటటువంటి కళాఖండాలతో, తూర్పుముఖంగా ఈ కళ్యాణ మంటపం నిర్మించబడింది. ఇందులో ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకు మలయప్ప స్వామివారికీ ఉభయ నాంచారులకు కళ్యాణోత్సవం ఘనంగా జరుగుతుంది. విశాలమైన ప్రాంగణంలో వందలాది భక్తులు కూర్చుని కళ్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించవచ్చు.

ప్రతి సోమవారం జరిగే విశేషపూజ; పవిత్రోత్సవం, పుష్పయాగం, జ్యేష్ఠాభిషేకం వంటి సంవత్సరోత్సవాలు కూడా ఈ మంటపంలోనే జరపబడతాయి.

మొదట్లో విమాన ప్రదక్షిణ మార్గపు నైఋతి దిక్కులోని కళ్యాణ మంటపంలో, తరువాత సంపంగి ప్రాకారంలోని రంగనాయక మంటపంలో జరుపబడే కళ్యాణోత్సవాలు ప్రస్తుతం విశాలమైన ఈ కళ్యాణ మంటపంలో జరుగుతున్నాయి. కళ్యాణోత్సవ ఆర్జితసేవలో పాల్గొనే భక్తులు మాత్రమే ఈ కళ్యాణ మంటపాన్ని కాంచగలరు.

## ఉగ్రాణం

"ఉగ్రాణం"గా పిలువబడే సరుకుల గిడ్డంగులను మనం తి.తి.దే ఆధ్వర్యంలోని అన్ని దేవాలయాల్లోనూ చూస్తాం. వీటిలో ప్రసాదాల తయారీకి ఉపయోగించే వంట సామగ్రి మరియు పూజాద్రవ్యాలు నిలువ ఉంచుతారు. సంపంగి ప్రదక్షిణ మార్గంలోని వాయువ్య మూలలో ఉన్న ఈ ఉగ్రాణంలో స్వామివారి అభిషేకాలకు, అర్చనలకు ఉపయోగించే పసుపు, చందనం, కర్పూరం, నెయ్యి, సుగంధద్రవ్యాలు వంటివాటిని నిలవ చేస్తారు.

ఇవే కాకుండా, సంపంగి ప్రదక్షిణ మార్గానికి పడమటి దిక్కున ఉన్న కొన్ని మంటపాలను కూడా – సెనగపిండి, బెల్లం, మినప్పప్పు, పంచదార, బియ్యం వంటి సరుకులు; పిండి కలుపుకోవడం కోసం ఉపయోగించే పెద్ద పెద్ద మిక్సీలు – ఉంచటానికి ఉపయోగిస్తారు. ప్రసాదాల తయారీ నిమిత్తం వాడే వంట దినుసులు బాహ్యకుడ్యం వెనుక నుండి కన్వేయర్ బెల్టుల ద్వారా సంపంగి ప్రదక్షిణం పడమరదిశగా నున్న గిడ్డంగుల్లోనికి చేర్చబడతాయి. వీటివద్దకు కూడా భక్తులకు ప్రవేశం లేదు.

**(ఇంకా ఉంది)**

## జరత్కారువు కథ



పూర్వకాలంలో జరత్కారువు అనే మహర్షి ఉండేవాడు. ఆయన మహా తపస్వి. అంతేగాక బ్రహ్మచారి. ఆయన ఒకరోజు తీర్థయాత్రలు చేస్తూ మార్గమధ్యంలో తలక్రిందులుగా వ్రేలాడుతున్న వారిని చూచి మీరెవరు? అని అడగ్గా, వారు నాయనా మేము నీ పూర్వీకులము. నీవు వివాహం చేసుకోకపోవడం వల్ల సంతానాభివృద్ధి లేకపోవడం వల్ల మేము తరించక ఇలా వ్రేలాడుతున్నాం అని చెప్పి, నీవు వెంటనే వివాహం చేసుకుని సత్సంతానాన్ని కని మమ్ములను తరింపచేయి అని చెప్పగానే జరత్కారువు వివాహం చేసుకుని పితృదేవతలను తృప్తి పరిచాడు. అంతటి మాహాత్మ్యం కలిగినది ఈ వివాహం (గృహస్థాశ్రమం). "ఆచార్యాయ ప్రియంధన మాహృత్య ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః" అని వేదం చెబుతోంది.

# మహిమాన్వితం – మాఘస్నాన మహిమ

: చింతలపాటి శివశంకర శాస్త్రి

'మఖ' నక్షత్రంతో కూడిన పూర్ణిమ కాబట్టి మాఘమాసం అంటారు. శ్రీలక్ష్మీ నారాయణులకు, ఉమామహేశ్వరులకు ఎంతో ప్రీతిపాత్రమైనది. శ్రీపంచమి, రథసప్తమి, భీష్మాష్టమి, మహాశివరాత్రి మొదలగు పర్వదినాలతో కూడుకున్నది మాఘమాసం.



మాఘం – మ+అఘం = 'అఘం' అనే పదానికి సంస్కృతం నందు పాపము అని అర్థము. అంటే పాపాలను నశింపచేసేది అనే అర్థాన్ని పండితుల అభిప్రాయం. 'మాఘం' అంటే 'యజ్ఞం'అని మరో అర్థము. అందువల్లనే యజ్ఞ యాగాది క్రతువులు ఈ మాఘంలో ఎక్కువగా నిర్వహిస్తుంటారు. ఇంద్రునికి 'మఘవుడు' అని మరో పేరు. యజ్ఞాలకు అధిష్ఠాన దేవత. ఈ మఘవుని ఆధిపత్యాన జరిగే మాసం మాఘమాసం. లయకారునికి అత్యంత ఇష్టమైన ఈ మాసంలో స్నాన దాన జపాదులు, అర్చనల ద్వారా పవిత్ర జీవితం గడిపి సార్థకం చేసుకోవాలి.

మాఘమాసంలో ప్రత్యూష కాల స్నానానికి ఎంతో విశిష్టత ఉంది. బ్రాహ్మీ ముహూర్తంలో స్నానం చేసినంత మాత్రాన పాపాలన్నీ తొలగిపోతాయి. సూర్యుని మకరరాశి ప్రవేశంలో స్నానాదులు ఆచరించుట ముఖ్యం.

**"అస్మిన్ హి భారతే వర్షే కర్మభూమౌ విశేషతః**
**అమాఘ స్నాయినాం నృణాం నిష్ఫలం జన్మకీర్తితం"**

తపోభూమి, కర్మభూమియైన భారతదేశంలో జన్మించి కూడా మాఘస్నానం చేయనివారి జన్మ వృథా. ఈ మాసంలో చన్నీటి స్నానమాచరించువారు స్వర్గాన్ని చేరతారని మాఘపురాణంలో చెప్పబడింది.నదీస్నానంతోపంచమహాపాతకాలుఅంతరిస్తాయి. నదీస్నానం లభ్యం కానప్పుడు చెరువులు, నూతుల యందు స్నానమాచరించాలి.ఆధునికశాస్త్రవేత్తలుసైతంసూర్యోదయానికి ముందు చేసే స్నానాలు చాలా ఆరోగ్యవంతమైనవని, వేగంగా ప్రవహించే నీళ్ళతో చేసే స్నానాలు శ్రేష్ఠమని పేర్కొంటున్నారు. చలి ఎక్కువగా ఉంటుందని అగ్నిని ఆశ్రయించరాదు. స్నానానికి ముందు "అన్ని పాపాలు తొలగిపోవా"లని సంకల్పం చెప్పుకుని "గంగేచ యమునేచైవ కృష్ణ గోదావరి సరస్వతి నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధింకురు" అనే శ్లోకం చెప్పుకొని చేయాలి. ఎందువలననగా మాఘమాసం రాగానే జలాశయాలన్నీ "మీరు త్రికరణములతో చేసిన పాపాలన్నిటినీ పోగొట్టి, మిమ్ములను పవిత్రులము చేస్తాము. ఈ జలములతో స్నానమాచరించండి" అని ఘోషిస్తుంటాయి. మాఘమాసంలో ఉషఃకాలంలో సూర్యకిరణాలతో వేడెక్కిన నదీ ప్రవాహమందు స్నానం చేసేవారు పితృ మాతృ వంశములకు చెందిన ఏడు తరాల వారిని ఉద్ధరించడమే కాకుండా, వారు దివ్యదేహాలను ధరించి స్వర్గాన్ని పొందుతారు.

**"మాధవాంఘ్రి యుగం ధ్యాయన్ యః స్నాతి సుర పూజితః"**

మాధవుని పాదపద్మాలను ధ్యానిస్తూ స్నానం చేసినవారు దేవతల చేత కూడా గౌరవింపబడతారు. ఎందువలననగా "యేన యేన శరీరేణ యద్యత్ కర్మ కరోతియః తేన తేన శరీరేణ తత్తత్ ఫల ముపశ్నుతే" – ఎవరు ఏ పనిని చేయుచుందురో దానిని బట్టే ఫలితమును పొందుతారు.

ఏ మాసంలో అయినా స్నాన ఫలితము – ఆకాశంలో నక్షత్రాలు ఉన్నప్పుడు ఉత్తమం. నక్షత్రాలు అదృశ్యమై

సూర్యోదయము కాకముందు స్నానం మధ్యమం. సూర్యోదయం తర్వాత స్నానం అధమం అన్నారు. భక్తిలేని స్నానం గజస్నానం అంటారు. చేసే స్నానం చిత్తశుద్ధితో ఉండాలి. మొక్కుబడిగా ఉండకూడదు. కార్తీకంలో చంద్రకిరణాల శక్తి, మాఘంలో సూర్యుని లేతకిరణాల నుండి వచ్చే శక్తి జలంలో సంపూర్ణంగా ఉన్నప్పుడే చేయాలి. ఈ మాఘమాసమంతా స్నానం చేయలేకపోయినా కనీసం మాఘపూర్ణిమ సంకల్పస్నానం ప్రయాగస్నాన ఫలితమిస్తుంది.

**"మాఘ మాసే రటం త్యాపః కించి దభ్యుదితే రవౌ**
**బ్రహ్మఘ్నం వా సురాపం వా కంపంతం తం పునీమహే"**

మాఘమాస నిరంతర స్నానంతో పౌండరీక ఫలం కలుగుతుంది. స్నానానంతరం మడిబట్టలు కట్టుకుని, విభూతిని రాసుకుని, కుంకుమ ధరించి దోసిళ్ళతో నీటిని తీసుకుని సూర్యుని ఎదురుగా నిలబడి "సవిత్రే ప్రసవిత్రే పరంధామ జలే మమ త్వత్తేజసా పరిభ్రష్టం పాపం యాతు సహస్రధాః" అంటూ పై శ్లోకాన్ని స్మరించి అర్ఘ్యమివ్వాలి.

దానాలు, వ్రతాలు, యజ్ఞయాగాదులు చేసేవారికన్నా మాఘమాసం చలిలో స్నానం చేసే భక్తులంటేనే శివునికి పరమప్రీతి. మహామాఘి నాడు గంగా-యమున సంగమ ప్రదేశంలో స్నానం చేయడం మహాపాతక నివారణం. ఏ నీటి వసతులైనా మాఘమాసంలో అవన్నీ గంగా జలంతో సమానమైనా - ప్రయాగ రాజము నందు చేసే స్నానాదులు ఉత్తమమైనవి. శీఘ్ర ఫలితాలనిస్తాయి. సముద్ర, నదీతీర ప్రాంతంలో ఉన్న మట్టిని శరీరానికి రాసుకుని సూర్యునికి నమస్కరించి స్నానమాచరించాలి. శరీరానికి నూనె రాయకూడదు. సముద్రపు నీటితో ఆచమనం చేయకూడదు. ఆచమనం విడిగా చేసి, సముద్ర స్నానమాచరించాలి. అశౌచం ఉన్నప్పుడు సముద్రాన్ని తాకరాదు. పౌర్ణమి ఘడియలు ఉండగా ఏ సమయంలోనైనా స్నానం చేయవచ్చు. సూర్యాస్తమయం తర్వాత పనికిరాదు. స్నానానంతరం "ఓ జగన్నాథా! నాకు ఈ సముద్ర జలమునందు ఉత్తమస్నానం ప్రాప్తించనీ, నీ తేజస్సుతో నా పాపం నశించనీ, నేను చేసే మాఘస్నానం పరిపూర్ణం చేయుమని" ప్రత్యక్ష దైవమైన దివాకరుని ప్రార్థిస్తూ అర్ఘ్యమివ్వాలి. అనంతరం బ్రాహ్మణులకు శక్త్యానుసారం దానాలు చేయాలి.

మాఘమాసంలో దానాలు చాలా పవిత్రమైనవి. మాఘపౌర్ణమి నాడు బ్రహ్మ వైవర్త పురాణాన్ని దానం చేయడం శ్రేష్ఠం. ఈ నెలలో తిలలను దానమిస్తే ఇచ్చిన వారికి నరకలోక ప్రాప్తి ఉండదు. సాలగ్రామదానం, వేణీదానం ప్రత్యేకంగా పేర్కొనదగినవి. పౌర్ణమి నాడు తిలహోమం, తిలభక్షణం చేయాలంటారు. దుప్పట్లు, తైలం, వస్త్రాలు, చెప్పులు, గొడుగు, నెయ్యి, బంగారం, అన్నదానాలు చేయడం వల్ల నవగ్రహ అనుగ్రహం లభిస్తుంది. మాఘపౌర్ణమి నాటి సువాసినీ పూజ వల్ల రాబోయే ఏడు జన్మల సౌభాగ్యం వర్ధిల్లుతుంది. ఈనాడు గురువు ఉపదేశం, మంత్రోపదేశం చక్కటి ఫలితాలనిస్తాయి.

మహామాఘి పర్వదినాన జగన్మాత పార్వతిగా హిమవంతునికి జన్మించి శివునికై తపస్సు ప్రారంభించింది. అందువలన పౌర్ణమి నాడు ఉపవసించి, అమ్మవారిని ఆరాధించి పాయసం నివేదన చేస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని పద్మపురాణం తెలియచేస్తున్నది.

ఎంతటి పాపాత్ముడైనా, అధర్మవర్తనుడైనా మాఘమాస స్నాన ఫలితంతో ఆ పాపాలు పోగొట్టుకుని పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందని తెలిపే ఒక కథ.

ప్రాచీనకాలంలో నర్మదా నదీ తీరాన సువ్రతుడు అనే బ్రాహ్మణుడు నివసిస్తుండేవాడు. ఆయన వేదాలన్నీ కంఠస్థంగావించి, ధర్మశాస్త్రములను క్షుణ్ణంగా ఎరిగినవాడు. పురాణాలను అధ్యయనం చేసిన మేధావి. సకల శాస్త్ర పారంగతుడు. అంతటి విజ్ఞాన వంతుడైనప్పటికీ తన జ్ఞానాన్ని ధర్మకార్యములందు ఉపయోగించక జీవితాంతం కేవలం ధన సంపాదన యందే ఆసక్తి కనబరచి చివరకు నీచ దానాలు తీసుకోవడానికి కూడా సంకోచించేవాడు కాదు. నిత్య నైమిత్తిక కర్మలను విడిచి పెట్టాడు. కడుపునిండా తినేవాడు కాదు. కుటుంబ పోషణను పట్టించుకునేవాడు కాదు. శరీర ధర్మాన్ననుసరించి వృద్ధాప్యం చేరిన తరుణంలో నేను జీవితమంతా ధన సంపాదనకే ఉపయోగించి, పరలోకం గురించి ఆలోచించక ధర్మకార్యాలలో పాల్గొనలేదు. ఇప్పుడు నన్నుద్ధరించే వారెవరు? అని చింతించి పశ్చాత్తాప పడ్డాడు. ఇలా ఉండగా ఒకనాడు దొంగలు పడి ధనమంతా దోచుకుపోవడంతో బాధపడుతుండగా అతనికి ఒక శ్లోకపంక్తి - మాఘే నిమగ్నాః సవితే సుశీతే విముక్త పాపాస్త్రి దివం ప్రయాంతి - మాఘ మాసంలో చలిలో మంచుతో నిండి ఉన్న నీటిలో ఒక మునక వేసి స్నానం చేసినవారు స్వర్గలోకానికి చేరుతారు అన్న విషయం స్మరణకు వచ్చి 'గతం గతః' అని గతాన్ని మరచిపోయి భగవంతుని ధ్యానిస్తూ నదీస్నానం చేయ సంకల్పించి నర్మదా నదీతీరానికి వెళ్ళి సంకల్పం చెప్పుకుంటూ వరుసగా ఎనిమిది రోజులు స్నానం చేసి, తొమ్మిదవ రోజు ప్రాతః కాలాన స్నానమాచరిస్తుండగా ఆ చలికి తట్టుకోలేక తుదిశ్వాస విడిచాడు. జీవితమంతా సత్కార్యములు చేయకపోయినా చివరిదశలో విష్ణువును స్మరించుకుంటూ మాఘస్నానం చేయడం చేత అక్కడికి వచ్చిన శివ - విష్ణుదూతలు సువ్రతుని దివ్యవిమానంలో ఊర్ధ్వలోకాలకు తీసుకువెళ్ళారు.

మహిమాన్వితమైన మాఘమాసం ఎంతో విశిష్టమైనది. ఈ మాసంలో శక్త్యానుసారం దానధర్మాలొనరించి, మాఘస్నాన మాచరించి భగవంతుని అనుగ్రహం పొందుదాము.

# నవవిధ భక్తిమార్గాలు

– డా|| కూర్మాచలం శంకరస్వామి



## పాదసేవనం

నవవిధ భక్తి మార్గాలలో పాదసేవనం ఒకటి. దీనికి ప్రతీక లక్ష్మీదేవి. లక్ష్మీదేవి నిత్యానపాయిని. అనగా ఎన్నడూ శ్రీచరణములు విడువకుండా సేవ చేసి తరించిన ధన్యురాలు.

**"హరికిన్ బట్టపుదేవి పున్నెముల ప్రోవర్థంబు పెన్నిక్క చం**
**దురు తోబుట్టువు భారతి గిరి సుతల్ తో నాడు పుబోణి తాం తా**
**మరలందుండెడి ముద్దరాలు జగముల్ మన్నించు నిల్లాలు భా**
**సురతన్ లేములు వావుతల్లి సిరి యిచ్చు నిత్య కళ్యాణముల్"**

శ్రీహరికి పట్టపురాణి యైన శ్రీదేవి పుణ్యాల దీవి. సిరిసంపదలిచ్చే పెన్నిధి. చంద్రుని సహోదరి. వాణీ శర్వాణిలతో క్రీడించు పూబోణి. అరవింద మందిర ముల్లోకములలో పూజనీయురాలు. వెలుగు వీక్షణములతో దారిద్ర్యాన్ని తొలగించే తల్లియైన శ్రీమహాలక్ష్మి మాకు నిత్య కళ్యాణములను అనుగ్రహించుగాక అని పోతన వర్ణించిన మహాతల్లి లక్ష్మీదేవి. బ్రహ్మాది దేవతల చేతను నిత్యమూ పూజింపబడే చల్లనితల్లి. కల్పవల్లియైన లక్ష్మీదేవి నిరంతరం శ్రీవారి పాదపూజ చేస్తూ "దొరకునా ఇటువంటి సేవ, నీ పద రాజీవములకు చేయు సేవ" యని ఆ శ్రీహరి పాదాల దగ్గరనే ఉండి అతనిని సేవించడం వలన స్వామివారి వక్షస్థలంలో స్థానం సంపాదించిన మహా ఇల్లాలు. భృగు మహర్షి తపో బల గర్వముతో శ్రీహరి వక్షస్థలాన్ని తన కాలితో తన్నినప్పుడు ఎంతగానో కుమిలి కుమిలి ఏడ్చింది. తనకు జరిగిన అవమానాన్ని భరించలేక అలిగి భూలోకములో గల అలకాపురికి వెళ్ళగా సాక్షాత్ వైకుంఠవాసుణ్ణే ఆమెను వెదుకుతూ భూలోకానికి రప్పించిన గొప్ప పాదపూజిత లక్ష్మీదేవి. చేసిన నిత్య పాదపూజా ఫలమేనని మునిజనులతో కీర్తించబడిన తల్లి లక్ష్మీదేవి. ధనలక్ష్మి, వరలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, సంతానలక్ష్మి, ధైర్యలక్ష్మి, ధాన్యలక్ష్మి యని భూలోక వాసులచే పూజలందుకోవడం ఆ అనాథ రక్షకుని పాదసేవా ఫలితమని వేదాలు పేర్కొంటున్నాయి.

పాల సముద్రము నుండి పుట్టిన సముద్రరాజ తనయగా, చంద్రసహోదరిగా కీర్తించబడిన లక్ష్మీదేవి శ్రీహరి

ధర్మ సంస్థాపనార్థం భూలోకంలో అవతరించినప్పుడు తాను కూడా ఆ శ్రీహరితో పాటు అవతరించి అతని పాదసేవ చేసిన పుణ్యచరిత లక్ష్మీదేవి. అందుకే ఆమె నిత్యానపాయిని అయింది.

"వందే పద్మాకరాం ప్రసన్న వదనాం
సౌభాగ్యదాం భాగ్యదాం
హస్తాభ్యా మభయ ప్రదాం
మణిగణై ర్నానా విధైర్భూషితాం"

లక్ష్మీదేవి నిత్యం ప్రసన్నవదనంతో ఉంటూ భక్తుల అభీష్టాలను నెరవేర్చుతూ బ్రహ్మాది దేవతల పూజలందుకోవడం సరసిజ నయనాలతో, సరోజ హస్తాలతో, గంధమాల్య శోభలతో, భగవానుడైన ఆ శ్రీహరినే తన ప్రాణనాథునిగా పొందిన మనోజ్ఞ. ముల్లోకాలలో ఉన్న ప్రాణికోటిని రక్షించే హిరణ్మయి లక్ష్మీదేవి. కనుల ముందు నివసించే కామాక్షియై కోప తాపాలను దూరం చేస్తుంది. లోకమాతగా కరుణనూ ప్రదర్శిస్తూ, దుర్గాదేవియై దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించే ధర్మమూర్తి లక్ష్మీదేవి. పద్మాలనే మాలగా ధరించి, పద్మగంధం విశ్వమందు వెదజల్లుతూ ప్రసన్నవదనంతో దీనులను రక్షించే తల్లి లక్ష్మీదేవి. ఇంతటి ఘనత సాధించుటకు ప్రధాన కారణం ఆ తల్లి చేసిన నిరంతర పాదసేవా భాగ్యమే.

"విష్ణుపత్నీం ప్రసన్నాక్షీం నారాయణ సమాశ్రితాం
దారిద్ర్య ధ్వంసినీం దేవీం సర్వోపద్రవవారిణీం
నవదుర్గాం మహాకాళీం బ్రహ్మ విష్ణు శివాత్మికాం
త్రికాలజ్ఞాన సంపన్నాం నమామి భువనేశ్వరీం"
లక్ష్మీం క్షీరసముద్రరాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం
దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం
శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరాం
త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియాం
మాతర్నమామి కమలే కమలాయతాక్షి
శ్రీవిష్ణు హృత్కమలవాసిని విశ్వమాతః
క్షీరోదజే కమలకోమల గర్భగౌరీ
లక్ష్మీ ప్రసీద సతతం నమతాం శరణ్యే

అని లక్ష్మీ అష్టోత్తర శతనామావళిలో పేర్కొన్నట్లుగా విష్ణువు భార్యయైన లక్ష్మీదేవి విశ్వమాతగా, నవదుర్గగా, దారిద్ర్యాన్ని తొలగించే దేవతగా, త్రికాలజ్ఞాన సంపన్నురాలిగా, శ్రీవిష్ణువు హృత్కమల వాసిగా ప్రసిద్ధికెక్కడానికి ప్రధాన కారణం ఆమె చేసిన పాదసేవ భక్తి మార్గమే.

అంతే కాదు, లక్ష్మీదేవి ఎప్పుడూ శ్రీహరి చరణారవిందముల మకరంద మత్తులో ఉంటూ ఉండేది. శ్రీమహావిష్ణువు గజేంద్రుణ్ణి మొసలి బారినుండి రక్షించేందుకు పరుగు పరుగున వెళ్తున్న సమయంలో తాను కూడా పరుగు పరుగున వెళ్ళింది. భక్తాగ్రేసరుడైన ప్రహ్లాదుణ్ణి రక్షించి హిరణ్యకశిపుని శిక్షించుటకు విష్ణుమూర్తి నరసింహావతారము ధరించినప్పుడు ఉగ్రనారసింహుని ప్రార్థించి అతణ్ణి శాంతపరిచి లక్ష్మీ నృసింహునిగా కీర్తి పొందుటకు తాను భూలోకంలో అవతరించింది. విష్ణుమూర్తి త్రేతాయుగంలో శ్రీరామచంద్రమూర్తిగా అవతరిస్తే తాను సీతగా అవతరించి రామునితో పాటు తాను అరణ్యానికేగి అతని పాదసేవ చేసింది. రావణుడు అపహరించి లంకలోని అశోకవనంలో బంధించగా, ఎల్లప్పుడూ రామనామ స్మరణతో, అతని పాదస్పర్శ జ్ఞాపకాలతో కాలం గడిపింది. చివరకు శీల పరీక్ష కోసం రాముడు అగ్నిలో దూకమన్నా మరొకటి ఆలోచించకుండా అగ్నిలో దూకి తన శీలాన్ని నిరూపించుకున్న మహా ఇల్లాలుగా మిగలడానికి, లోకుల చేత పూజింపబడడానికి కారణం ఆమె చేసిన పాదసేవా భక్తియే.

ద్వాపరయుగంలో విష్ణువు కృష్ణావతారం దాల్చినప్పుడు లక్ష్మీదేవి రుక్మిణీదేవిగా అవతరించి శ్రీకృష్ణ పాదారవిందములను ఎన్నడూ వీడకుండా పట్టపురాణిగా మన్ననలు పొందింది. శ్రీకృష్ణుని ఇష్టసఖియైన సత్యభామ అహంకారంతో శ్రీకృష్ణపరమాత్మని నారదునికి దానం చేయగా తులాభారంలో ఎంత సువర్ణం వేసినా శ్రీకృష్ణుడు తూగకపోవడంతో చింతిస్తున్న సత్యభామామణులకు ఓదార్పు కలిగిస్తూ రుక్మిణీదేవి భక్తితో సమర్పించిన తులసీదళంతో శ్రీకృష్ణుని దాసత్వం బాపిన ధర్మశీల రుక్మిణీ అవతారంలో ఉన్న లక్ష్మీదేవి. ఇలా ఎల్లప్పుడూ శ్రీహరి పాదపద్మముల యందు మనసు తనువు నిలిపి అతణ్ణి ఆరాధించడం వల్లనే లక్ష్మీదేవి లోకపావనిగా, అష్టలక్ష్మిగా, అనంత ఫలదాయినిగా కీర్తి పొందుటకు ప్రధాన కారణం ఆమె చేసిన పాదపూజయే నని అష్టాదశ పురాణాలలో ఘోషిస్తున్నాయి.

"ప్రాతః కాలే పఠే నిత్యం సర్వదుఃఖోపశాంతయే
పఠంస్తు చింతయేద్దేవం సర్వాభరణ భూషితాం"
"తన కులధర్మమున్ విడిచి దానవవైరి పదారవిందముల్
పనివడి సేవసేసి పరిపాకము వొందక యెవ్వడేని జ
చ్చినమఱు నేననైన నది సిద్ధి వహించు దదీయ సేవ బా
సినఁ గులధర్మ గౌరవము సిద్ధి వహించునె యెన్ని మేనులన్"

ఏ మానవుడైతే తన కులధర్మమును విడిచి, భక్తి శ్రద్ధలతో శ్రీహరి పాదసేవ చేసి పరిపక్వత చెందక ముందే మరణించునో అట్టివాని సాధన మరుజన్మలోనైనా పరిపక్వమై సిద్ధించును, కాని అట్టి సేవను విడిచి కేవలం కుల ధర్మాచరణ చేయడం ద్వారా ఎన్ని జన్మలెత్తినా పురుషార్థము సిద్ధించదు అని నారదుడు వ్యాసమహర్షితో చెప్పిన ఈ మాటలలో పాదసేవ ప్రశస్తి ఎంత గొప్పదో అర్థమవుతుంది. అంతేకాదు, నారదుడు తన పూర్వజన్మ వృత్తాంతాన్ని వివరిస్తూ పూర్వజన్మలో నారదుని తల్లి ఒక దాసి యని, ఆమె బ్రాహ్మణుల ఇంట్లో దాసి పనులు చేస్తూ వారి ఇంటికి వచ్చే పండితోత్తములు భగవంతుని కీర్తనలు చదవగా వాటిని

శ్రవణం చేయడం, వారికి పాదపూజ చేయడం ద్వారా ఈ జన్మలో శ్రీహరి కృపా కటాక్షాలు సిద్ధించాయని నారదుడు పాదసేవా భక్తి విశిష్టతలను వ్యాసునికి వివరించాడు.

"నీ పాద కమలసేవయు
నీ పాదార్చకుల తోడి నెయ్యము నితాం
తాపార భూత దయయును
దాపసమందార! నాకు దయసేయ గదే"

స్వామీ! నీ రాకచే నాకు అన్ని సౌభాగ్యములు సమకూరినవి. ఇంక నాకేమి కావలయును. నీ పాదకమలముల సేవాభాగ్యము, నీ పాదదాసులతోడి సాంగత్యమును, అపారమైన భూతదయయును ప్రసరించే ఓ తాపస మందారా, అపర ప్రేమను వర్షించే తాపస పారిజాతమా! నన్ను అనుగ్రహించు. ఇంతటి ఉత్తమమైన కోర్కెను కోరిన సుదామునకు స్వామి ఆయురారోగ్యములను, భక్తి జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించాడని భాగవతములోని దశమ స్కంధము తెలుపుచున్న భావాన్ని బట్టి చూస్తే పాదసేవ భక్తి ఎంత గొప్పదో తెలుస్తుంది.

కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వరుడు తిరుమల శేషశైలముపై మొదట పాదము మోపిన శ్రీ పాదముద్రలను చూసి అన్నమయ్య "బ్రహ్మ కడిగిన పాదమని" తన్మయత్వంలో ఆ వేంకటనాథుని పాదాన్ని ఇలా కీర్తించాడు.

"బ్రహ్మ కడిగిన పాదమూ – బ్రహ్మమే తానినీ పాదమూ
చెలగి వసుధ గొలిచిన పాదము – బలి తల మోపిన నీ పాదము
తలకక గగనము తన్నిన పాదము – బలరిపు గాచిన పాదమూ
కామిన పాపము కడిగిన పాదము – పాము తలపై నిడిన పాదము
ప్రేమము శ్రీసతి పిసికెడు పాదము – పామిడి తురగము పాదము
పరమ యోగులకు పరి పరి విధముల – వరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన – పరమపదము నీ పాదము

అని ఈ కీర్తనలో పాదసేవ గురించి వర్ణించి కైవల్యం పొందిన అన్నమయ్య పరమ భక్తాగ్రేసరుడు.

ఈ కీర్తనలో బ్రహ్మ కడిగిన పాదమని ఒక విశేషమున్నది. బలి చక్రవర్తి వామన రూపంలో ఉన్న విష్ణుమూర్తికి మూడడుగుల నేలను దానము చేయగా ఒక అడుగు భూమిపై నిడి మరొక అడుగు ఆకాశము వైపు సారించగా ఆ పాదము భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోకములు దాటి బ్రహ్మలోకానికి చేరుకోగానే బ్రహ్మదేవుడు –

"తన పుట్టిల్లిదే పొమ్మటంచునజుండుందన్నాభి పంకేరుహం
బు నిరీక్షించి నటించియున్న తపదంబుంజూచి తత్పాదసేవ
చనము జేసె గమండలూదకములం జల్లించి తత్తోయముల్
వినువీధిన్ బ్రవహించె దేవనది నా విశ్వాత్ము కీర్తి ప్రభన్"

విష్ణుమూర్తి విరాట్స్వరూపుడై ఊర్ధ్వలోకములను అధిగమింపగా బ్రహ్మ విష్ణువు నాభీ స్థలము జూచి, అది తన జన్మస్థలమని భావించి తన కమండలములోని జలమును చల్లెను. ఆ విరాడ్రూపుని పాదములను కమండలములోని జలము కడుగగా మహావిష్ణువు మహిమచే ఆ జలమే దేవనదియై ప్రవహించసాగెను. దీనిని బట్టి పాదసేవనం లేదా పాదపూజకు ఎంతటి విశిష్ట స్థానము కలదో బోధపడుతుంది. ఈ సేవామార్గాన్ని అవలంబించి ప్రతి ఒక్కరూ మోక్షం పొందడానికి ప్రయత్నించాలి.

అంతేకాదు పాదసేవ చేయని వాని గురించి తెలుపుతూ...

"హరి పద తులసీదళ మోదరతి లేని
ముక్కు పందిముకు ముని చరిత్ర
గరుడ గమన భజన రతి లేని పదములు
పాదపముల పదపటల మనఘ!"

ఓ రాజా! విష్ణుకీర్తనలను వినని చెవులు కొండలలో నున్న బిలములు, శ్రీహరిని స్మరించే పద్యములన్నియు చదువని నాలుకలు కప్ప నాలుకలు. లక్ష్మీనాథుని సుందర రూపాన్ని చూడని కన్నులు నెమలి కన్నుల వంటివి. విష్ణుదేవుని పూజకు వినియోగింపబడని చేతులు చచ్చినవాని చేతులు, శ్రీహరి పాదార్పితమైన తులసీదళ గంధము నందు ప్రీతిలేని ముక్కు పందిముక్కు, విష్ణుభజన వైపు నడిచి వెళ్ళని పాదములు వృక్షముల వ్రేళ్ళవంటివి. అనగా శ్రీహరిని కీర్తించని, స్మరించని, పూజించని, పాదసేవ చేయలేని, భజనల వైపు వెళ్ళని మానవ జన్మ వ్యర్థమని శుకమహర్షి పరీక్షిత్తుతో చెప్పాడు.


"నారాయణా నిన్ను నమ్మిన నాకు
మేరతో నీ పాదమే గతి గలిగె
చింతా జలధుల చిక్కిన దాటించ
నంతట నీ పాదమదే తేప
కాంతల మోహపు కట్లు దెంచగ
పంతపు నీ పాద పరశువు గలిగె
అతి దురిత పంకమంటిన కడుగగ
మితి నీ పాదమే మిన్నేరు
రతి కర్మజ్ఞులు రాచిన నార్చక
వ్రతము నీ పాదము వానయై నిలిచె
జిగిన జ్ఞానపు చీకటి వరయగ
తగు నీ పాదము దయపు రవి
అగు శ్రీవేంకటనాథ నన్నేలగ
మిగులగ నీ పాదమే శరణంబు"

ఆ శ్రీమన్నారాయణుని పాదసేవ వలన కలిగే ఫలితాల గురించి ఈ కీర్తనలో చక్కగా వర్ణించి, ఈ భక్తిమార్గం ద్వారా ముక్తిని పొందవచ్చునని నిరూపించాడు పరమ భక్తుడైన అన్నమయ్య.

★★★

# ఆమలక ఏకాదశీ వ్రత వైశిష్ట్యమ్

– చిల్లర సీతారామారావు



శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన వ్రతములలో ''ఆమలక ఏకాదశీ వ్రతము'' చాలా విశిష్టత కలిగిన వ్రతము. ఈ వ్రతము ఫాల్గుణ మాసమున శుక్లపక్ష ఏకాదశి నాడు వస్తుంది. ఈ వ్రతమును ఆచరించుట వలన భవ బంధములనుండి విముక్తి లభిస్తుంది. మహత్తరమైనది ఆమలకము.

**శ్లో ॥ తస్యమూలే స్థితో విష్ణుస్తర్ధూర్వంచ పితామహ**
**స్కందేచ భగవాన్ రుద్రః సంస్థితః పరమేశ్వరః**

ఆమలక వృక్షమునకు మూలమున విష్ణువు, పైభాగమున బ్రహ్మ, స్కందమున పరమేశ్వరుడైన రుద్రుడు ఉంటారు అని పురాణోక్తి. ఆమలక వృక్ష జనార్దనః. ఆమలక వృక్షము జనార్దన స్వరూపము. సర్వదేవమయము.

ఒకసారి కొందరు మహర్షులు శ్రీమహావిష్ణువును దర్శించుకొని, ఆమలక ఏకాదశీ వ్రతవిధానమును తెలియజేయవలసినదని ప్రార్థించారు. వారి ప్రార్థనను మన్నించి విష్ణువు ఆమలక ఏకాదశీ వ్రత విధానమును వివరించసాగాడు.

ఆమలక ఏకాదశికి పూర్వము నుండియే శక్త్యానుసారము సువర్ణముతో పరశురామ విగ్రహమును చేయించుకోవాలి. ఆ రోజున వేకువ జాముననే లేచి దంతధావనము, స్నానాదికములు పూర్తి గావించుకోవాలి. గృహము నందలి పూజామందిరమును శుభ్రపరచుకోవాలి. మంటపమును నిర్మించుకోవాలి. గుమ్మములకు తోరణములు కట్టాలి. గడపలకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టాలి. మంటపము మధ్యభాగమున తెల్లని వస్త్రమును పరచాలి. పరచిన వస్త్రము మీద బియ్యమును పోయాలి. దాని మీద పరశురాముని విగ్రహము నుంచాలి. షోడశోపచారములతో పూజలు చేయాలి. తరువాత పూజా సామగ్రిని తీసుకుని ఆమలక వృక్షము దగ్గరకు వెళ్ళాలి. వృక్షము నలువైపులా శుభ్రము చేయాలి. నీళ్ళు చల్లాలి. వృక్ష సమీపమున కలశమునుంచాలి. కలశమును పసుపు, చందనము, పుష్పములు మున్నగు వాటితో అలంకరించాలి. కలశమును నీటితో నింపి గంధమును వేయాలి. పిదప కలశమును తెల్లని వస్త్రముతో కట్టాలి. దానిమీద పరశురాముడి ప్రతిమనుంచి షోడశోపచార పూజలు చేయాలి. మంచి ఫలములతో అర్ఘ్యమును సమర్పించాలి. పగలంతా ఉపవాసముండాలి. ఆ రాత్రంతా జాగరణ చేయాలి. జాగరణ సమయమున నృత్యము, సంగీతము, వాయిద్యము, ధార్మిక ఉపాఖ్యానము, విష్ణుగ్రంథ పఠన శ్రవణాదులు మున్నగువాటితో సమయమును గడపాలి. విష్ణుమూర్తిని స్మరించుకుంటూ 108 సార్లు గాని లేదా 28 సార్లు గాని ఆమలక వృక్షము చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. తెల్లవారిన తరువాత స్నానాదికములు పూర్తి గావించుకొని విష్ణువుకు హారతినివ్వాలి. పిదప కలశము, పరశురాముడి విగ్రహము, వస్త్రములు, చెప్పులు, గొడుగు మున్నగునవి బ్రాహ్మణునకు దానముగా ఇవ్వాలి. ఆమలక వృక్షము స్పృశిస్తూ, దాని చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. బ్రాహ్మణులకు భోజనములు పెట్టి దక్షిణ తాంబూలాదులతో వారిని సత్కరించాలి. ఈ విధముగా భక్తి శ్రద్ధలతో వ్రతమును ఆచరించిన వారికి సంపూర్ణ తీర్థములను దర్శించుకొనడము వలన లభించు పుణ్యము, దాన ధర్మముల ద్వారా లభించు పుణ్యము కన్నా మిక్కుటముగా పుణ్యసంపద ప్రాప్తిస్తుంది.

ఒకనాడు మాంధాత చక్రవర్తి వసిష్ఠుడితో మహాత్మా! ఆమలక ఏకాదశి వ్రతము విశిష్టమైనది. ఆ వ్రత కథను వినిపించవలసిందిగా ప్రార్థిస్తున్నాను అని అడిగాడు. వసిష్ఠుడు సమాధానమిస్తూ – రాజా! ఆమలక ఏకాదశి వ్రతము విశిష్టమైనది. ఈ వ్రతమును ఆచరించడం వలన అమితమైన పుణ్యసంపద ప్రాప్తిస్తుంది. వేయి గోవులను దానము చేస్తే ఎంతటి పుణ్యము లభిస్తుందో అంతటి ఫలము ఈ వ్రతాచరణము వలన లభించు పుణ్యముతో సమానము. వ్రతకథను వివరిస్తాను. వినుము.

పూర్వకాలమున వైదిశము అను రాజ్యమును చైత్రరథుడు

అను రాజు పరిపాలిస్తుండెడివాడు. ఆ రాజు గొప్ప విద్వాంసుడు. ధార్మికుడు. ఆ రాజు క్రమము తప్పకుండా ఏకాదశి వ్రతమును ఆచరించేవాడు. ప్రజల చేత కూడా చేయించెడివాడు. ఒకసారి ఫాల్గుణ మాస శుక్లపక్షమున ఏకాదశి తిథి నాడు 'ఆమలక ఏకాదశి' వచ్చింది. రాజు, ప్రజలు అందరూ భక్తి శ్రద్ధలతో ఆ వ్రతమును ఆచరించారు. సాయంత్రపు సమయమున ప్రజలందరితో కలిసి రాజు దేవాలయమునకు వెళ్ళాడు. విష్ణుభగవానుని దర్శించుకొని నమస్కరించాడు. రాత్రి జాగరణ సందర్భముగా పూజలు, హరికథలు మున్నగునవి ఏర్పాటు చేశాడు. రాత్రి సమయమున ఒక వ్యాధుడు తినడానికేదైనా దొరుకుతుందేమోనన్న ఆశతో దేవాలయమునకు వచ్చాడు. అక్కడ అందరూ మేల్కొనే ఉన్నారు. భగవత్సంబంధమైన హరికథలు, ప్రవచనాలు మున్నగునవి జరుగుతున్నాయి. ఒక మూల నక్కి కూర్చుని భగవత్సంబంధమైన కార్యక్రమములను చూస్తూ రాత్రంతా జాగరణ చేశాడు. ప్రాతఃకాలము కాగానే జనులందరూ తమ తమ గృహములకు వెళ్ళిపోయారు. వ్యాధుడు కూడా తన గృహమునకు వెళ్ళిపోయాడు. వ్యాధుడి భార్య అతనికి భోజనము పెట్టింది. భుజించిన కొద్దిసేపటికే వ్యాధుడు మరణించాడు. అమలక ఏకాదశినాడు ఉపవాసముండి, జాగరణ చేసి, భగవత్పూజలను చూచి, భగవద్గాథలను వినడం వలన లభించిన పుణ్యఫలముగా, ఆ వ్యాధుడు మరుసటి జన్మమున విదూరథుడు అను రాజునకు తనయుడిగా జన్మించాడు. ఆ రాజు తనయునకు వసురథుడు అను పేరును పెట్టి అల్లారుముద్దుగా పెంచుకోసాగాడు. యుక్తవయస్సు వచ్చిన తరువాత వసురథునకు పట్టాభిషేకము చేసి రాజ్యభారమును అప్పగించాడు. వసురథుడు విష్ణుభక్తుడు. అతడు ఏకాదశి వ్రతమును తాను ఆచరించేవాడు. ప్రజల చేత కూడా చేయించెడివాడు.

వసురథుడు ఒకనాడు వేటకు బయలుదేరాడు. చాలా సమయము వేటాడటములో గడిపాడు. అలసట చెందిన రాజు తిరిగి రాజ్యమునకు వెళ్ళిపోదామనుకున్నాడు. తిరుగు ప్రయాణములో దారి తప్పాడు. కొద్దిసేపు అలసట తీర్చుకుందామనుకుని ఒక వృక్షము క్రింద పడుకుని నిద్రపోయాడు. అదే సమయానికి అక్కడికి మ్లేచ్ఛుల గుంపు వచ్చి రాజును చూచింది. ఒంటరిగా ఉన్న రాజును సంహరించడానికి నిర్ణయించుకొని, రాజుమీద అస్త్ర శస్త్రాలు ప్రయోగించసాగారు మ్లేచ్ఛులు. ఆశ్చర్యకరంగా మ్లేచ్ఛులు రాజు మీద ప్రయోగించిన అస్త్రాలు పూలమాలలుగా మారి రాజు మెడలో పడసాగాయి. విచిత్రంగా కొన్ని అస్త్రాలు వెనక్కి మళ్ళి మ్లేచ్ఛులను సంహరించసాగాయి. అదే సమయానికి రాజు శరీరము నుండి ఒక దివ్య స్త్రీ ఆవిర్భవించి, మ్లేచ్ఛులతో యుద్ధం చేసి అందరినీ వధించింది. రాజు మేల్కొని మరణించిన మ్లేచ్ఛులను చూసి ఆశ్చర్యమునకు లోనయ్యాడు. నేను నిద్రలో ఉన్నప్పుడు ఈ మ్లేచ్ఛులను ఎవరు సంహరించి ఉంటారు? నా మెడలో పూలమాలలు ఎవరు వేశారు? అని ఆలోచనలతో సతమతమవసాగాడు. ఆ తరుణమున ఆకాశవాణి వినిపించింది. రాజా! ఎవరు మ్లేచ్ఛులను సహరించారని కదా నీ సంశయం? తన భక్తులు ఆపదలో ఉన్నప్పుడు విష్ణుభగవానుడే వారిని రక్షిస్తుంటాడు. అదేవిధంగా ఆపదలో ఉన్న నిన్ను భగవంతుడే రక్షించాడు.

వసురథుడు విష్ణుభగవానునకు నమస్కరించి, తన రాజ్యమునకు తిరిగి వచ్చాడు. ప్రతి సంవత్సరము ఏకాదశి వ్రతమును ఆచరిస్తూ ప్రజలందరి చేత ఆచరింపచేస్తూ, ప్రజానురంజకముగా పరిపాలన చేయసాగాడు.

రాజా! ఆమలక ఏకాదశీ వ్రతము మహిమాన్వితమైనది. ఏకాదశి వంటి గొప్ప తిథితో ఆమలకమును జత చేయడం వలన ఆమలకమునకు గల విశిష్టత స్పష్టమవుతున్నది. ఆమలకము యొక్క విశేషతలను వివరిస్తాను వినుము.

ఆధ్యాత్మికము గాను, ఆరోగ్యపరము గాను ఉపయోగపడే ఫలము ఆమలకము. ఆమలకమును తెలుగు భాషలో ఉసురుకాయ అని అంటారు. ఉసురును నిలుపునది కావున ఇది ఉసురుకాయ. కాలక్రమేణా ఉసురుకాయ ఉసిరిక కాయగా చలామణి లోనికి వచ్చింది. ఆమలకమునకు పలు పర్యాయ నామములు ఉన్నాయి. ఆరోగ్యము నిచ్చు గుణము కలది కనుక ఆమలకము అని, దాది వలె సర్వమును ధరించునది గావున ధాత్రి యనియు, వయస్సు నిలుపునది గావున వయస్థ అని, సారవంతమైనది కావున ఫలరవ అని, అమృతము వంటిది కావున అమృత అని, శీతవీర్యము కలది కావున శీతవీర్య అని పలు నామములతో ఆమలకము పిలువబడుతున్నది. అత్యంత పవిత్రమైన ఆమలకవృక్షమును స్త్రీ, పురుషులు ఎవరయిననూ నాటవచ్చును. నాటినవారు జనన మరణ చక్రము నుండి విముక్తులవుతారు. ఆమలక వృక్షము ఉన్న గృహము వైపు భూతప్రేతాదులు కన్నెత్తి చూడవు.

ఏకాదశి నాడు ఆమలక వృక్షమును పూజించిన ఆమలక విష్ణువు ప్రసన్నుడవుతాడు. ఆమలక వృక్షము ఉన్న గృహము నందు విష్ణువు, బ్రహ్మ, లక్ష్మీదేవి నివసిస్తారని పెద్దలు చెబుతున్నారు. ఏకాదశి నాడు ఉపవాసముండి, ద్వాదశి నాడు పారణ చేయడానికి ఆమలకమును కూడా స్వీకరించవచ్చును. ఏకాదశి నాడు ఒక ఎండు ఉసిరిక లభించినా దాని వలన లభించు పుణ్యము గంగ, కాశి, గయ, పుష్కర తీర్థములలో స్నానమాచరించినందువలన లభించు పుణ్యము కన్నా అధికమైన పుణ్య విశేష ఫలము కలది. ఇంతటి మహత్తరమైన ఆమలక ఆవిర్భావ గాథను తెలియజేస్తాను ఆలకించుము.

పూర్వకాలమున, ప్రళయ సమయమున, జగత్తంతా

ఏకార్ణవ జలములతో నిండిపోగా, చరాచర ప్రాణులన్నీ నశించిపోయాయి. ఆ సమయమున బ్రహ్మ పరమాత్మను గురించి తపము చేయసాగాడు. బ్రహ్మ తపమునకు ప్రసన్నుడైన పరమాత్మ ప్రత్యక్షమయ్యాడు. పరమాత్మను గాంచిన ఆనందముతో బ్రహ్మ నేత్రముల నుండి కన్నీరు ప్రవహించి భూమి మీద పడింది. ఆ కన్నీరే ఆమలక వృక్షముగా ఉత్పన్నమయింది. సృష్టిలో అన్ని వృక్షముల కన్నా ముందే ప్రకటితమవడం వలన ఆమలకమును ''ఆదిరోహ'' అని పిలవసాగారు. ఆమలక వృక్షమును చూచి దేవతలు ఆశ్చర్యచకితులయ్యారు. వారి ఆశ్చర్యమును గమనించిన ఆకాశవాణి ఇలా పలికింది.

''అన్ని వృక్షముల కన్నా ఆమలక వృక్షము సర్వశ్రేష్ఠము. ఈ వృక్షము విష్ణు భగవానునకు అత్యంత ప్రీతికరము. దీనిని స్మరించిన మాత్రముననే గోదాన ఫలము ప్రాప్తిస్తుంది. ఆమలక ఫలమును భక్షించిన వెంటనే మూడు రెట్ల పుణ్యము ప్రాప్తిస్తుంది. స్పర్శించినంత మాత్రముననే రెండు రెట్ల పుణ్యఫలము ప్రాప్తిస్తుంది'' అని పలికింది.

ఆమలక ఫల భక్షణము ఆయువును పెంచుతుంది. ఆమలక చూర్ణమును నీటియందు కలిపి స్నానము చేస్తే సమస్త దరిద్రాలు తొలగిపోతాయి. ఐశ్వర్య ప్రాప్తి కలుగుతుంది. ఆదివారము, శుక్రవారము, షష్ఠి, సప్తమి, ప్రతిపద, నవమి, అమావాస్య రోజులలో ఆమలకమును త్యజించాలి. ఆమలకములో 'సి' విటమిన్ అధికంగా ఉంటుంది. దానివలన శరీరమునకు కావలసిన శక్తి సామర్థ్యములు లభిస్తాయి. ఆమలకము శీతగుణము కలది. జీర్ణశక్తిని పెంపొందింప చేస్తుంది. శరీరపు ఉష్ణమును తగ్గిస్తుంది. వీర్యవృద్ధిని కలిగిస్తుంది. ఆమలక భక్షణము వలన రక్తము శుద్ధమవుతుంది. శరీరములో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఆయుర్వేదిక ఔషధములలో ముఖ్యమైన పదార్థము ఆమలక చూర్ణము. చ్యవనప్రాశయను ఔషధము ఆమలకముతో తయారవుతుంది. ఒకసారి చ్యవన మహర్షి అశ్వినీ కుమారులను దర్శించుకొని వృద్ధాప్య భారము నుండి కాపాడవలసిందని ప్రార్థిస్తాడు. అశ్వినీదేవతలు చ్యవనమహర్షికి నిత్యము ఆమలక ఫలమును తినమని సలహా ఇచ్చారు. చ్యవన మహర్షి వారి సూచన ప్రకారము ఆమలకమును రోజూ తినసాగాడు. కొంతకాలానికి ఆయన వృద్ధాప్య భారం తొలగిపోయింది. ఆయన పేరు మీద దానికి ''చ్యవన ప్రాశ'' అని పేరు వచ్చింది. తేజమును, బలమును, యువావస్థను స్థిరముగా నుంచుటకు, వృద్ధాప్య భారమును తొలగించుటకు సర్వశ్రేష్ఠ ఆయుర్వేదిక ఔషధము ఆమలకము అని చెబుతుంటారు.

ఆధ్యాత్మికపరంగాను, వైద్యపరంగాను మహత్తరమైనది ఆమలకము. విష్ణువుకు ప్రీతికరమైన ఆమలక ఏకాదశీ వ్రతమును ఆచరించి, భగవంతుడి దీవెనలను పొందుదాము.

# తీర్మానపు హారతి

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**

తిరుమలలో స్వామివారికి జరిగే నిత్య సేవలలో ఆఖరి సేవ పవళింపు సేవ. ఈ హారతిని 'తీర్మానపు హారతి' అంటారు. ఈ తీర్మానపు హారతి ఇచ్చే సంప్రదాయం ఎప్పటినుంచి, ఎలా మొదలయిందీ, దీనికి సంబంధించిన మూలం ఏమిటీ అనే విషయాన్ని గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

శ్రీనివాసుని పరమ భక్తురాలైన తరిగొండ వేంగమాంబ ఇరవై ఏళ్ళ వయసులో నా అన్నవారు లేకుండా ఒంటరిగా తిరుమల కొండకు చేరుకొంది. ఆమె రోజంతా ఆనంద నిలయాన్నే అంటిపెట్టుకొని ఉండేది. తులసీప్రియుడైన శ్రీహరి కోసం తిరుమల కొండపై తులసీవనం పెంచుకొనేది. ఉదయం తులసిమాలలు–పూలమాలలు కూర్చి ఆలయంలో మూలమూర్తికి సమర్పించేది. మధ్యాహ్నం స్వామి వారి మీద కవితలు, గ్రంథాలు, పాటలూ రచిస్తూ సాహితీ సేవ చేసుకొనేది. సాయంత్రం ఆలయానికి వెళ్ళి స్వామివారికి ఆనంద కర్పూర నీరాజనం సమర్పించి, ఆ కర్పూర కాంతిలో శ్రీహరిని దర్శించి ఆనంద తన్మయత్వంలో ఇంటికి చేరేది. ఇదీ ఆమె దినచర్య.

ఒకనాడు వెంగమాంబ హారతి పళ్ళెంతో తిరుమల ఆలయంలో శ్రీవారి సన్నిధికి వెళ్ళింది. ఆమె స్వామికి కర్పూర నీరాజనం సమర్పిస్తున్న సమయంలో శ్రీవారి మూలమూర్తిలో వెంగమాంబ గారికి దశావతార దర్శనం జరిగింది. తరువాత బ్రహ్మాండ భాండాలతో ఆవరించి ఉన్న శ్రీవారి విరాట్ తేజో స్వరూప దర్శనం చర్మ చక్షువులతో సజీవంగా చేసుకొనే భాగ్యం కూడా వెంగమాంబకు లభించింది. ఆనాటినుండి ప్రతిరోజూ చిట్టచివరిగా వెంగమాంబ గారి కర్పూరహారతి లేనిదే ఆలయం మూసివేయ కూడదనీ, ఆ కర్పూర హారతి అయిన తరువాత మరే ఇతర హారతులు ఇవ్వరాదని, ఇతర సేవలు చేయరాదని, ఆలయ ద్వారాలు మూసివేయాలని అంటే వెంగమాంబ ఇచ్చే హారతి తీర్మానపు హారతి కావాలని వేంకటేశ్వరస్వామి అర్చకముఖంగా ఆవహించి ఆదేశించాడు. అప్పటినుంచి ప్రతిరోజూ ఏకాంతసేవా సమయంలో చిట్టచివరగా పరమభక్తురాలైన వెంగమాంబ గారి పేరు మీదుగా తీర్మానపు హారతి ఇచ్చిన తరువాత తిరుమల ఆలయ ద్వారాలు మూసివేయబడతాయి. ఈ తీర్మానపు హారతినే ముత్యాల హారతి అంటారు. తరిగొండ వారి ముత్యాల హారతి అని కూడా అంటారు.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ–పురుషులకు విందు వినోదాలు ఉంటాయి. పిల్లల విషయంలో కొంత అనుకూలత కనిపిస్తుంది. పిల్లలకు సంబంధించి హామీలు ఇచ్చే ముందు బాగా ఆలోచించాలి. స్త్రీల పరిచయం ఉంటుంది. కొన్ని తొందరపాటు పనులకు ఇది అనుకూల సమయం కాదు. తెలియని ఆటంకాలు ఎదురయ్యే సూచనలు ఉన్నాయి. ఎంత ఓర్పు ప్రదర్శిస్తే అంత మంచి జరుగుతుంది.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులు జాగ్రత్తగా ఉండవలసిన రోజులు. బంధువులు, మిత్రులతో భేదాభిప్రాయాలు కలగవచ్చు. గృహశాంతి వలన అవరోధాలు తొలగి, శుభవార్తల ద్వారా ఆనందం పొందగలరు. పిల్లల అనారోగ్య సమస్యల పట్ల జాగ్రత్తలు పాటించాలి. శాంతి పూజలు చేయడం శ్రేయస్కరం.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు ప్రతి విషయంలో అనుకూలత ఉంటుంది. విందు వినోదాలు, సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఎదుటివారు మిమ్మల్ని అర్థం చేసుకొని మార్పు చూపుతారు. ప్రతి విషయంలో కొంత వెసులుబాటు లభిస్తుంది. గురుబలంతో ధర్మ సంబంధమైన విషయాలను బోధించడం, క్లాసులు చెప్పడం ద్వారా విదేశీ ప్రయాణ యోగం ఉంది.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్యంగా ఉంటుంది. బంధుమిత్రుల కలయిక, వివాహ ప్రయత్నాలు ఫలించడం, వాహన లాభం, వ్యవహార జయం సూచించబడుతున్నాయి. అందరితో ప్రేమగా, అనుకూలంగా మెలిగితే విజయం మీదే అని మరవకండి. సత్యదేవుని వ్రతం ఆచరించండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ–పురుషులకు ప్రతి విషయం అర్థం కాకుండా అనిపించవచ్చు. అన్ని విషయాల్లో ఓర్పు అవసరం. బంధుమిత్రులతో మాట్లాడేటప్పుడు ఎంతో జాగ్రత్త వహించాలి. తొందరపాటు నిర్ణయాల వలన పశ్చాత్తాపం కలగవచ్చు. నాలికను అదుపులో ఉంచుకోవాలి. నవగ్రహ ప్రదక్షిణలు చేయడం శుభప్రదం.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూలంగా ఉంటుంది. బంధుమిత్రుల ఆదరాభిమానాలు లభిస్తాయి. వివాహ ప్రయత్నాలు, ఆభరణాలు, స్థిరాస్తి లేదా విలువైన వస్తువులు కొనుగోలు చేయడానికి అనుకూల రోజులు. మొత్తం మీద ప్రతి విషయంలో సానుకూల ఫలితాలు ఉంటాయి. సత్యదేవుని వ్రతం చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులు విందు వినోదాలకు పెద్దపీట వేస్తారు. కీలక పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయి. ధన వ్యవహారాల్లో అత్యంత జాగ్రత్త అవసరం. మీ తెలివితేటలు మిమ్మల్ని ముందుకు నడిపిస్తాయి. స్త్రీల కారణంగా అపాయాలు కలగవచ్చు. పోలీస్ సంబంధిత తలనొప్పులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయి. సత్యదేవుని వ్రతం చేయడం మంచిది.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూలత ఉంటుంది. తొందరపాటు నిర్ణయాల వలన శ్రమ కొంత అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ అవసరం. అనారోగ్య సమస్యలు సూచించబడుతున్నాయి. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఆపరేషన్ వాయిదా పడే అవకాశం ఉంది. ఆదిత్య హృదయ పారాయణ చేయడం శుభప్రదం.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు శుభకార్యాలలో ఆటంకాలు ఎదురయ్యే సూచనలు ఉన్నాయి. ద్వేషం, కలహాలు, మాటల యుద్ధాలు కలగవచ్చు. ఇవన్నీ చెప్పుడు మాటలు, సావాస దోషాల వలన వచ్చినవని గ్రహించి పశ్చాత్తాపంతో ముందుకు సాగాలి. సత్యదేవుని వ్రతం, నవగ్రహ ప్రదక్షిణలు చేయడం ద్వారా సమస్యలు తొలగుతాయి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ–పురుషులకు తెలియని అవరోధాలు, మాట పట్టింపులు, గౌరవ భంగం కలగవచ్చు. ఆడంబరాల కోసం ధన వ్యయం జరుగుతుంది. దుసహవాసం వలన ఋణబాధలు కలగవచ్చు. బయటి వారితో వ్యవహారాల్లో జాగ్రత్త అవసరం. సత్యదేవుని వ్రతం చేయండి. కట్న కానుకలు తీసుకోరాదు.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు మనోవేదన కలగవచ్చు. బంధుమిత్రుల కలయికతో ఒత్తిడి, మనస్పర్థలు, అర్థం కాని భావోద్వేగాలు ఏర్పడతాయి. వివాహ ప్రయత్నాలు ఫలించే సూచనలు ఉన్నా, ఒకవైపు భయం, మరోవైపు సంతోషం ఉంటుంది. క్రమేణా అన్ని విషయాలు సర్దుబాటు అయి అందరి సహకారం లభిస్తుంది. సత్యదేవుని వ్రతం ఆచరించండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు బంధుమిత్రులతో ఆనందంగా గడిచే సమయం. వివాహ ప్రయత్నాలలో పండుగ వాతావరణం ఉంటుంది. వృత్తి, ఉద్యోగాలలో ఆకస్మిక ధనలాభాలు పొందే అవకాశాలు ఉన్నాయి. ఏదో ఒక రూపంలో ధనం అందుతుంది. సత్యదేవుని వ్రతం చేయడం శుభప్రదం.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. పుష్యమాసంలో వచ్చే సంక్రాంతిని ఏమంటారు?
2. సాయిరెడ్డి గారి సాధన దశ ఎప్పటినుండి నడిచింది?
3. లోపాముద్ర ఏ రాజ్యానికి రాజకుమారి?
4. ఇల్వలుడి తమ్ముడెవరు?
5. గోదాదేవి ఆచరించిన వ్రతమేది?
6. అన్నమయ్య వంశీకులకు జీవనభృతి కల్పించిందెవరు?
7. శ్రీరాముడు కాకి మీద వేసిన అస్త్రమేది?
8. అంబరీషునిపై ఆగ్రహించిందెవరు?
9. గోపాలకృష్ణ శతకం వ్రాసిందెవరు?
10. శ్రీవారి "కొలువు సేవ"కి మరో పేరు ఏమిటి?
11. సీతాదేవిని బాధించిన కాకి ఎవరు?
12. అగస్త్యాదులకు భగవద్దర్శనం గురించి చెప్పిందెవరు?
13. శ్రీవారి రెండవ ప్రాకారాన్ని ఏమంటారు?
14. స్మరణ భక్తికి ప్రసిద్ధుడెవరు?
15. పుష్యమాసం ఎవరికి ప్రీతికరం?

1. ..........................................................
2. ..........................................................
3. ..........................................................
4. ..........................................................
5. ..........................................................
6. ..........................................................
7. ..........................................................
8. ..........................................................
9. ..........................................................
10. ..........................................................
11. ..........................................................
12. ..........................................................
13. ..........................................................
14. ..........................................................
15. ..........................................................

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1.మార్గశిరం; 2. భట్టనాథుడు; 3. ఆండాళ్ – అనే పేరు గల చిన్ననాటి స్నేహితురాలి రూపంలో; 4. 07-11-2025 న; 5. ధర్ముని పుత్రులు; 6. సుగ్రీవుని మేనమామ; 7. అల్లూరి వెంకటాద్రి స్వామి; 8. అల్లూరి వెంకటాద్రి స్వామి; 9. శతానందుడు; 10. తరిగొండ వెంగమాంబ; 11. 18; 12. హనుమంతుడు; 13. మణి ముక్తా నది; 14. మంజులాదేవి; 15. యమధర్మరాజు

### సరైన సమాధానాలు రాసినవారు

1. పి. యశోద
2. చిల్ల సీతారామారావు
3. వి. రమణమూర్తి

### లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

వి. రమణమూర్తి



RNI No.: APTEL/2008/23122

Postal Registration No: HSE/879/2025-2027

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.





If Un Delivered Please Return to:

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007.Ph: 040-27175050.


డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq